www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

విజయవాడ సిటీ*

ANDHRAJYOTHI

వెల (Price) : Rs. 6.50

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 228

మంగళవారం | 3-12-2019 | పేజీలు: 12 + 16

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 11.15 తదుపరి అష్టమి; నక్షత్రం: ధనిష్ఠ మ. 2.17 తదుపరి శతభిషం; వర్జ్యం: రా. 10.20-12.08; దుర్ముహూర్తం: మ. 8.47-9.31, రా. 9.52-10.42; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 5.36

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Yadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

క్షమాభిక్షలతో సాగదీయొద్దు!

దిశ కోసం దద్దరిల్లిన పార్లమెంట్

పిటిషన్లకు అవకాశం ఎందుకు?.. పరిశీలన ఎందుకు?: వెంకయ్య

తక్షణ శిక్ష పడేట్లు చట్టాలు మారుద్దాం.. కేంద్రం సిద్ధం: రాజ్‌నాథ్

- రేపిస్టులను నడివీధిలో కొట్టి చంపాలి
- పార్లమెంటులో దిశా ఘటన ప్రస్తావన
- పార్టీలకు అతీతంగా ఎలుగెత్తిన ఎంపీలు
- అంగచ్ఛేదానికీ కొందరు ఎంపీల పిలుపు
- అన్ని అత్యవసరాలకూ 112 నంబర్
- రాష్ట్రాలతో సంప్రదిస్తున్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'జస్టిస్ ఫర్ దిశ' అని పార్లమెంటు నినదించింది. అత్యాచార కేసుల్లో సత్వర విచారణ, కఠినమైన శిక్షల అవసరాన్ని మరోమారు గుర్తు చేసింది. 'దిశ'పై జరిగిన అత్యాచారం, హత్యపై సోమవారం పార్లమెంటులో చర్చ జరిగింది. ఉభయ సభల్లో దాదాపు అన్ని పార్టీల ఎంపీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను తక్షణం ఉరి తీసేందుకు వీలుగా చట్టాల్ని మార్చాలని మెజారిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఏడేళ్ల క్రితం జరిగిన నిర్భయ కేసులోనే నిందితులకు శిక్ష పడలేదని గుర్తు చేశారు. నేరగాళ్లకు రసాయనిక అంగ విచ్ఛేదం, బహిరంగంగా కొట్టి చంపడం వంటి శిక్షలను సూచించారు. నిర్ణీత గడువులోలా శిక్ష అమలయ్యేలా చట్టంలో మార్పులు చేయాలన్నారు. ఇది

మిగతా 11వ పేజీలో...

కాకినాడలో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో మంత్రి కన్నబాబు, ఎస్పీ అద్నాన్ అస్మీ

ఇక జీరో ఎఫ్ఐఆర్

సరిహద్దుల సాకులొద్దు

తీవ్ర నేరాల్లో ఫిర్యాదు నిరాకరిస్తే ప్రాసిక్యూషనే

డీజీపీ సవాంగ్

మీ బ్యాంక్!

ఇది సర్కారు సొంత బ్యాంక్

- సర్కారు చెల్లింపులకు కొత్త వ్యవస్థ
- వేతనాలు, పింఛన్లు, పథకాల సొమ్ములన్నీ 'మీ బ్యాంకు' ద్వారానే!
- పీడీ ఖాతా తరహాలో నిర్వహణ
- సంక్షేమ పథకాల సొమ్ము విత్ డ్రాయల్‌పైనా పరిమితులు?
- నిధుల సమర్థ వినియోగమే లక్ష్యం
- ప్రాథమిక దశలో చర్చలు

జీతాలు, పెన్షన్లు, సామాజిక పింఛన్లు, పలు రకాల సంక్షేమ పథకాలు!

వీటికోసం ప్రభుత్వం చేసే చెల్లింపులన్నీ ప్రభుత్వ బ్యాంకు ద్వారానే! ఇది... 'మీ బ్యాంక్'. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావిస్తున్న సరికొత్త బ్యాంక్!

అందుబాటులో ఉన్న నిధులను సమర్థంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ఆర్థిక శాఖ సరికొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. అదే.. ప్రభుత్వ ఆధ్వర్యంలో సొంతంగా బ్యాంకు ఏర్పాటు! ప్రస్తుతానికి దీనిపై చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. సొంత బ్యాంకు ఏర్పాటుతో ఉన్న లాభాలపై లోతుగా చర్చ జరుగుతోంది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జీతాలు, పెన్షన్లు, సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఇలా అన్నీ కలిపి రాష్ట్ర ప్రభుత్వం సుమారు 4.5 కోట్ల మందికి చెల్లింపులు చేస్తోంది. ఇంతమంది వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. వేతనాలు, పెన్షన్ల కింద మొత్తం రూ.6000 కోట్లు చెల్లింపులు చేస్తుండగా, ఇందులో రూ.2 వేల కోట్లను ఒకటో తేదీనే చెల్లిస్తోంది. వీటిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రా బ్యాంకుల్లోని ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తోంది. ప్రభుత్వం తొలుత ట్రెజరీకి నిధులు బదిలీ చేస్తుంది. అక్కడి నుంచి ఆయా బ్యాంకుల్లోని ఖాతాలకు

మిగతా 2వ పేజీలో...

అయోమయంలో ఇరిగేషన్! 10

25% లోపు జరిగిన పనులపై అస్పష్టత

అప్పుల వేటలో సర్కారు

విద్యుత్ సంస్థల ఆస్తులు బదిలీ 2

6 దారులు.. 60 వేల కోట్లు

పోలవరం-బానకచర్ల ఎత్తిపోతలకు ఫీజిబులిటీ నివేదిక రెడీ 10

'పునరావాసం' తేల్చండి

దాన్నిబట్టే పోలవరం.. అంతా రాష్ట్రం చేతుల్లోనే: కేంద్రం

నిబంధనల మేరకే అదనపు చెల్లింపులని వెల్లడి 10

సాయంకోరి వస్తే..

వీరంతా కిడ్నీ మార్పిడి చేయించుకున్న వారు. అనారోగ్య పీడితులు. మందులకోసం ప్రతినెలా పదివేల దాకా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఆదుకోవాలని సీఎంను కోరేందుకు వచ్చారు. కానీ... పోలీసులు అడ్డుకున్నారు. తమ వాహనం ఎక్కించి, రాణాకు తరలించారు.

నా మతం మానవత్వం

మాట నిలబెట్టుకోవటమే నా కులం

- వైసీపీ మేనిఫెస్టోయే పవిత్ర గ్రంథం
- జనరంజక పాలనను జీర్ణించుకోలేకే కులం,మతంపై ప్రతిపక్షాల ప్రశ్నలు
- ఇన్ని పథకాలు అమలు చేయడానికి నా దగ్గర మంత్ర దండం ఏమీ లేదు
- జనం, దేవుడి ఆశీస్సులతో ముందుకు
- 13 వేల కోట్లతో అన్ని ఆస్పత్రులకు వచ్చే మూడేళ్లలో కొత్తరూపే లక్ష్యం
- మరో 7 దీర్ఘకాలిక రోగాలకూ పెన్షన్
- జనవరిలో కొత్త హెల్త్ కార్డులు: సీఎం
- ఆరోగ్య ఆసరా పథకం ప్రారంభం

ఆరోగ్యశ్రీ చికిత్స చేయించుకున్న వారికి చెక్ అందజేస్తున్న సీఎం జగన్

గుంటూరు (మెడికల్), డిసెంబరు 2: రాష్ట్రంలో ఆరు నెలలుగా ప్రజారంజక పాలన సాగుతుండడంతో జీర్ణించుకోలేకే ప్రతిపక్షాలు అనవసరంగా తన కులం, మతం ఏమిటని ప్రశ్నిస్తున్నాయంటూ ముఖ్యమంత్రి జగన్ మండిపడ్డారు. "ఇలాంటి మాటలు వింటే

మిగతా 9వ పేజీలో...

11

5 ఎకరాలు మేం అడగలేదు

- బాబ్రీ నిర్మాణంతోనే న్యాయం
- హిందూ పక్షాలు తప్పు చేశాయని కోర్టే చెప్పింది
- ఇది మసీదు ధ్వంసం చేసి.. ఆలయం కట్టుకోవచ్చని ఉత్తర్వు ఇవ్వడమే!
- సమీక్ష కోరిన అసలు కక్షిదారు

మార్చి 4 నుంచి ఇంటర్ పరీక్షలు

ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్స్ 2

నీట్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

11

జైలుకెళ్లడం ఇంగ్లీషు నేర్పిందా?

- జీవితాలు మారడమంటే ఇదేనా?
- పాలకులారా.. భాష జోలికి రావద్దు లేదంటే అపరదుర్గలా సరస్వతి
- భాషలను చంపితే సర్వ నాశనమే
- మీడియాన్ని తల్లిదండ్రులకొదిలేసి హాస్టళ్లలో వసతిపై దృష్టి పెట్టండి
- ఇంగ్లీషు చదవలేక చదువే మానేశా
- తిరుపతిలో పవన్ ఆవేదన
- కవులతో 'మన నుడి, మన నది' సమావేశం



కవుల భేటీలో ఆముక్తమాల్యదతో పవన్

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): "ఇంగ్లీషు మీడియంలో చదివితేనే జీవితాలు మారిపోతాయనుకుంటే, అదే మీడియంలో చదివినవారు జైలుకు ఎందుకు వెళతారు? అంటే జైలు కెళ్లడం ఇంగ్లీషు నేర్పిందా?" అని సీఎం జగన్‌ను ఉద్దేశించి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యంగ్యాస్త్రం విసిరారు. "మన రాష్ట్రంలో 64,630 ప్రభుత్వ

మిగతా 10వ పేజీలో...

కర్నూలులో చంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ కార్యకర్తలు

నాడు ముద్దులు.. నేడు గుద్దులు

9

- నా మీద కేసులు పెడతామని ఎలుక తోకనూ పట్టుకోలేకపోయారు
- సర్కారుని చూసుకొని మా కేడర్‌పై కేసులు పెడితే మూల్యం తప్పదు
- ప్రశ్నించిన వారికి వేధింపులా?.. పోలీసులపై చంద్రబాబు మండిపాటు
- రైతన్నకు 7.5 వేల భరోసా ఇచ్చి వైసీపీ కార్యకర్తకు మాత్రం 8 వేలా?
- ఇక భవిష్యత్తు నాయకత్వంపై దృష్టి.. టీడీపీ ఖాళీ అనేవారికి బదులిస్తా
- అన్నింటా బడుగులకు ప్రాధాన్యం.. కర్నూలులో చంద్రబాబు పర్యటన

ముద్ర ఎవరిది? ముద్ద ఎవరికి?

శ్రీకాకుళంలో రేషన్ డోర్ డెలివరీలో చిత్రాలు

1.14 లక్షల కార్డులకు వలంటీర్లదే వేలిముద్ర

- ఆ స్థాయిలో వారే ఎందుకు ముద్ర వేశారు?
- ఆ సరుకులు లబ్ధిదారులకు అందినట్లేనా?
- అధికారుల్లోనే రకరకాల సందేహాలు
- 100 శాతం అథెంటికేషన్‌తో సమస్య
- ఇప్పుడు మొత్తం కార్డులకు తొలగింపు
- ముద్ర పడని వృద్ధులకు అందని రేషన్

శ్రీకాకుళం జిల్లాలో సుమారు 12 లక్షల రేషన్ కార్డులున్నాయి. వారిలో 2 వేలు మినహా మిగిలిన కార్డుల వారంతా ప్రతినెలా తమ వేలి ముద్ర వేసే రేషన్ సరుకులు తీసుకునేవారు. కానీ... సెప్టెంబరులో ఏకంగా 1.14 లక్షల కార్డుల తాలూకు రేషన్ కోసం గ్రామ వలంటీర్లే వేలిముద్రలు వేశారు. అసలేం జరిగింది? అంత మంది తరఫున వలంటీర్లే ఎందుకు వేలి ముద్రలు వేశారు? ఈ రేషన్ అసలు లబ్ధిదారులకు అందిందనే గ్యారెంటీ ఏమిటి? ఇవి జిల్లా అధికారులను వేధిస్తున్న ప్రశ్నలు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఇంటి ముంగిటికే రేషన్' పథకంలో కొత్త సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన శ్రీకాకుళం జిల్లాలో అనేక చిత్రాలు చోటు చేసుకున్నాయి. వేలి ముద్రలు పడని వృద్ధులకు ఇబ్బంది కలుగకుండా... వారి తరఫున వలంటీర్లే వేలి ముద్ర వేసే వెసులుబాటు కల్పించారు. అయితే, కేవలం వృద్ధులవే కాకుండా వందశాతం కార్డులకు అథెంటికేషన్ ఇచ్చారు. జిల్లాలో ఒక్క సెప్టెంబరు నెలలోనే 1,14,789 మందికి వలంటీర్లు తమ వేలిముద్రలతోనే

మిగతా 10వ పేజీలో...

ఐదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చు

ఎన్‌వోసీ లేకుండానే రిజిస్ట్రేషన్

2

ఆధార్, రేషన్ కార్డు అనుసంధానం.. ఇన్‌కం సర్టిఫికెట్ తప్పనిసరి

పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలపై రెవెన్యూ శాఖ అదనపు మార్గదర్శకాలు

11

'సిట్' ముందుకు అవినాశ్ రెడ్డి తండ్రి

- సీఎం మరో బంధువుకూ ప్రశ్నలు
- ఇద్దరు టీడీపీ నేతలపైనా విచారణ
- వివేకా హత్య కేసులో మళ్లీ కదలిక

పరంజ్యోతి

ధైవానుగ్రహానికి గుడికే వెళ్లాలా?

దైవానుగ్రహం ఎలా పొందాలి, ఎందుకు పొందాలి? అలా పొందడానికి ఎవరు మనకి సహాయ పడతారు? దైవానుగ్రహం పొందనీయకుండా అడ్డుపడేవి ఏమిటి? వాటినెలా తొలగించుకోవాలి? విగ్రహారాధన విశిష్టత ఏమిటి అసలు విగ్రహం అంటే ఏమిటి? దానిని ఆరాధిస్తే కలిగే ప్రయోజనం ఏమిటి? ..అనే ప్రశ్నలన్నింటికీ సమాధానం తెలుసుకోవాలంటే గుడికి వెళ్లాల్సిందే. విగ్రహారాధన చేయాల్సిందే. గుడి అనేది కేవలం ప్రార్థనా స్థలమో, కోర్కెలు విన్నవించుకునే, అపరాధ క్షమాపణ కోరే ఆరాధన కేంద్రమో కాదు. 'గుడి' అంటే మంత్ర, తంత్ర, ఆరాధనా శక్తితో, యజ్ఞ, యాగాదులు, దివ్యనామ స్మరణ, భజనల ప్రకంపనా బలంతో ఉండే మహిమాన్వితమైన, పరమ పవిత్రమైన ప్రదేశం. సామాజిక స్పృహ, ఆధ్యాత్మిక చైతన్యం, వదాన్యత, విశాలమైన హృదయం, 'పంచుకుంటే పెంచుకోగలం' అనే ఆలోచన, 'ఒక్కరుగా చేసే ప్రార్థనకన్నా సామూహికంగా చేసే ప్రార్థన, పారాయణ, భజనలకు ఎక్కువ శక్తి, ఫలితం ఉంటాయి' అని నమ్మే వారి ఆలోచనలు, ఆశయాలు, ఆచరణల మూర్తరూపమే, సమ్మిళిత మహత్ కార్యమే 'గుడి'. దివ్యత్వం సంతరించుకున్న దైవ సన్నిధి గుడి. అలాంటి గుడిలో కొలువై ఉండే విగ్రహాలు కేవలం రాతిబొమ్మలు కావు. మహితాత్ములైనవారు, సదా దైవాన్నే స్మరించే ఆచార్యులు, పీఠాధిపతులచే ప్రతిష్ఠించబడిన మంత్రమూర్తులు. 'విశిష్టంగా భక్తులలోని భక్తి శ్రద్ధలను గ్రహించేది, మంత్రాలతో దివ్యత్వాన్ని, పవిత్రతను సంతరించుకున్నది'.. విగ్రహం. వాస్తవానికి మన భావనయే దైవం. చెక్క, కొయ్య, పంచలోహ విగ్రహాలు, క్యాలండరులోని బొమ్మలు, మట్టిబొమ్మ, బంగారు, వెండి ప్రతిమలు.. మొదలగు వాటిలో మనం త్రికరణ శుద్ధిగా నిలుపుకునే దివ్యమైన భవ్యమైన 'భావన'యే దైవం. పర, వ్యూహ, విభవ, అర్చ, అంతర్యామి అనే ఐదు భగవత్ స్వరూపాలలో.. 'అర్చావతారం'లో అనగా విగ్రహరూపంలో మనకు అందుబాటులో ఉండేలా, సౌలభ్యాన్ని తన నిలువెల్లా నింపుకొని ఉన్నవాడే ఆ దైవం.

భక్తి, ముక్తి, భుక్తి.. ఈ మూడింటి కలయికగా ఉండడంతో బాటుగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ధార్మిక కేంద్రాలుగా అలరారుతూ.. పంచభూతాల (గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశం) శక్తిని కలిగి ఉండే ఆలయాల్లో దివ్య ప్రకంపనలు ఉంటాయి. అక్కడ ఏర్పాటు చేయబడే దివ్య ప్రవచనాలు, హరికథలు, నృత్య, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు మనకు దైవం, ఆత్మ, గురువు, సత్సంగం, ప్రార్థన, సేవ, ధ్యానం, దానం, వంటి పారమార్థిక విశేషాల గురించి తెలుపుతాయి. ఆత్మపరమాత్మల సంబంధం, దైవానుగ్రహం పొందనివ్వకుండా మనకు ఇబ్బందులు కలిగించే ప్రాపంచిక విషయాలను, బంధాలను, ఆకర్షణలను ఎలా తొలగించుకోవాలో మార్గదర్శనం చేస్తాయి. మనిషిని పశుత్వం నుండి మానవత్వం మీదుగా దివ్యత్వం వైపు పయనింపజేస్తాయి. సగుణ రూపంలో ఉండే విగ్రహాలను ఆరాధించడం ద్వారా ఏకాగ్రతను క్రమంగా పెంచుకుంటూ మన త్రిగుణాలనూ సగుణ తత్వం నుంచి నిరాకార తత్వం వైపు మళ్లించడానికి విగ్రహారాధనే దోహదం చేస్తుంది. అందుకే.. జననమరణ చక్రం నుంచి విముక్తి కల్పించే స్థాయికి సాధన చేరాలంటే తొలుత గుడికి వెళ్లాల్సిందే. విగ్రహారాధన చేయాల్సిందే.

- ఎం.లక్ష్మణాచార్యులు, 9640233930

లోకం తీరు

చలికి కాదు... ఫోన్ రీచార్జ్ చేసినందుకు వణుకుతున్నాడు..!

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
గుంటూరు	20.2	30.5
కర్నూలు	22.2	26.9
ఒంగోలు	23.6	28.3
విశాఖపట్నం	24.0	29.4
విజయవాడ	25.2	29.6

జీడీపీకి ప్రాధాన్యం లేదు.. అదేం బైబిల్ కాదు

స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)కి ఏమంత ప్రాధాన్యం లేదు. బైబిల్, రామాయణం, మహాభారతంగా దానిని పరిగణించనక్కర్లేదు. జీడీపీ కన్నా సుస్థిర ఆర్థికాభివృద్ధే ముఖ్యం.

- బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే

అజ్ఞాన ఆర్థికవేత్తల నుంచి దేవుడే కాపాడాలి

జీడీపీ క్షీణిస్తోంది. ఆర్థిక మందగమనం కనిపిస్తోంది. కానీ బీజేపీ మంత్రులు, ముఖ్యమంత్రులు, నేతలు మాత్రం ఆర్థిక పరిస్థితిపై ఏవేవో ఉదాహరణలు ఇస్తున్నారు. అలాంటి అజ్ఞాన ఆర్థికవేత్తల నుంచి ప్రజలను, దేశాన్ని ఆ దేవుడే కాపాడాలి.

- రణదీప్, కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి

రోజూ మూడుసార్లు దంతధావనంతో.. గుండె భద్రం

సియోల్, డిసెంబరు 2: రోజూ మూడుసార్లకు పైగా దంతధావనం చేస్తే గుండెపోటు ముప్పు తగ్గుతుందని దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని ఎవ్వా మహిళా వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. దంతధావనం సరిగ్గా చేయనివారి రక్తంలోకి బ్యాక్టీరియాలు చేరి.. హృదయ స్పందన రేటు గతితప్పేలా చేస్తున్నాయని తెలిపారు. అధ్యయనంలో భాగంగా 40 నుంచి 79 ఏళ్ల వయసు కలిగిన 1,61,286 మంది ఆరోగ్య నివేదికలను పదిన్నర ఏళ్లపాటు(2003-2014) సేకరించి, పరిశీలించినట్లు పేర్కొన్నారు.

వీవోఏల తొలగింపును అడ్డుకోండి

- గవర్నర్‌కు ఏపీసీసీ వినతి
- నెల్లూరులో వీవోఏ ఆత్మహత్యాయత్నం

అమరావతి/నెల్లూరు/విజయవాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సెర్ప్‌లో పనిచేస్తున్న సుమారు 28,000 మంది వీవోఏలను జగన్ ప్రభుత్వం అక్రమంగా తొలగిస్తోందని పేర్కొంటూ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు ఏపీ కాంగ్రెస్ నేత నూతలపాటి రవికాంత్ ఫిర్యాదు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వైసీపీ ఎమ్మెల్యేలు వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ వేధింపులకు తట్టుకోలేక పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారని గవర్నర్‌కు వివరించారు. ఇదిలావుంటే, నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం వీవోఏగా పనిచేసిన ఓ మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. డక్కిలి మండలం వెంబులూరు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి వెలుగు ప్రాజెక్టులో వీవోఏగా పనిచేసేవారు. పలు ఆరోపణల నేపథ్యంలో ఆమెను విధుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుండగా కలెక్టరేట్ ప్రాంగణంలో భాగ్యలక్ష్మి తనతోపాటు తెచ్చుకున్న నిద్రమాత్రలు మింగి స్పృహ కోల్పోయారు. గుర్తించిన ఎస్సై బలరామయ్య ఆస్పత్రికి తరలించారు.

సచివాలయ ఉద్యోగిపై వలంటీర్ దాడి!

విజయవాడ సూర్యారావుపేటలోని కర్నాటి రామ్మోహనరావు నగరపాలక సంస్థ స్కూల్‌లో గ్రామ సచివాలయ ఉద్యోగిగా సాధు మహ్మద్, గ్రామ వలంటీర్‌గా అరుణ కుమార్‌రెడ్డి పనిచేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని సాధు మహ్మద్, అరుణకుమార్ రెడ్డికి సూచించారు. అయితే అరుణ్‌కుమార్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మహ్మద్ ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి మహ్మద్‌పై అరుణ్ కుమార్ రెడ్డి దాడి చేశాడు.

మార్చి 4 నుంచి ఇంటర్ పరీక్షలు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను మార్చి 4 నుంచి నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శి వి. రామకృష్ణ సోమవారం పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం మార్చి 4 నుంచి మొదటి సంవత్సరం, 5 నుంచి రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 23 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఇంటర్ రెండో సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. జనవరి 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, జనవరి 30న ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలను నిర్వహించనున్నారు.

పరీక్షల షెడ్యూల్..

తేదీ	ఫస్టియర్	తేదీ	సెకండియర్
04-03-2020 బుధవారం	సెకండ్ లాంగ్వేజ్-1	05-03-2020 గురువారం	సెకండ్ లాంగ్వేజ్-2
06-03-2020 శుక్రవారం	ఇంగ్లిష్-1	07-03-2020 శనివారం	ఇంగ్లిష్-2
09-03-2020 సోమవారం	మ్యాథ్స్-1ఏ బోటనీ-1 సివిక్స్-1 సైకాలజీ-1	11-03-2020 బుధవారం	మ్యాథ్స్-2ఏ బోటనీ-2 సివిక్స్-2 సైకాలజీ-2
12-03-2020 గురువారం	మ్యాథ్స్-1బి జువాలజీ-1 హిస్టరీ-1	13-03-2020 శుక్రవారం	మ్యాథ్స్-2బి జువాలజీ-2 హిస్టరీ-2
14-03-2020 శనివారం	ఫిజిక్స్-1 ఎకనామిక్స్-1 క్లాసికల్ లాంగ్వేజ్-1	16-03-2020 సోమవారం	ఫిజిక్స్-2 ఎకనామిక్స్-2 క్లాసికల్ లాంగ్వేజ్-2
17-03-2020 మంగళవారం	కెమిస్ట్రీ-1 కామర్స్-1 సోషియాలజీ-1 ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్-1	18-03-2020 బుధవారం	కెమిస్ట్రీ-2 కామర్స్-2 సోషియాలజీ-2 ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్-2
19-03-2020 గురువారం	జియాలజీ-1 హోం సైన్స్-1 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1 లాజిక్ పేపర్-1 బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్-1 (బైపీసీ విద్యార్థులకు)	20-03-2020 శుక్రవారం	జియాలజీ-2 హోం సైన్స్-2 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2 లాజిక్ పేపర్-2 బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్-2 (బైపీసీ విద్యార్థులకు)
21-03-2020 శనివారం	మోడ్రన్ లాంగ్వేజ్-1 జియోగ్రఫి-1	23-03-2020 సోమవారం	మోడ్రన్ లాంగ్వేజ్-2 జియోగ్రఫి-2

ఏకైక విద్యార్థికి బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఒక్కరి కోసమే బడి!

ఈ చిత్రాన్ని చూశారుగా.. తరగతి గదిలో ఒకే ఒక్క విద్యార్థిని ఉండగా, ఉపాధ్యాయుడు పాఠం చెబుతున్నారు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండల పరిధి కొట్టక్కి గ్రామం ఎరుకులవాడ ప్రాథమిక పాఠశాలలోనిదీ దృశ్యం. మరి.. మిగిలిన విద్యార్థులేరీ.. అన్న సందేహం అక్కర్లేదు. కారణం.. ఇక్కడ రొంగళి మౌనిక(5వ తరగతి) మాత్రమే ఉండగా, భానుప్రకాశ్ అనే ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నారు. గ్రామంలో పది ఇళ్లు మాత్రమే ఉన్నాయి. ఐదో తరగతి లోపు చదివే పిల్లలెవరూ లేరు. మౌనిక మాత్రమే ఉంది. ఇదే విషయమై ఎంఈవో తిరుమలప్రసాద్‌ను సంప్రదించగా.. నిబంధనల మేరకు ఎస్టీ పాఠశాలను మార్చుచేయడానికి వీలులేదని, ఒక్క విద్యార్థి అయినా ఉపాధ్యాయుడు విధులు నిర్వహించాల్సి ఉందని చెప్పారు.

- రామభద్రపురం

ఐదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చు!

- పేదలకు ఇచ్చే ఇళ్లస్థలాలపై అదనపు మార్గదర్శకాలు విడుదల చేసిన రెవెన్యూశాఖ

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లస్థలాలు ఇంకా ఇవ్వలేదు. దానికి అవసరమైన భూ సేకరణే మొదలు కాలేదు. కానీ, ప్రభుత్వం ఇచ్చే ఇంటిస్థలాన్ని సొంత అవసరాలకోసం అత్యవసరమైతే ఐదేళ్ల తర్వాత లబ్ధిదారుడు అమ్ముకోవచ్చంటూ సర్కారు సంచలన నిర్ణయం తీసుకుంది. అలాంటి వాటిని ఎలాంటి అభ్యంతరాలు లేకుండానే రిజిస్ట్రేషన్ చేయాలని కూడా స్పష్టం చేసింది. ఈ మేరకు రెవెన్యూశాఖ 'నవరత్నాలు-పేదలందరికీ ఇంటిస్థలాలు' అమలుపై అదనపు మార్గదర్శకాలను విడుదల చేస్తూ జీఓ 488 జారీ చేసింది. వచ్చే ఉగాది నాటికి 25 లక్షల మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పథకం అమలు కోసం ఆగస్టు 18నే మార్గదర్శకాలు జారీ చేసింది. గత నెల 17 సీఎం జగన్ నేతృత్వంలో సమీక్ష చేసి అనేక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలపై అనేక తర్జనభర్జనల అనంతరం వాటి అమలుకు రెవెన్యూశాఖ మార్గదర్శకాలు ఇచ్చింది. దీని ప్రకారం అర్హులైన నిరుపేదలకే ఇంటిస్థలాలు కేటాయించనున్నారు. జీవితంలో ఒక్కసారే ఇంటిస్థలం ఇస్తారు. అంటే గతంలో ఒకసారి ప్రభుత్వం నుంచి భూమి పొందిన వారికి తిరిగి ఇవ్వరు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటిస్థలంపై ఐదేళ్లపాటు 'లాక్ పిరియడ్' ఉంటుంది. ఐదేళ్ల తర్వాత లబ్ధిదారుడు అమ్ముకోవచ్చు. అలా అమ్మిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ ఎలాంటి ఆటంకాలు పెట్టరాదు. అయితే, ఒకసారి ఆ స్థలాన్ని అమ్ముకున్న తర్వాత ఇక భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం ఆశించడానికి వీల్లేదు. శాశ్వతంగా ఇది వర్తిస్తుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఇదిలావుంటే, ఇంటిస్థలంపై రుణం తీసుకునేలా వెసులుబాటు కల్పించనున్నారు. దాన్ని బ్యాంకబుల్ డాక్యుమెంట్‌గా గుర్తించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

రూ.20 ఫీజు చెల్లించాలి

ఇంటిస్థలాల పంపిణీ ఉచితం కాదు. సగటున ఒక్కో లబ్ధిదారుడు రూ.20 చెల్లించాలి. ఇందులో రూ.10 స్టాంప్‌పేపర్‌కు, మరో రూ.10 ఇంటిపట్టా లామినేషన్‌కు అయ్యే ఖర్చుకింద వసూలు చేయనున్నారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డు ఉండాలి. రేషన్‌కార్డుకు అర్హులైన వారు(అంటే ఇంకా కార్డు తీసుకోని వారు) కూడా ఇంటిస్థలాలు పొందవచ్చు. అయితే, అలాంటి వారు మీ-సేవ నుంచి పొందిన ఇన్‌కం సర్టిఫికెట్ సమర్పించాలి. ఇంటిస్థలానికి ఆధార్, రేషన్‌కార్డులను అనుసంధానిస్తారు.

పట్టణాల్లో సెంటు స్థలమే

పట్టణ ప్రాంతాల్లో ఇంటి స్థలాలకోసం అవసరమైన భూమి ఉంటే లబ్ధిదారులకు సెంటు భూమిని ఇవ్వనున్నారు. ఇలా సగటున ఒక ఎకరంలో 55 మందికి ఇంటిస్థలాలు గా కేటాయిస్తారు. ఒక వేళ తగినంత భూమి లేకుంటే జీ+3 అపార్ట్‌మెంట్‌లు కట్టి కేటాయిస్తారు. కాగా, అభ్యంతరకరమైన ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను వెంటనే తొలగించాలని రెవెన్యూ శాఖ మార్గదర్శకాల్లో పేర్కొంది. అర్హులైన పేదలకు ఇప్పటికే ఇంటిస్థలాలు ఇస్తున్నందున, అదే కారణంతో కీలకమైన ప్రభుత్వ భూములను ఆక్రమించకుంటే అనుమతించవద్దని స్పష్టం చేసింది. ఎంపిక చేసిన భూముల్లో లేఅవుట్‌లు సిద్ధం చేస్తారు.

విజయనగరంలోని ఆర్‌అండ్‌బీ రైతు బజార్ వద్ద ఉల్లిపాయల కోసం బారులుదీరిన జనం

కర్నూలులో క్వింటా 10 వేలు

కర్నూలు(అగ్రికల్చర్), డిసెంబరు 2: ఉల్లి ధర ఆకాశానంటుతోంది. దేశంలో ఉల్లి కొరత తీవ్రం కావడంతో.. ఎన్నడూ లేని విధంగా కర్నూలు జిల్లాలో ఉల్లి ధరలకూ రెక్కలొచ్చాయి. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లి (గరిష్ఠం) రూ.10,180కు అమ్ముడు పోయింది. మధ్యస్థం ఉల్లి ధర రూ.8,700, కనిష్ఠ ధర రూ.2,050 పలికింది. పది రోజుల క్రితం ఇదే మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లి రూ.7,200కు అమ్ముడయింది. ఇప్పటికే బయటి మార్కెట్లో కిలో రూ.100 దాటి ఉండగా, తాజాగా ఉల్లి ధర మరింత పెరగడంతో రూ.120-రూ.150లకు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

ఉల్లి ధర నియంత్రణకు చర్యలు: సీఎస్

అమరావతి: రాష్ట్రంలో ఉల్లి ధరల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబకు తెలిపారు. సోమవారం ఢిల్లీ నుంచి కేబినెట్ కార్యదర్శి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉల్లిధర భారం ప్రజలపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో రూ.25కే కిలో ఉల్లి విక్రయిస్తున్నట్లు సీఎస్ తెలిపారు.

అప్పుల వేటలో ప్రభుత్వం

విద్యుత్ సంస్థల ఆస్తులు.. ఆర్థిక సంస్థకు బదిలీ

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పుల వేటను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా రుణ సేకరణను సులభం చేసేలా విద్యుత్ సంస్థల ఆస్తులను 'విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్'కు బదిలీ చేయాలని తాజాగా ఆదేశాలిచ్చింది. విద్యుత్ సంస్థలకు నిధుల సేకరణలో సహాయపడే నిమిత్తం రెండు దశాబ్దాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. విద్యుత్ సంస్థల్లో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం సంస్థలకు వాటి పరిధిలో భూములు, కార్యాలయాలు, విద్యుత్ టవర్లు, సబ్ స్టేషన్లు, విదుత్ ప్లాంట్లు వంటివి ఉన్నాయి. వాటిని తాకట్టు పెట్టుకొని ఈ సంస్థలు ఇప్పటిదాకా రుణాలు సేకరిస్తున్నాయి. కానీ తాజాగా ఈ విధానం మార్చేసింది. ఎవరికి వారుగా రుణాలు తెచ్చుకోవడం వల్ల వడ్డీ రేటు ఎక్కువ పడుతోందని, దీని బదులు విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను బలోపేతం చేసి దాని ద్వారానే రుణ సమీకరణ చేయాలని నిర్ణయించామని ఇందులో పేర్కొన్నారు. ఈ కార్పొరేషన్ ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ వద్ద నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌గా నమోదైందని, అందువల్ల దీని ద్వారా రుణ సమీకరణ చేయవచ్చని తెలిపారు. రుణ సమీకరణ చేయాలంటే ఈ కార్పొరేషన్‌కూ ఆస్తులు కావాలి. ఇప్పటికే తాకట్టు పెట్టినవి కాకుండా మరి కొన్ని ఆస్తులు ప్రభుత్వ విద్యుత్ సంస్థల వద్ద ఉన్నాయని, వాటిని వెంటనే ఈ కార్పొరేషన్‌కు బదిలీ చేయాలని ఆదేశించారు.

మీ బ్యాంక్!

(మొదటి పేజీ తరువాయి)

డబ్బు జమ అవుతుంది. జీతం సొమ్ములను ఉద్యోగులు వారి అవసరాల మేరకు డ్రా చేసుకుని వాడుకుంటారు. ఇదీ ప్రస్తుతం అమలులో ఉన్న విధానం. సహజంగా ఉద్యోగులు తమ వేతనం మొత్తాన్ని ఒకేసారి డ్రా చేసుకోరు. వారి అవసరాల మేరకు తీసుకుంటూ ఉంటారు. అయితే... ఇతర బ్యాంకుల ద్వారా వేతనాలు చెల్లించడం వల్ల అవి ప్రభుత్వ పరిధిలో లేకుండా పోతున్నాయి. అదే ప్రభుత్వం తరపున ఒక బ్యాంకు ఏర్పాటు చేసి దాని ద్వారా చెల్లింపులు జరిపితే ఉద్యోగులు డ్రా చేయకుండా ఉంచిన వేతనాల మొత్తం ప్రభుత్వ పరిధిలోనే ఉంటుంది. 'మీ బ్యాంకు' ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్యమైన ఆలోచన అని తెలుస్తోంది. ఒక గ్రీన్ చానల్ పీడీ ఖాతా తరహాలో 'మీ బ్యాంకు'ను నిర్వహించాలని భావిస్తున్నారు. వేతనాల నిధులతోపాటు సామాజిక పెన్షన్లు, నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నిధుల మొత్తాన్ని కూడా ఇదే తరహాలో ప్రతిపాదిత 'మీ బ్యాంకు' ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరవేయాలని ప్రభుత్వం భావిస్తోంది. లబ్ధిదారులు ఒకేసారి సంక్షేమ నిధులను డ్రా చేయకుండా... విత్‌డ్రాయల్‌పై పరిమితులు విధించాలనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు... అమ్మ ఒడి పథకం కింద రూ.15వేలు లబ్ధిదారు ఖాతాలో జమ అవుతుంది. దీనిని ఒకేసారి తీసుకోకుండా, విడతల వారీగా మాత్రమే వాడుకోవాలన్న మాట! అంటే... లబ్ధిదారులకు నిధులు విడుదల చేసినట్టు ఉంటుంది. ఆర్థిక శాఖ చేతిలో నిధులు ఉన్నట్టూ ఉంటుంది. అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, సామాజిక పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల నిధులను కూడా 'మీ బ్యాంకు' ద్వారా చెల్లించాలని భావిస్తున్నారు. లబ్ధిదారులకు ఆధార్, బయోమెట్రిక్ అనుసంధానిత ఖాతాలు ఇవ్వాలనే యోచనలో ఉన్నారు. ఈ విధానం విజయవంతమైతే ఆర్థిక శాఖకు నిధుల లభ్యత పెరుగుతుంది.

కేరళ ట్రెజరీ బ్యాంక్ మోడల్...

కేరళ ప్రభుత్వం కూడా ఇటీవల సొంత బ్యాంకు ఏర్పాటు చేసింది. దీనిని 'ట్రెజరీ బ్యాంక్' అని పిలుస్తున్నారు. అయితే... అక్కడ రాష్ట్రమంతా ట్రెజరీ బ్యాంకు సేవలు విస్తరించలేదు. ఒకటి రెండు శాఖల చెల్లింపులను మాత్రమే దీని ద్వారా చేస్తున్నారు. కేరళలో జిల్లా కోఆపరేటివ్ బ్యాంకులను రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకులో విలీనం చేశారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ రాష్ట్ర హైకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. మూడు రోజుల క్రితమే హైకోర్టు ఆ పిటిషన్లన్నింటికీ కొట్టేసింది. కేరళ ట్రెజరీ బ్యాంకుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అచ్చంగా ఇదే విధానం కాకపోయినప్పటికీ... ఏపీలో ప్రతిపాదిస్తున్న 'మీ బ్యాంకు' పనితీరు కూడా కేరళ ట్రెజరీ బ్యాంకు తరహాలో ఉంటుందని తెలుస్తోంది.

పీడీ చెక్కుల విధానంలో లావాదేవీలు

కేరళ తరహాలో ఏపీలో కోపరేటివ్ బ్యాంకుల విలీనం ఉండదు. 'మీ బ్యాంకు' కోపరేటివ్ బ్యాంకు కూడా కాదు. ఆర్థిక శాఖ ఒక గ్రీన్ చానల్ పీడీ ఖాతాను నిర్వహించినట్టుగానే 'మీ బ్యాంకు'ను నిర్వహిస్తుంది. అవసరమనుకుంటే వడ్డీ ఇచ్చే ఆలోచనలోనూ ఉంది. ఇందులో ఖాతాలున్న ఉద్యోగులకు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు పీడీ చెక్కుల తరహాలో ఒక చెక్‌బుక్ ఇస్తారు. దానిని ఉపయోగించుకొని ఆన్‌లైన్ ద్వారా ఇతర బ్యాంకులకు నిధులు బదిలీ చేసుకోవచ్చు. ప్రభుత్వం ప్రతి నెలా విధిగా చేయాల్సిన చెల్లింపుల నిధులన్నీ 'మీ బ్యాంకు'లో పెడుతుంది.

ఈ సౌకర్యాలు ఉంటాయా?

బయటి బ్యాంకుల్లో ప్రభుత్వోద్యోగులకు ఉండే వేతన ఖాతాలపై అనేక ప్రయోజనాలు లభిస్తాయి. గృహ నిర్మాణ, గృహ కొనుగోలు, గృహాల ఆధునికీకరణకు, వాహన కొనుగోలు, విద్యా రుణాలు, వ్యక్తిగత రుణాలు ఇస్తుంటాయి. వేతనాలను 'మీ బ్యాంకు' ద్వారా చెల్లిస్తే ఈ ప్రయోజనాల పరిస్థితి ఏమిటి? ఇప్పటికే తీసుకున్న రుణాల తాలూకు ఈఎంఐల చెల్లింపు ఎలా? ఇలాంటి అనేక అంశాలపై స్పష్టత లేదు. మరోవైపు... సంక్షేమ నిధులను పేరుకు ఒకేసారి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినప్పటికీ, విత్‌డ్రాయల్‌పై పరిమితులు విధించడమంటే వాయిదాల పద్ధతిలో సంక్షేమ ఫలాలు అందించినట్టే అవుతుంది.

భక్తుల మనోభావాలను కాలరాస్తున్నారు

- తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పత్రికలు, ప్రతిపక్షాలపై నెపం మోపడమా!
- తండ్రి వైఎస్ బాటలోనే తనయుడు జగన్
- మాజీ ఎమ్మెల్యే బొండా ఉమ విమర్శ

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): "తిరుమల పవిత్రతను దెబ్బ తీయడం ద్వారా శ్రీవారి భక్తుల మనోభావాలను వైసీపీ ప్రభుత్వం కాలరాస్తోంది. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పత్రికలు, ప్రతిపక్షాలపై ప్రభుత్వ పెద్దలు నెపం మోపుతున్నారు" అని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు ఆరోపించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన చేశారు. తిరుమల ఏడు కొండలు కాదు... రెండు కొండలు అన్న తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బాటలోనే తనయుడు జగన్మోహన్‌రెడ్డి కూడా నడుస్తున్నారని అన్నారు. తిరుమలలో అన్యమత ప్రచారాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం నానా తంటాలు పడుతోందన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వివరణ వింతగా ఉందన్నారు. తిరుమల కొండపై శిలువ గుర్తు వెలవడం, టీటీడీ వెబ్‌సైట్‌లో ఏసుక్రీస్తు బోధనలను అప్‌లోడ్ చేయడం, టీటీడీ టికెట్లపై అన్యమత ప్రచారం, అమరావతిలో శ్రీవారి ఆలయానికి నిధులు తగ్గించడం, తిరుమలలో దర్శనం, వసతి, అద్దె, ప్రసాదాల రేట్లు విపరీతంగా పెంచడం, తిరుమలపై మంత్రుల తిట్ల దండకం, డిక్లరేషన్‌పై సంతకానికి జగన్ నిరాకరణ, మైల ఉన్నప్పుడు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం వంటి అనేక ఘటనలు ప్రభుత్వ వ్యవహార శైలికి అద్దం పడుతున్నాయంటూ ధ్వజమెత్తారు. తమ కుట్రలను అ

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తెలుగు జాతి ఔన్నత్యానికి కృషి

▸▸ అమెరికాలో ముగిసిన బాలల సంబరాలు: 'నాట్స్'

గుంటూరు, డిసెంబరు 2: అమెరికాలో తెలుగు జాతి ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) కృషి చేస్తోందని సంఘం ప్రతినిధులు తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ సంస్థ డాలస్ చాప్టర్ పేరుతో తొమ్మిదేళ్లుగా బాలల సంబరాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది డాలస్‌లో నిర్వహించిన బాలల సంబరాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా సుమారు 150 తెలుగు కుటుంబాలకు చెందిన విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే కార్యక్రమాలతోపాటు.. గణితం, చదరంగం, పదకేళి వంటి పోటీలు నిర్వహించామని నాట్స్ ప్రతినిధులు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో నాట్స్ ఉపాధ్యక్షుడు శేఖర్ అన్నె మాట్లాడుతూ.. ప్రవాసాంధ్రుల పిల్లలకు తెలుగు ప్రాముఖ్యతను తెలియజేసి వారు భాషపై పట్టు సాధించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి నిర్వాహకులుగా డాలస్ చాప్టర్ కార్యదర్శి అశోక్ గుత్తా, కిశోర్ వీరగంధం, కార్యవర్గ సభ్యులుగా నాగిరెడ్డి మండల, ప్రేమ్ కలిదిండి, భాను లంక, నల్లపరెడ్డి కృష్ణ, శ్రీధర్ న్యాల మడుగుల, కిరణ్ జాలాది, దేవీ ప్రసాద్, విజయ్ కొండా, వెంకట్ పోలినీడు, వెంకట్ కోయలమూడి వ్యవహరించారు.

మన పొగాకు... మళ్లీ చైనాకు!

▸▸ నాలుగు దశాబ్దాల క్రితం నిషేధంతో ఆగిన ఎగుమతులు

▸▸ సుదీర్ఘ కృషితో భారత్ రానున్న చైనా ప్రతినిధుల బృందం

▸▸ 4న విజయవాడలో అధికారులు, వ్యాపారులతో భేటీ

▸▸ ధర పెరుగుతుందని రైతుల ఆశాభావం

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాల తర్వాత చైనా మళ్లీ భారత్ పొగాకును కొనుగోలు చేయనుందా...ఎగుమతులు పునరుద్ధరించడానికి ఏళ్ల తరబడి చేసిన కృషి ఒక కొలిక్కి రానుందా...పరిస్థితులు చూస్తే ఆశావహంగానే కనిపిస్తున్నాయి. చైనాలోని పొగాకు వ్యాపారులు, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు ఈనెల 4 నుంచి వారం రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. 4న విజయవాడలో పొగాకు బోర్డు అధికారులు, ఎగుమతిదారులు, వ్యాపారులతో భేటీ అవుతున్నారు. గుంటూరు, చీరాల, ఒంగోలు తదితర ప్రాంతాల్లో పొగాకు ప్రాసెసింగ్ యూనిట్లను ఈ బృందం తనిఖీ చేయబోతోంది. ఈ మేరకు ఢిల్లీలోని వాణిజ్యమంత్రిత్వ శాఖ నుంచి గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయానికి, బోర్డు చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబుకు సమాచారం అందింది.

నాలుగు దశాబ్దాల క్రితం ఏం జరిగింది...

1981కి ముందు ప్రతి ఏటా భారత్ నుంచి 15-20 మిలియన్ కిలోల పొగాకును చైనా కొనుగోలు చేసేది. దీంతో కొన్ని చిన్న చిన్న దేశాలు కూడా భారత్ పొగాకుపైనే దృష్టి పెట్టేవి. అయితే ఆ సమయంలోనే భారత్ నుంచి నాణ్యతలేని పొగాకు చైనాకు ఎగుమతి అయింది. అప్పట్లో ఈ పొగాకును దిగుమతి చేసుకున్న కొంతమంది అధికారులను అక్కడ ఉరి తీశారు. అప్పటి నుంచి భారత్ కొనుగోళ్లను చైనా నిషేధించింది. భారత్ ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా సంపూర్ణ పొగ నిషేధం ఈ దశలోనే అమల్లోకి వచ్చింది. పొగాకు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక సందర్భాల్లో భారత్ చైనాతో చర్చలు జరిపి ఎగుమతులు పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంది.

ఏడేళ్ల కృషి... మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో అప్పటి పొగాకు బోర్డు చైర్మన్ డాక్టర్ గోపాల్ చొరవ తీసుకుని ఇండియన్ టుబాకో అసోసియేషన్ (ఐటీఏ) బృందంతో కలిసి 2013-14లో చైనాలో పర్యటించారు. తర్వాత కూడా కేంద్ర వాణిజ్యమంత్రిత్వ శాఖ అధికారులు సంబంధాలను కొనసాగించారు. ఈ నేపథ్యంలోనే ఈనెలలో చైనా ప్రతినిధులు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ ఏడాది మన దేశం నుంచి 15-20 మిలియన్ కిలోలు పొగాకు చైనా కొనుగోలు చేస్తుందని రైతులు ఆశతో ఉన్నారు. భారత్ నుంచి నాణ్యమైన పొగాకును సరఫరా చేస్తామని ఏపీ పొగాకు బోర్డు చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు చైనా బృందానికి 4వ తేదీ రాత్రి విజయవాడలో వినతిపత్రం అందజేయబోతున్నారు. అలాగే చైనా ప్రతినిధుల పర్యటనతో రైతులకు మంచి ధర వస్తుందని వర్జీనియా పొగాకు రైతు సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ యలమంచిలి శివాజీ ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఆర్డీయే అధికారిణి గ్లోరియా సస్పెన్షన్ రద్దు!

▸▸ అభియోగాలపై ఆమె వివరణతో ప్రభుత్వం సంతృప్తి

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం అమలు చేసిన భూసమీకరణ పథకంలో అవకతవకలకు పాల్పడడం ద్వారా అర్హులైన రైతులకు అన్యాయం చేశారన్న ఆరోపణలపై సస్పెండైన అప్పటి ఏపీసీఆర్డీయేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.గ్లోరియా సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది! విధినిర్వహణలో గ్లోరియా ఉద్దేశపూర్వకమైన అలక్ష్యాన్ని ప్రదర్శించారని, అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారించే సాక్ష్యాధారాలన్నీ విచారణలో లభ్యమైనందున ఈ ఏడాది అక్టోబరులో గ్లోరియాను సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించిన ప్రభుత్వం... కొన్ని రోజుల వ్యవధిలోనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం గమనార్హం! 'నేనెన్నడూ రాష్ట్ర ప్రభుత్వం లేదా ఏపీసీఆర్డీయే నియమ నిబంధనలను ఉల్లంఘించలేదు. నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదు. తద్వారా నా చర్యల వల్ల ప్రభుత్వానికి ఏమాత్రమూ నష్టం వాటిల్లలేదు' అంటూ గ్లోరియా ఇచ్చిన వివరణతో సంతృప్తి చెంది, ఆమె సస్పెన్షన్‌ను రద్దు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ కార్యదర్శి వి.ఉషారాణి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు!

ఇదీ నేపథ్యం..!

రెవెన్యూ శాఖ నుంచి సీఆర్డీయేకు డిప్యుటేషన్‌పై వచ్చిన పి.గ్లోరియా కొంతకాలం క్రితం వరకూ రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు లోకల్ కాంపిటెంట్ అథారిటీగా వ్యవహరించారు. ఆ సమయంలో నేలపాడు పరిధిలో కొందరు అస్సైన్డ్ రైతులు ల్యాండ్ పూలింగ్ పథకం కింద అమరావతి కోసం అందజేసిన భూములకు బదులుగా వారికి కేటాయించాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను వారికి కాకుండా కొందరు అనర్హులకు కట్టబెట్టారంటూ గ్లోరియాపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీనిపై తాము ఫిర్యాదులు చేసినప్పటికీ ఆమెగానీ, సీఆర్డీయే ల్యాండ్స్ విభాగానికి అప్పట్లో డైరెక్టర్‌గా ఉన్న చెన్నకేశవరావుగానీ స్పందించలేదని పేర్కొంటూ బాధిత రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. వీటిపై అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) మాజీ ఈడీ బి.రామయ్యతో ప్రభుత్వం విచారణ జరిపించగా, వారిద్దరిపై వచ్చిన అభియోగాలు వాస్తవమేనని పేర్కొంటూ ఆయన నివేదిక సమర్పించారు. దీంతో ఈ ఏడాది అక్టోబరులో గ్లోరియాను విధుల నుంచి సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు... వివరణ ఇవ్వాల్సిందిగా చెన్నకేశవరావు(ఈ మధ్యనే రిటైర్ అయ్యారు)ను ఆదేశించారు.

వేధింపుల ప్రొఫెసర్‌పై విద్యార్థిని ఫిర్యాదు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనను ఓ ప్రొఫెసర్ ద్వంద్వార్థపు మాటలతో, అనుచితంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నారంటూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పరిధిలోని సామాజిక విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని... యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రాష్ట్ర గవర్నర్, పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేసింది. తాను ఇతర ప్రొఫెసర్ల దగ్గర పూర్తి వివరాలు తెలుసుకుని, మళ్లీ మళ్లీ రీసెర్చి రికార్డులు సమర్పిస్తున్నా...అన్నింటినీ తిరస్కరిస్తున్నారని వివరించింది.

పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

▸▸ చిన్నకుమారుడి మృతి

విజయవాడ/గన్నవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి తాళలేక చనిపోవాలనుకున్న తల్లి ఎలుకల మందు తాగి, ఇద్దరు పిల్లలకు కూడా తాగించింది. ఈ ఘటనలో ఒక కుమారుడు చనిపోయాడు. వివరాలు... కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాదకు చెందిన కొండ కోటేశ్వరరావుకు సూరంపల్లికి చెందిన అంకమ్మతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది క్రితం ఇంటి దగ్గరలోనే చిల్లర కొట్టు పెట్టుకున్నారు. కోటేశ్వరరావు కూలీ పనులకు వెళ్తే, ఇంటి వద్ద కొట్టును అంకమ్మ చూసుకుంటోంది. ఈ దంపతులకు హేమంత్, శంకర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కోటేశ్వరరావు ఆదివారం పనికి వెళ్లాడు. ఇంటి దగ్గరే ఉన్న అంకమ్మ విపరీతమైన కడుపు నొప్పి రావడంతో మందులు వేసుకుంది. అయినా నొప్పి తగ్గకపోవటంతో కొట్లో ఉన్న ఎలుకల మందు తీసుకుని పాలలో కలుపుకుని తాగింది. అనంతరం మూడు గ్లాసుల పాలలో ఎలుకల మందు కలిపిన పాలు హేమంత్, శంకర్‌కు తాగించింది. మధ్యాహ్నం చిన్న కుమారుడు శంకర్(5)కు వాంతులుకావడంతో కోటేశ్వరరావు సూరంపల్లిలోని ఆర్ఎంపీ వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లాడు. పిల్లలకు వాంతులు కావడంపై పలుమార్లు భార్యను ప్రశ్నించాడు. తనకు కడుపునొప్పి రావడంతో ఎలుకల మందు తీసుకున్నానని, దాన్ని పిల్లలకూ ఇచ్చానని చెప్పింది. వెంటనే ముగ్గురిని విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రెండో కుమారుడు శంకర్ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. బాలుడి మృతదేహానికి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఇంగ్లీషు మీడియం ప్రత్యేకాధికారిగా వెట్రిసెల్వి

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారి వెట్రిసెల్విని ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు పాఠశాల విద్యాశాఖ ఎక్స్‌అఫిషియో జాయింట్ సెక్రటరీగా ఆమె విధులు నిర్వహించనున్నారని పేర్కొంది.

అర్హులకే బియ్యం కార్డులు!

ఆహార భద్రతా చట్టాన్ని సవరిస్తూ పౌరసరఫరాల శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉండే వారి ఆదాయ పరిమితి నిబంధనలు సవరించింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10,000.. వార్షికంగా రూ.1,20,000 లోపు ఆదాయం వస్తున్న కుటుంబాలను, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12,000, వార్షికంగా రూ.1.44,000 లోపు ఆదాయం వస్తున్న కుటుంబాలను, 10 ఎకరాల మెట్ట భూమి, 3 ఎకరాల మాగాణి లేదా మొత్తం మెట్ట, భూమి కలిపి 10 ఎకరాలకు మించని కుటుంబాలు బియ్యం కార్డులు తీసుకోవడానికి అర్హులుగా చట్టాన్ని సవరించారు. సొంతంగా నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న కుటుంబాలకు బియ్యం కార్డు తీసుకోవడానికి అనర్హులని పేర్కొన్నారు. సొంతంగా టాక్సీలు, ఆటోలు, ట్రాక్టర్లు వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగిస్తున్న వారు బియ్యం కార్డులు తీసుకోవడానికి అర్హులుగా పేర్కొన్నారు. సొంత లేదా అద్దె గృహాల్లో నెలవారీ కరెంటు వినియోగం 300 యూనిట్లు ఉన్న కుటుంబాలు రెసిడెన్షియల్ విభాగంలోకి చేర్చారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

పులివెందుల టౌన్, డిసెంబరు 2: పులివెందుల పట్టణంలోని అహోబిలాపురంలో నివాసముంటున్న దేరంగుల వెంకటరామాంజనేయులు (25) అనే కౌలు రైతు అప్పుల బాధతో తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఇతను తొండూరులో రెండు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తి, శనగ, వేరుశనగ సాగు చేశాడు. అందులో నష్టం వచ్చింది. పంటల సాగుకు చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఆయన తన ఇంటిలో సోమవారం ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు.



నిండునీటితో కళకళలాడుతున్న పాపవినాశనం డ్యాం

తిరుమల కొండపై జలహోరు

▸▸ నిండిన మూడు జలాశయాలు

▸▸ మరో రెండు 65 శాతం ఫుల్

తిరుమల, డిసెంబరు 2: తిరుమలలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండపైని ఐదు జలాశయాల్లో మూడు నిండుకుండల్లా మారాయి. కుమారధార, పసుపుధార, ఆకాశగంగ డ్యాములు పూర్తిగా నిండగా, గోగర్భం, పాపవినాశనం డ్యాముల్లోకి 65 శాతం నీరు చేరింది. గురు, శుక్రవారాల్లో తిరుమలలో భారీ వర్షాలు కురవగా, శనివారం వేకువజాము నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు మరోసారి విరామం లేకుండా వాన కురిసింది. దీంతో శేషాచల అడవుల్లో కురిసిన వర్షపు నీరు పిల్ల కాలువల ద్వారా జోరుగా ప్రవహిస్తూ ఐదు డ్యాముల్లోకి చేరుతోంది. కేవలం ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కురిసిన వర్షానికే దాదాపు నెలరోజుల క్షేత్ర అవసరాలకు సరిపడ నీళ్లు సమకూరాయి. సెప్టెంబరు 19వ తేదీ నాటికి 102 రోజులకు సరిపడ నీరు తిరుమల జలాశయాల్లో ఉండగా, అక్టోబరు 17వ తేదీకి 144 రోజులకు సరిపడేలా పెరిగింది. ప్రస్తుత వర్షాలకు మరింత నీరు చేరడంతో దాదాపు మరో 240 రోజుల పాటు (భూమిలోకి ఇంకిపోయే నీరు, డెడ్ స్టోరేజి నీటిని మినహాయిస్తే) తిరుమలకు ఎలాంటి నీటి సమస్య ఉండబోదు. తిరుపతిలోని కల్యాణి డ్యాం నీటితో కలుపుకుంటే మరో ఏడాది వరకు నీటికి ఎలాంటి సమస్య ఉండబోదని అంచనా.

డ్యాములు	సామర్థ్యం (లక్షల గ్యాలన్లు)	ప్రస్తుతం
పాపవినాశనం	5,215	3,389
కుమారధార	4,035	ఫుల్
పసుపుధార	1,246	ఫుల్
గోగర్భం	2,683	1743
ఆకాశగంగ	670	ఫుల్

తిరుమలకు రోజుకు ఎంతనీరు కావాలి

నిత్యం వేలాదిమంది భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తుంటారు. వీరిలో రోజుకు 70 నుంచి 80 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారు. అదే రద్దీరోజుల్లో ఈ సంఖ్య లక్ష వరకు చేరుతుంది. వీరి అన్ని అవసరాలకు రోజుకు 32 నుంచి 35 లక్షల గ్యాలన్ల నీరు వినియోగమవుతుంటుంది. ప్రస్తుతం కొండపైని ఐదు డ్యాముల మొత్తం సామర్థ్యం 13,849 లక్షల గ్యాలన్లకు గాను, 12,023 లక్షల గ్యాలన్ల నీరు అందుబాటులో ఉంది.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governerpet, Vijayawada -520002 (A.P)

E Procurement Tender Notice

NIT No. 16/ PROC (19)/ MAU61-ADMN0SD(VI)/22/2019-SD Dated. 01.12.2019

Name of Work : "Removal of Bushes/Grass on Shoulders and side slopes of Karakatta road Sethanagaram Head Regulator to IGC at Velagapudi Via Venkatapalem village in Amaravati Capital city Area"- ECV- Rs. 4,74,577/-

The bid can be downloaded on AP e-procurement portal from **03.12.2019** to **20.12.2019** up to **14.00** Hrs. Due date for submission of Bid **20.12.2019** up to **15.00** Hrs, Technical bid opening **20.12.2019** @**16.00** Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA

VIZIANAGARAM MUNICIPAL CORPORATION

e-Proc. Short NIT No.I521/28/E/TO/19-20, Dt. 02-12-2019

Approx No. of works / Value	26 Nos.,Rs.252.91 Lakhs.,
Download start date & time	03- 12- 19 from 3.30 P.M.
Download end date & time	10-12-19 up to 3.30 P.M.
Bid Submission Closing Date&Time	10-12-19 up to 4.00 P.M.
Bid opening date & time	10- 12- 19 after 4.30 P.M.

Further details can be seen at www.apeprocurement.gov.in. Phone & Fax No.08922-224793, 9849906481, 9849908296.

COMMISSIONER

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం

▸▸ నల్గొండలో తప్పిన పెనుప్రమాదం

నల్లగొండ క్రైం, డిసెంబరు 2: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం అయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించటంతో పెను ముప్పు తప్పింది. హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపు 40 మంది ప్రయాణికులతో వెళుతున్న గుంటూరు గాయత్రి ట్రావెల్స్‌కు చెందిన ఏపీ36ఎక్స్ 3654 బస్సు ఆదివారం రాత్రి సమయంలో నార్కట్‌పల్లిలోని ఓ హోటల్ వద్ద ఆపి టీ తాగిన అనంతరం బయల్దేరింది. చర్లపల్లి సమీపంలోకి చేరుకోగానే, డ్రైవర్ క్యాబిన్ నుంచి పొగలు వస్తుండటంతో డ్రైవర్ బస్సును ఆపి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. ఆ వెంటనే ప్రయాణికులంతా కిందికి దిగిపోయారు. డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా, అప్పటికే బస్సుకు పూర్తి మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తతతో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఇంజన్ లోపంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

టీడీపీ తప్పిదాల వల్లే 'విద్యుత్ సంక్షోభం'

మంత్రి బాలినేని

విజయవాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం చేసిన దుర్మార్గమైన తప్పిదాల కారణంగానే ప్రస్తుతం విద్యుత్ రంగం సంక్షోభంలో పడిందని విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. దీనిని ఉద్యోగుల సహకారంతో అధిగమిస్తామని చెప్పారు. విద్యుత్ శాఖలో కొత్తగా అసిస్టెంటెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ఎంపికైన 170 మంది అభ్యర్థులకు సోమవారం విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుతో కలిసి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణంలో రివర్స్ టెండరింగ్ వల్ల రూ.800 కోట్లు ఆదా అయిందన్నారు.

భారత ప్రభుత్వం
సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ
సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ
ఎ-వింగ్, శాస్త్రి భవన్, న్యూఢిల్లీ- 110001

*****

NISDలో దిగువ ఉద్యోగాన్ని భర్తీ చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నవి. దాఖలు చేయబోయే ఉద్యోగం వివరాలు, విద్యార్హతలు, అనుభవం మరియు ఉద్యోగం కొరకు ఇతర నిర్ణీత ఆవశ్యకతల వివరాలు దిగువ ఇవ్వబడినవి.

క్ర. సం.	ఉద్యోగం పేరు	ఉద్యోగాల సంఖ్య	పే బ్యాండ్ మరియు గ్రేడ్ పే	ఆవశ్యక అర్హతలు మరియు వయోపరిమితి	రిమార్కులు:
1.	సంక్షిప్త కాలపరిమితి కాంట్రాక్ట్ ప్రాతిపదికన డిప్యుటేషన్‌పై డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్ & ప్లానింగ్)	1	రూ. 15600-39100/- గ్రేడ్ పే - రూ. 6600 పే బ్యాండ్-3 క్రింద (ప్రీ- రివైజ్డ్)	కేంద్ర ప్రభుత్వం/రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగసంస్థ/స్వయంప్రతిపత్తి కలిగిన చట్టబద్ధ సంస్థల క్రింద ఆఫీసర్, పేరెంట్ కేడర్/డిపార్ట్‌మెంట్‌లో రెగ్యులర్ ప్రాతిపదికన అనలాగస్ పోస్ట్ కలిగిన లేదా కనీసం 5/8 సంవత్సరాల సర్వీస్ పోస్ట్‌లలో కలిగిన, పే స్కేల్ రూ. 15,600-39100+ గ్రేడ్ పే రూ. 5400/- లేదా రూ. 9300-34000+ గ్రేడ్ పే రూ. 4800/-, లేదా తత్సమానం మరియు అడ్మినిస్ట్రేషన్, సంస్థాగత మరియు అకౌంట్స్ విషయాలలో అనుభవం కలిగిన వారు.	డిప్యుటేషన్ కాలం ప్రాథమికంగా 3 సంవత్సరాల వరకు ఉంటుంది

డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్ & ప్లానింగ్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ ఉద్యోగం కొరకు నిర్ణీత నిబంధనలను నెరవేర్చే ఆసక్తి గల అభ్యర్థులు దాఖలు చేసుకొనవచ్చును. దరఖాస్తులను డిప్యూటీ సెక్రటరీ, సీనియర్ సిటిజన్స్, రూమ్ నం.643, ఎ-వింగ్, శాస్త్రి భవన్, న్యూ ఢిల్లీ- 110001 వారికి పంపవలెను. ప్రకటన పూర్తి వివరాలు మరియు నిర్ణీత నమూనాను సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వశాఖ వెబ్‌సైట్ www.socialjustice.nic.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. విజిలెన్స్ క్లియరెన్స్, ఇంటిగ్రిటీ సర్టిఫికెట్ మరియు గత ఐదు సంవత్సరాల APARs అటెస్టెడ్ కాపీలతో పాటు దరఖాస్తు స్వీకరణకు ఆఖరి తేది ప్రకటన ప్రచురణ తేది నుండి 30 రోజులకు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ /రాష్ట్ర ప్రభుత్వ /ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు వారి దరఖాస్తును తగు విధంగా పంపవలసి ఉంటుంది. ఎటువంటి కారణాలు తెలియజేయకుండా ఏదేని దరఖాస్తును లేదా అన్ని దరఖాస్తులను తిరస్కరించు హక్కు సమర్థ ప్రాధికారి కలిగియున్నారు. ఆఖరి తేది తరువాత అందిన లేదా విద్య, అనుభవం మరియు వయస్సుకు సంబంధించి అన్ని లేదా ఏదేని డాక్యుమెంట్ (ఫోటోకాపీ) లేకుండా లేదా అసంపూర్తిగా కనుగొనబడిన దరఖాస్తులు పరిశీలించబడవు మరియు ఇందుకు సంబంధించి ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలు ఉండవు.

డిప్యూటీ సెక్రటరీ,సీనియర్ సిటిజన్స్
ఫోన్ : 011-23388837, email-kumar.ss@nic.in

davp 38101/11/0029/1920

ఎట్టకేలకు మంచిమాట

తెలంగాణలో యాభైరోజులకు పైగాసాగిన ఆర్టీసీ సమ్మె విషయంలో, ఆలస్యంగానైనా ప్రభుత్వం తీసుకున్న తుదినిర్ణయం సంతోషించదగ్గది. షరతులేవీ విధించకుండా విధుల్లోకి చేరిపోమని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహ్వానించడంతో తమ ఉద్యోగ భవిష్యత్తు మీద అపార భయంతో వొణికిపోతున్న కార్మికులంతా సంతోషంగా వచ్చి చేరి సంబురాలు చేసుకున్నారు. సమ్మె కాలం యావత్తూ ప్రదర్శించిన కఠిన వైఖరికి భిన్నంగా ఆయన ఈ నిర్ణయం తీసుకోవడంతో చాలా చోట్ల కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు జరిగాయి. ఆదివారం ప్రగతిభవన్‌లోకి అడుగుపెట్టిన కొందరు ఎంపిక చేసిన ఉద్యోగులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చెప్పిన మాటలు వారికి తమ భవిష్యత్తు పట్ల మరింత భద్రత, భరోసా కలిగించి ఉంటాయి. దాదాపు రెండునెలలుగా అస్తవ్యస్థంగా తయారైన ప్రజా రవాణా, ఇప్పుడు తిరిగి గాడినపడటంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు సుఖంగా ఉన్నప్పటికీ, ఈ సమ్మె, దాని ముగింపు పలు ప్రశ్నలు లేవనెత్తిన మాట నిజం.

ఆదివారం ప్రగతి భవన్‌లో కడుపునిండా భోజనం పెట్టి, మనసునిండా మంచిమాటలు చెప్పి నవ్వుతూ తమను సాగనంపిన కేసీఆర్‌ను చూసి ఆర్టీసీ ఉద్యోగులకు ఈయన ఆయనేనా అన్నంత ఆశ్చర్యం కలిగి ఉంటుంది. ఆర్టీసీ ఉద్యోగులపై కేసీఆర్ కురిపించిన వరాలు సామాన్యులను సైతం ఆశ్చర్యపరిచాయి. సమ్మె డిమాండ్లలో ఉన్నవీ, లేనివీ కూడా నెరవేర్చేందుకు ఆయన సిద్ధపడ్డారు. ఉద్యోగభద్రత, సీసీఎస్, పీఎఫ్ డబ్బుల విడుదల, కండక్టర్లపై కేసులు, డిపోల్లో మహిళా ఉద్యోగులకు సౌకర్యాలు ఇత్యాది పలు డిమాండ్లపై ఆయన బలమైన హామీలు ఇచ్చారు. ప్రసూతి సెలవుల విషయంలో మరింత ఔదార్యం ప్రదర్శించారు. మహిళా కండక్టర్ల నైట్ డ్యూటీని వారు అడిగినదానికంటే ముఖ్యమంత్రి ఓ గంట ముందుకు జరిపారు. పని భారం పెరిగినందున, ఖాళీలు భర్తీచేయాలన్న విజ్ఞప్తి మన్నించకపోయినా, పదవీ విరమణ వయసు రెండేళ్ళు పెంచడం ఉద్యోగులను సంతృప్తిపరచేదే. ఆర్టీసీని ఆదుకొనేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలన్న డిమాండ్ కూడా ఏటా వెయ్యికోట్లు ఇస్తామన్న హామీతో నెరవేరింది.

అలాగే, సమ్మెకాలానికి సంబంధించిన జీతాన్ని ఒకేమారు ఇవ్వడం, ఉద్యోగుల గృహనిర్మాణ పథకం, వారి తల్లిదండ్రుల, పిల్లల శ్రేయస్సుకు ఉద్దేశించిన పథకాలు జేఏసీ డిమాండ్లలో లేనివే.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయమంటే, ఇక దానిని ఈ భూగోళంలో ఎవరూ కాపాడలేరని తేల్చేసి, యాభైశాతం బస్సురూట్లు ప్రైవేటుపరం చేస్తున్నట్టు తీర్మానించి, టెండర్లు సైతం పిలిచిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఒక్క బస్సు కూడా ప్రైవేటు పరం కాబోదని హామీ ఇవ్వడం కార్మికులకు ఊరటనీ, ప్రజలకు ఆశ్చర్యాన్నీ కలిగించకమానదు. సమ్మె ఆరంభం కాగానే 'సెల్ఫ్ డిస్మిస్' ప్రకటనతో ఉద్యోగులను భయంలో ముంచి, కడవరకూ దానిపై కఠినవైఖరి ప్రదర్శించిన ముఖ్యమంత్రి, రానున్న కాలంలో సంస్థ మరో పదివేల మందితో మరింత కళకళలాడాలంటున్నారు. హైకోర్టులో వాదోపవాదాలు సాగిన సందర్భంలో వెలుగులోకి వచ్చిన అంశాలు, చూపిన సాక్ష్యాలు, చెప్పిన లెక్కలు, దాఖలు చేసిన అఫిడవిట్లు, వీటిపై కోర్టు చేసిన విమర్శలు అంత త్వరగా విస్మరించలేనివి. పలు దశల్లో న్యాయస్థానం ముందుకు తెచ్చిన రాజీమార్గాలు, మధ్యేమార్గాలను ప్రభుత్వం తిప్పికొట్టిన తీరూ కాదనలేనిది. ఉద్యోగులు సమ్మె చేయడం, ప్రభుత్వం కఠినంగా ఉండటం, చివరకు ఉభయపక్షాల మధ్యా ఒప్పందం కుదరడం సర్వ సహజంగా జరిగేదే. కానీ, ఆర్టీసీ సమ్మె విషయంలోనే అందుకు భిన్నమైన, ఎన్నడూలేని వాతావరణం నెలకొంది. ఇప్పుడు ఉద్యోగులు అంటున్నట్టుగా, ఓ తండ్రిలాగా ఎంతో ఔదార్యాన్ని ప్రదర్శించిన ముఖ్యమంత్రి గతంలోనే ఇలా వ్యవహరించి ఉంటే బాగుండేది. సమ్మెకాలంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఉద్యోగుల్లో అభద్రత రగిలించి, ఆత్మహత్యలకు పురిగొల్పాయన్న విమర్శలు తప్పేవి. ప్రజల అసౌకర్యాన్నీ, సమ్మెకాల ఆర్థిక నష్టాన్ని నివారించగలగడంతోపాటు, ముప్పైమంది ఉద్యోగుల, పాతికమంది ప్రజల ప్రాణాలూ నిలిచివుండేవేమో! మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు నష్ట పరిహారాన్నీ, ఉద్యోగాన్నీ ఎంతో ఉదారంగా ప్రకటించిన ప్రభుత్వం, ప్రైవేటు డ్రైవర్ల చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న సామాన్యుల విషయంలో ఏం చేయబోతున్నదని సామాజిక మాధ్యమాలు ప్రశ్నిస్తున్నాయి. కార్మిక సంఘాలపై ప్రభుత్వం విరుచుకుపడటంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూనియన్ల స్థానంలో ప్రభుత్వ కమిటీలు వచ్చినందున వారి ఉద్యోగ ప్రయోజనాలు నెరవేరవు, సమస్యలు పరిష్కారం కావు. ఇప్పుడు సమ్మె జరిగిందీ, దానికి పరిష్కారం లభించిందీ కూడా ఉద్యోగులకు ఉన్న ఈ సంఘటిత శక్తి కారణంగానే.

మూడో కన్ను



సజిత్ కుమార్

రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఆరునెలల్లో మోదీ ప్రభుత్వం ప్రదర్శించిన వేగంతో ప్రతిపక్షాలు దిక్కుతోచని స్థితిలో ఉన్న విషయం శీతాకాల సమావేశాల్లో విస్పష్టంగా కనిపిస్తోంది. వర్తమాన భారత చరిత్రలో దేశాన్ని ఆరు దశాబ్దాలు ఏలిన కాంగ్రెస్, తదితర ప్రతిపక్షాల పాత్ర మృగ్యం కావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

ఇది చరిత్రలో నిలిచిపోయే పాలన!

సత్యకాలమ్

■ వై. సత్యకుమార్

చరిత్ర అంటే గతం అని చాలామంది అనుకుంటారు. కాని మన కళ్లముందే జరుగుతున్న చరిత్రను అనేకమంది గుర్తించ నిరాకరిస్తారు. భారత దేశ పుటల్లో ప్రస్తుతం ఒక మహోద్భుత ఘట్టం ఆవిష్కృతమవుతోంది. మనం చూస్తుండగానే దేశ రాజకీయ చిత్రపటంలో అనేక మార్పులు జరుగుతున్నాయి. భారత దేశానికి ఒక అస్తిత్వం కల్పించి, భారతీయుడి ఉనికిని ప్రపంచ దేశాల్లో చాటి, ఒక బలమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థగా మన దేశం అవతరిస్తున్న సమయం ఇది. ఈ వర్తమాన చరిత్రను లిఖిస్తున్నది ఎవరో కాదు, మన ప్రధాని మోదీ అన్నది అందరూ అంగీకరించాల్సిన వాస్తవం.

చూస్తూ చూస్తుండగానే దేశంలో అత్యధిక మెజారిటీతో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చి అయిదేళ్లు గడిచిపోయింది. అంతే కాదు, రెండవ సారి అంతకంటే ఎక్కువ మెజారిటీ సంపాదించి అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం మనం ఊహించనంత వేగంగా జరిగిపోయింది. ఈ అయిదేళ్లలో దేశంలో ఎన్ని మార్పులు వచ్చాయి? ఎన్ని కీలక నిర్ణయాలు జరిగాయి? అన్నది చరిత్రపుటల్లోనే కాదు, ప్రజల మనసుల్లో రికార్డు అయినందువల్లే బిజెపిని రెండవసారి గెలిపించారు. దేశ రాజకీయాల్లో నరేంద్రమోదీకి సాటి అయిన నాయకుడు మరొకరు లేరని, సమీప భవిష్యత్‌లో వచ్చేఅవకాశం లేదని ప్రజలకు తెలుసు కనుకనే ఆయనను తమ మనఃపీఠాల్లో స్థిరపరుచుకున్నారు. అంతేకాదు, బీజేపీతో పోటీపడగల పార్టీ మరొకటి లేదని కూడా వారు నిరూపించారు. ఆశ్చర్యకరమైనదేమంటే రెండవసారి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గడచిన అయిదు సంవత్సరాల్లో సాధించిన విజయాలను అధిగమించి, రెప్పపాటు వేగంలో కేవలం 180 రోజుల్లో అనూహ్యమైన నిర్ణయాలను తీసుకున్నది. నిజానికి ఈ ఆరు నెలలు, గడచిన ప్రభుత్వానికి కొనసాగింపే కావచ్చు కాని మోదీ సర్కార్ ఎలాగూ అధికారంలోకి వచ్చాము కదా అని నిదానంగా అడుగులు వేయాలనుకోలేదు, అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచీ ద్విగుణీకృత ఉత్సాహంతో వ్యవస్థల తీరుతెన్నుల్లోనే మార్పులు చేసే తిరుగులేని కీలకమైన నిర్ణయాలకు శ్రీకారం చుట్టింది.

ఎవరు ఊహించారు.. రెండవసారి అధికారంలోకి రాగానే ఆరునెలలలోపే కశ్మీరులో 370వ అధికరణ రద్దు చేసి జమ్ము కశ్మీర్ భారత దేశంలో అంతర్భాగమన్న విషయంలో ఇక ఏ సందేహాలకూ ఆస్కారం లేదని ప్రపంచ దేశాలకు చాటి చెబుతారని? ఎవరు ఊహించారు.. మొత్తం ప్రపంచ దేశాల్లో, అన్ని వేదికల్లో పాకిస్థాన్ ఏకాకిగా మిగిలిపోతుందని? ఎవరు ఊహించారు.. సౌదీ అరేబియాతో పాటు అనేక ఇస్లామిక్ దేశాలు ప్రపంచ దేశాలతో కలిసి భారత్ వైఖరిని సమర్థిస్తాయని? ఎవరు ఊహించారు.. భారత దేశంలో అందరు స్త్రీలతో సమానంగా ముస్లిం మహిళలు తలెత్తుకుని నిలిచేలా చేసేందుకు త్రిపుల్ తలాఖ్ అనే ఒక ఆటవిక నియమాన్ని రద్దు చేస్తారని? ఎవరు ఊహించారు.. కొన్ని దశాబ్దాలుగా రగులుతున్న రామజన్మభూమి సమస్యకు మోదీ హయాంలోనే న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కారం లభించి, ఒక భవ్యమైన మందిర నిర్మాణానికి మార్గం సుగమమవుతుందని? ఎవరు ఊహించారు.. మోదీ ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్.సి.ఇ.పి) నుంచి వైదొలగి భారత రైతుల, వ్యాపారుల ప్రయోజనాలను కాపాడేందుకు, ఆర్థిక లోటు ప్రమాదం నుంచి మన దేశాన్ని రక్షించేందుకు, చైనా దూకుడుకు కళ్లెం వేసేందుకు, భారత మార్కెట్టును కబళించాలనే దురాకాంక్షకు అడ్డుకట్ట వేసేందుకు సాహసోపేత నిర్ణయం తీసుకుంటారని?

ఈ నిర్ణయాలే కాదు, గత ఆరు నెలలుగా జరుగుతున్న వ్యవస్థీకృత మార్పులు, సంస్కరణలు సమాజంలోని అన్ని రంగాల్లోకి చొచ్చుకుపోయి ఒక వినూత్న భారత నిర్మాణానికి దోహదం చేస్తున్నాయి. ఈ మార్పుల వల్ల అభివృద్ధితో పాటు సామాజిక సాధికారిత వేగవంతం అయిందని, గతంలో కంటే ఎక్కువగా ప్రజల ఐక్యత బలపడిందని లోతుగా పరిశీలిస్తే అర్థమవుతుంది. ప్రపంచంలో అనేక దేశాలు ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో భారత దేశం ఆ ప్రభావాన్ని తట్టుకుని నిలదొక్కుకోవడానికి మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణం. బ్యాంకుల విలీనం, పారిశ్రామిక రుణాల మినహాయింపు, ప్రభుత్వ రంగంనుంచి పెట్టుబడుల ఉపసంహరణ, ప్రపంచంలోనే అతి తక్కువ స్థాయిలో కార్పొరేట్ టాక్స్‌ను విధించడం వంటి అనేక చర్యల వల్ల భారత ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోగలిగింది. ఇవాళ భారత దేశంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. సులభంగా వ్యాపారాన్ని నిర్వహించే దేశాల ర్యాంకింగ్‌లో భారత దేశం 142 నుంచి 63 స్థాయికి చేరుకుంది. పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, టెక్నాలజీ రంగాల్లో భారత్ ఇవాళ ప్రపంచంలోఅగ్రగామి దేశంగా గుర్తింపు పొందింది. అయిదేళ్ల క్రితం పరిస్థితితో పోలిస్తే స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయిలో పెరిగింది. ప్రైవేట్ రంగంలో ఈక్విటీ, పెట్టుబడుల విషయంలో యుపిఏ హయాంలో కంటే ఇప్పుడు పరిస్థితి ఎన్నో రెట్లు మెరుగుపడింది. వచ్చే ఏడాది బడ్జెట్ నాటికి భారత దేశం 3 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని, ప్రపంచంలో అయిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతామని, 2024 నాటికి 5 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థతో మూడవ స్థానానికి చేరుకుంటామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

ఆరు సంవత్సరాల క్రితం పరిస్థితితో పోలిస్తే భారత దేశంలో ఇప్పుడు ఉగ్రవాద ఛాయలు లేవు. అన్ని చట్టాలను, దర్యాప్తు సంస్థలను, నిఘా సంస్థలను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా సీమాంతర ఉగ్రవాదంతో పాటు వామపక్ష ఉగ్రవాదాన్ని కూడా ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేసేందుకు వెనుకాడడం లేదు. ఇవాళ దేశ రాజధానిలో దళారీలు కనీసం తిరుగాడడానికైనా భయపడుతున్నారు. ఆర్థిక వ్యవస్థ ఇవాళ పూర్తిగా నియంత్రణలోకి రావడంతో అక్రమంగా వ్యాపారాలు చేసిన అనేక సంస్థలు కుప్పకూలిపోతున్నాయి. భారీ రుణాలు చేసి ఎగవేసిన వారు కేసుల్లో ఇరుక్కోవడం, జైలు పాలు కావడం, విదేశాలకు పారిపోవడం కనపడుతోంది. ప్రజాధనాన్ని కొల్లగొట్టి విలాసాలు అనుభవించిన వారు కొత్త రుణాలు పుట్టని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి మంత్రిత్వ శాఖల వరకూ ఇవాళ నిర్మాణాత్మక కార్యక్రమాలపై, ప్రజానుకూల విధానాల అమలుపై కేంద్రీకరించడంతో ఒక ఆరోగ్యకరమైన, బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణం జరుగుతోంది.

దేశంలో విస్తృత ఆర్థిక సంస్కరణలు అమలు పరిచేందుకు ఇవాళ కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం వెనుకాడడం లేదు. గతంలో లాగా ఎవరికో భయపడుతూ ఆచితూచి అడుగులు వేయాల్సిన దుస్థితిలో మోదీ ప్రభుత్వం లేదు. కాలానుగుణంగా ఎప్పుడు ఏది అవసరమో ఆ నిర్ణయం తీసుకోవడం వల్ల పరిపాలనను ప్రజలకు రోజురోజుకూ మరింత చేరువ చేస్తోంది. అదే సమయంలో కాలం చెల్లిన చట్టాల్ని ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తోంది. గత పార్లమెంట్ సమావేశాల్లో రికార్డు స్థాయిలో 35 బిల్లులను ప్రవేశపెట్టి చట్టాలుగా మార్చింది. వీటిలో అత్యధిక భాగం ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు, వ్యవసాయ, గ్రామీణ, జలవనరుల రంగాలను బలోపేతం చేసేందుకు ఉద్దేశించినవే. ఈ శీతాకాల సమావేశాల్లో కూడా ప్రభుత్వం పారిశ్రామిక కోడ్, టాక్సేషన్, ఆదాయ పన్ను చట్ట సవరణలతో పాటు పౌరసత్వ సవరణ చట్టం వరకు అనేక కీలక నిర్ణయాలను అమలు చేసేందుకు నడుం కట్టింది. ప్రతిపక్షాలు ఎన్ని గందరగోళాలు సృష్టించినా మోదీ హయాంలో సాధించినంత ఉత్పాదకత ఎప్పుడూ పార్లమెంట్ సమావేశాల్లో ఏ ప్రభుత్వమూ సాధించలేదు. ఇందుకు కారణం ప్రభుత్వం తాను ఖర్చుపెట్టే ప్రతిపైసా, తనకు లభించిన ప్రతి అధికారం ప్రజలకు జవాబుదారీగా బాధ్యతాయుతంగా ఉపయోగించాలనుకోవడమే. రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఆరునెలల్లో మోదీ ప్రభుత్వం ప్రదర్శించిన వేగంతో ప్రతిపక్షాలు దిక్కుతోచని స్థితిలో ఉన్న విషయం శీతాకాల సమావేశాల్లో విస్పష్టంగా కనిపిస్తోంది. వర్తమాన భారత చరిత్రలో దేశాన్ని ఆరు దశాబ్దాలు ఏలిన కాంగ్రెస్, తదితర ప్రతిపక్షాల పాత్ర మృగ్యం కావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

(బిజెపి జాతీయ కార్యదర్శి)

భాషతోనే అస్తిత్వం, భాషలోనే భావోద్వేగం

తెలుగు భాషకు వస్తున్న ముప్పు మీద తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. బడిలో తెలుగు సంగతి గురించి మాట్లాడుకునే ముందు మనం మన ఇళ్ళలోనూ తెలుగును కోల్పోతున్నామని గుర్తించాల్సి ఉంది. ప్రపంచం అంతా విస్తరించిన తెలుగు జాతి భాషాభిమానాన్ని కోల్పోయి తన ఉనికిని కోల్పోతున్నదని నా అభిప్రాయం.

మలేషియాలో మా బంధువులు దాదాపు వంద కుటుంబాల దాకా వున్నారు. వీరిలో ముప్పై వయసు లోపు ఉన్న వారు తెలుగు మాట్లాడలేరు. కనీసం అర్థం చేసుకోలేరు. ఒకరో ఇద్దరో మినహాయింపు. ఆ దేశంలో పదేళ్ల క్రితం దాకా నడిచిన తెలుగు పాఠశాలలు మూతబడ్డాయి. మలేషియా తెలుగువారందరిపైన తమిళం బలంగా రుద్దబడింది. నిజమే, ఇరుగు పొరుగు ప్రభావాన్ని తట్టుకొని ఎదురీదడం అసాధ్యం. ఉదాహరణకు మా తాతకి ఇద్దరు అన్నదమ్ములు, చెంగల్రాయుడు, చిన్నబ్బ. చిన్నబ్బ చిన్న వయసులోనే మలేషియాకు వలసపొయ్యారు. చిన్నబ్బ పెద్ద కుమారుడు బాలకృష్ణ. అంటే నాకు బాబాయ్. ఇటీవల ఆయన ఇంటికి వెళ్ళాను. ఆయన నాతో తెలుగులోనే మాట్లాడినా, ఆయన కుమార్తెలు జమునకి, యోగేశ్వరికి తెలుగు రాదు. ఇక వారి పిల్లలకైతే అసలు అర్థం కూడా కాదు. జమున నన్ను అక్కడి మా బంధువుల ఇళ్లకు తీసుకొని వెళ్ళింది. 'అన్నా నేను యూరప్‌కు వెళుతున్నాను. తెలుగు నేర్చుకోవాలి' అంది. నేను మా బాబాయ్‌ని 'మీరు తెలుగు మాట్లాడుతున్నారు కదా. పిల్లలకు ఎందుకు నేర్ప లేదు' అని అడిగాను. ఆయన కంటే ముందే జమున సమాధానం ఇచ్చింది. (ఆమె నాతో ఇంగ్లీష్‌లో లేదా తమిళ్‌లో మాట్లాడుతుంది). 'అన్నా చిన్నప్పుడు మేము ఉన్న కాలనీలో అన్నీ తమిళ కుటుంబాలే. నేను నాన్నను 'నాయినా' అని పిలిస్తే ఇరుగుపొరుగు వాళ్ళంతా నన్ను గేలిచేసే వాళ్లు. 'నయినా పొన్ను' అని కూడా నాకు పేరు పెట్టారు. అప్పా అని పిలవాలి అని చెప్పేవారు. నాకు ఉక్రోషంగా, బాధగా ఉండేది. దీనితో అమ్మ, నాన్న నాతో తమిళ్‌లో మాట్లాడేవారు' అని వివరించింది. నిజమే, మలేషియాలో మా బంధువులందరి మాతృ భాష ఇప్పుడు తమిళం అయిపోయింది. అక్కడ తమిళ్ స్కూల్స్ వున్నాయి. తెలుగు స్కూల్స్ మూతబడుతున్నాయి. అచ్చయ్య కుమార్ లాంటి వారి కృషి వల్ల కొన్ని తెలుగు పాఠశాలలు నడుస్తున్నాయి. వాటికి కూడా తమిళుల నుంచి తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అక్కడి తెలుగువాళ్ళు చెప్పారు. రెండేళ్ల క్రితం నేను మలేషియాకు వెళ్ళినప్పుడు మలేషియా తెలుగు సంఘం నాయకుడు అచ్చయ్య కుమార్ చెప్పిన ఒక సంగతి ఇక్కడ గుర్తు చేస్తాను. సంక్రాంతి పండుగను తెలుగువారు ఎలా చేసుకుంటారో వివరిస్తూ ఆయన రేడియోలో ప్రసంగించారు. అంతే, 'పొంగల్ మా పండుగ. తెలుగువాళ్ళకి ఏం సంబంధం? నువ్వు జనాల మెదళ్ళు కలుషితం చేస్తున్నా'వంటూ బూతులు తిడుతూ వందలాది తమిళులు ఆయనకు ఫోన్‌లు చేశారంట. ఇలా ఉంటుంది అక్కడ తెలుగువాళ్ల పరిస్థితి. అయినా అటువంటి ఒత్తిళ్లలోనూ వాళ్లు తెలుగు భాషను తమ పిల్లలకు నేర్పించడానికి చేస్తున్న ప్రయత్నం గొప్పది.

తమిళుల భాషాభిమానాన్ని తప్పకుండా మెచ్చుకోవాలి. అయితే అది దురభిమానంగా మారితేనే సమస్య. 1956లో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తమిళనాడులో నివసిస్తున్న తెలుగువారి పాలిట ఒక పెద్ద శాపం. 1956 నుంచి మొదలెట్టి ఒక పద్ధతి ప్రకారం తమిళనాడు ప్రభుత్వం తెలుగు భాషను అణచివేస్తోంది. వందల తెలుగు పాఠశాలలను మూసేసారు. తమిళనాడులోకూడా మా బంధువులు చాలా కుటుంబాలవారు వున్నారు. పెద్దవారు తెలుగు మాట్లాడుతారు. 30, 40 ఏళ్లు వయస్సు ఉన్న వారు కష్టపడి నాలుగు మాటలు మాట్లాడగలుగుతారు. చిన్న పిల్లలైతే కనీసం అది కూడా లేదు. నేను చెబుతున్నది ఒకటో రెండో కుటుంబాల సంగతి కాదు. తిరుత్తణి, వెల్లూరు, పొన్న మొదలు పెట్టి కోయంబత్తూరు, మధురై దాకా విస్తరించి ఉన్న వేలాది తెలుగు కుటుంబాల పరిస్థితి. ఇప్పుడు 50ఏళ్లు దాటిన తెలుగు వారు మరణిస్తే ఇక అక్కడ తెలుగు శాశ్వతంగా మాయం అయిపోతుంది. తమిళ భాషాభిమానం తెలుగు భాషకు తమిళనాడులోనే కాదు, మలేషియా, శ్రీలంక వంటి అనేక దేశాల్లో ప్రమాదకరంగా పరిణమించింది. దీని మీద పోరాడుతున్న అక్కడి తెలుగువారికి మనం కనీసం నైతిక మద్దతు కూడా ఇవ్వలేకపోతున్నాం. తమిళుల సంగతి పక్కనపెడుదాం, తెలుగువాళ్లమైన మనం ఏం చేస్తున్నాం? తెలుగు నేల మీద తెలుగు భాషను ఎంత వరకూ కాపాడుకుంటున్నాం?

చైనీయులు, ఇంగ్లీష్ వారు, మలే భాష వారు, మన తమిళ సోదరులు, హిందీ, గుజరాతీ సోదరులు ప్రపంచంలో ఏ దేశంలో స్థిరపడినా వాళ్ళ ఇంట్లో మాత్రం మాతృభాషలోనే మాట్లాడుతారు. కానీ తెలుగువారి సంగతి వేరు. పిల్లలకు ఇంగ్లీష్ బాగా రావాలని ఇంట్లోనూ ఇంగ్లీషులో మాట్లాడుతుంటారు. బయట దేశాల్లో స్థిరపడిన తెలుగువాళ్ళ సంగతి కాదు, తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఇంగ్లీషు తెలిసిన తెలుగువారు కూడా ఇంతే. ఇలా అయితే తెలుగు పిల్లలు తెలుగును కనీసం అర్థం చేసుకోలేని స్థితికి చేరుకొంటారు. నిదానంగా తెలుగుభాష మరుగున పడిపోతుంది. ప్రపంచంలో ఏ భాష అయినా సరే.. 'నేను అది నేర్చుకొంటాను. తెలుగు మరిచిపోతాను' అంటాడు తెలుగు వాడు. మాతృభాషపై మమకారంలేని జాతి బహుశా ప్రపంచంలో తెలుగు జాతేనేమో!

ప్రపంచాన్ని జయించిన బ్రిటిష్, ఫ్రెంచ్‌వారు తమ భాషల్ని విశ్వవ్యాప్తం చేశారు. సింగపూర్, మలేషియా లాంటి చోట్ల షాపులు ప్రారంభించిన చైనీయులు, అక్కడి ఉద్యోగాల్లో చైనా భాష మాట్లాడే వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. సింగపూర్, మలేషియా, శ్రీలంక, సౌత్ ఆఫ్రికా లాంటి దేశాలలోని తమిళులు అయిదు ఆరు తరాలు మారినా ఇంకా స్వచ్ఛమైన తమిళ్ మాట్లాడుతున్నారు. మలేషియాలోని మా సోదరి జమున కారు డ్రైవర్ తమిళియన్. ఆయన నాతో చెప్పిన విషయం ఇక్కడ ఉదహరిస్తాను. ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకొని తన పిల్లల్ని ఆయన చైనీస్ పాఠశాలకు పంపేవాడంట. వాళ్లు ఇంటికి వచ్చాక ఇంట్లో కూడా చైనీస్ భాషలోనే మాట్లాడడం మొదలు పెట్టారంట. ఇది చూసి ఆయన, 'చైనీస్ భాష బయట వరకే. ఇంట్లో తమిళ్ మాత్రమే మాట్లాడాలి' అని గట్టిగా పిల్లలకి చెప్పాడట. 'ఇప్పుడు మా పిల్లలు చక్కగా తమిళ్‌లో మాట్లాడుతారు' అని చెప్పాడాయన. ఒక డ్రైవర్‌కున్న అవగాహన తెలుగు నేల మీద ఉన్న చాలా మంది తెలుగు వారికి లేక పోవడం బాధాకరం. అంతేలే.. ఆ డ్రైవర్ తమిళియన్. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వారు తమ మాతృ భాషను అలాగే కాపాడుకొంటారు. సమస్యంతా మన తెలుగువారితోనే. ఇంట్లో తెలుగు మాట్లాడడం మాయమైపోతే 10, 15 ఏళ్ల వయసు వచ్చాక వారిని ప్రత్యేక తెలుగు శిక్షణా కార్యక్రమాలకు పంపినా ఫలితం అంతంతమాత్రమే ఉంటుంది. పదేళ్ల లోపు పిల్లలు చక్కగా మూడు నాలుగు భాషలు నేర్చేసుకొంటారు. భాష నేర్చుకొనే సామర్థ్యం ఈ యీడు పిల్లలో 100 శాతం ఉంటుంది. 10 నుంచి 20 ఏళ్ల వయసులో ఇది యాభై శాతానికి పడిపోతుంది. ఇరవై ఏళ్ళు దాటితే ఇది ఐదు శాతానికి పడిపోతుంది. ఈ సింపుల్ పాయింట్ అర్థం చేసుకొంటే చాలు.

మలేషియా వెళ్ళినపుడు మా బాబాయ్‌ని 'మీరు తెలుగు మాట్లాడుతున్నారు కదా. పిల్లలకు ఎందుకు నేర్పలేదు' అని అడిగాను. ఆయన కంటే ముందే జమున సమాధానం ఇచ్చింది. "అన్నా చిన్నప్పుడు మేము ఉన్న కాలనీలో అన్నీ తమిళ కుటుంబాలే. నేను నాన్నను 'నాయినా' అని పిలిస్తే ఇరుగుపొరుగు వాళ్ళంతా నన్ను గేలిచేసే వాళ్లు. 'అప్పా' అని పిలవాలి అని చెప్పేవారు. నాకు ఉక్రోషంగా, బాధగా ఉండేది. దీనితో అమ్మ, నాన్న నాతో తమిళ్‌లో మాట్లాడేవారు' అని వివరించింది. నిజమే, మలేషియాలో మా బంధువులందరి మాతృభాష ఇప్పుడు తమిళం అయిపోయింది. మాతృభాషపై మమకారం లేని జాతి బహుశా ప్రపంచంలో తెలుగుజాతేనేమో!

'ఇంతకీ తెలుగు భాషను ఎందుకు కాపాడాలి?' అని ఎవరైనా అడగొచ్చు. అయ్యా.. తెలుగు భాష.. పరిరక్షణ వంటి పెద్ద మాటలు నేను మాట్లాడను. మీరు తెలుగు భాషను ఉద్ధరించనక్కర లేదు. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోండి చాలు. కాలిలో ముల్లు గుచ్చుకొంటే తెలుగువాళ్ళం 'అమ్మా' అనే అంటాం. బాధల్ని భావోద్వేగాలను మనం ఉగ్గు పాలతో నేర్చుకొన్న మాతృభాషలోనే వ్యక్త పరచగలం. మీ పిల్లలకేమో ఇంగ్లీష్‌ను మాతృ భాషగా చేస్తున్నారు. ఇంగ్లీష్ తప్పనిసరిగా నేర్చుకోవాలి. కానీ నా పాయింట్ దాన్ని మాతృభాషగా మార్చేయడం పైనే. రేపు మీ బాధల్ని మీ పిల్లలతో ఎలా పంచుకొంటారు? మీరు వృద్ధాప్యంలో పడి పడకలో ఉన్నారనుకోండి. 'నాన్న.. అంతా నా కర్మ రా.. పుణ్య భూమిలో పుట్టి ఇక్కడికి వచ్చాను. సంపదైతే చేకూరింది. మనస్సుకు సాంత్వన లేదురా.. గుండె కోత ఏమని చెప్పను'అనాలనిపిస్తుంది. ఈ మాటల్ని ఇంతే భావోద్వేగాలతో ఎలా చెబుతారో ఆలోచించండి. అప్పటిదాకా ఎందుకు, ఇప్పుడే 'బువ్వ తినురా పిచ్చికన్నా.. అటు పై లాల పోస్తాను.. బజ్జోపెడుతాను.. మా తిక్క సన్నాసికి అన్నీ తాత బుద్ధులే' అని మీ అమ్మ మీ పిల్లల్తో చెప్పే మాటలు వారికి అర్థం అవుతాయా? అవ్వా తాతలకీ పిల్లలకీ నడుమ పెద్ద అగాధాన్ని మనం భాష పేరుతో సృష్టిస్తున్నామని మాత్రం మరచిపోకండి.

ఒక సమాజపు భౌగోళిక పరిస్థితులు చారిత్రక ఘటనలు ఆ సమాజపు సంస్కృతిని రూపొందిస్తాయి. ఏ రెండు సమాజపు అనుభవాలూ ఒక్కలా వుండవు. అందుకే ఒక భాషలోని పదాలకు మరో భాషలో సమానార్థక పదాలు దొరకవు. అసలైన భావం ప్రసారం కాదు. భాషను మరిచిపోతే ఇక ఆ

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
మంగళవారం • 3 డిసెంబర్ 2019
navya@andhrajyothy.com

రయ్‌మంటూ దూసుకెళ్లే రేస్ కార్లను చూసిన ఆమె పెద్దయ్యాక రేసర్ కావాలనుకుంది. కానీ ఆమె పుట్టింది మహిళలను డ్రైవింగ్ నేర్చుకోవడానికి అనుమతించని సౌదీ అరేబియాలో. కాలక్రమంలో రీమా జుఫ్ఫాలీ ఆ దేశంలోనే తొలి మహిళా రేసర్‌గా గుర్తింపు సాధించింది. ఆంక్షల నీడలో కాలం వెళ్లదీస్తున్న ఈ ఎడారి దేశంలోని మహిళల స్వాభిమానానికి ప్రతీకగా నిలుస్తున్న రీమా జర్నీ ఇది.

ఆంక్షలను అధిగమించి...

రేసర్‌గా దూసుకెళ్తోంది!

రీమా పుట్టింది సౌదీ అరేబియాలోని జెడ్డాలో. అక్కడి బ్రిటిష్ ఇంటర్నేషనల్ స్కూల్లో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. ఉన్నత విద్య కోసం 2010లో అమెరికా వెళ్లి అక్కడి బోస్టన్ నగరంలో ఉన్న నార్త్‌ఈస్ట్రర్న్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ అఫైర్స్ కోర్సు చేశారు. అలా చదువు నిమిత్తం కొన్నాళ్లు అమెరికాలో ఉన్న ఆమె టీనేజ్ నుంచే రేస్ కార్ల మీద ఆసక్తి పెంచుకున్నారు. ఫార్ములా వన్ రేస్‌లు ఎక్కువగా చూసేవారు. ఈ క్రమంలో డ్రైవింగ్ నేర్చుకున్నారు. డ్రైవింగ్ టెస్ట్ కూడా పాస్ అయ్యారు. తరువాత బీఎండబ్ల్యూ 3 సిరీస్ కారు కొనుక్కున్నారు. చలికాలంలో మంచు పరుచుకున్న రోడ్ల మీద కారు డ్రైవ్ చేస్తూ ఎంజాయ్ చేసేవారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక ఉద్యోగంలో చేరాలనుకున్న ఆమెను డ్రైవింగ్ మీదున్న ఆసక్తి కుదురుగా ఉండనిచ్చేది కాదు. అప్పుడే ఆమెకు ఫ్లోరిడాలో ఉన్న 'స్కిప్ బార్బర్ రేసింగ్ స్కూల్' గురించి తెలిసింది. అమెరికాలో జరిగే ప్రతి మెగా ఆటో రేసింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆ స్కూల్లో శిక్షణ తీసుకున్న వారే విజేతలుగా నిలిచేవారని తెలుసుకొని అక్కడ చేరారు. "అందులో చేరాక నా ఆలోచన విధానం పూర్తిగా మారింది. డ్రైవింగ్‌లో అద్భుతాలు చేయాలన్న పట్టుదల పెరిగింది" అంటారు రీమా.

ఆమెను చూసి రేసర్ అవ్వాలనుకుంది...

అయితే ఆర్థిక కష్టాలు మొదలవడంతో రీమా ఉద్యోగ ప్రయత్నాలు మొదలెట్టారు. లండన్‌లో స్టార్ట్‌ప్‌లో కొన్ని రోజులు పనిచేసిన అనుభవంతో చెల్లెలితో కలిసి రెస్టారెంట్ ప్రారంభించాలని అనుకున్నారు. అదే సమయంలో స్కాట్లాండ్‌కు చెందిన మహిళా రేసర్ సూసీ వోల్ఫ్‌తో ఏర్పడిన పరిచయం రీమాను ప్రొఫెషనల్ రేసింగ్ వైపు మళ్లేలా చేసింది. అలా 2017 డిసెంబర్‌లో రేసింగ్ లైసెన్స్ సాధించిన తొలి సౌదీ మహిళగా వార్తల్లోకెక్కారు. గత ఏడాది అబుదాబీలో జరిగిన పలు రేసింగ్ పోటీల్లో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎఫ్4 బ్రిటిష్ ఛాంపియన్‌షిప్‌లో చక్కని ప్రదర్శన చేశారు. రీమా ప్రతిభ చూసి సౌదీకి చెందిన 'నేషనల్ క్యారియర్ ఎయిర్‌లైన్స్' సంస్థ ఆమెను స్పాన్సర్ చేసేందుకు ముందుకొచ్చింది. 'రీమా రేసర్ అవడం మా దేశంలో చాలా గొప్ప విషయం. ప్రొఫెషనల్ రేసర్‌గా ఆమె రాణించాలని ప్రతి ఒక్కరు కోరకుంటున్నారు' అని సౌదీ అరేబియా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ ప్రిన్స్ అబ్దుల్ అజిజ్ బిన్ తుర్కీఅల్ ఫైజల్ అన్నారు.

నిషేధం ఎత్తివేయడంతో రెక్కలు...

సౌదీ అరేబియాలో మహిళలు వాహనాలు నడపకూడదనే ఆంక్షలు ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. అయితే ఆ దేశ ప్రస్తుత రాజు ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ మహిళలకు స్వేచ్ఛనిస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో ఆడవాళ్లు డ్రైవింగ్ నేర్చుకోవడం మీద ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ సంచలన ప్రకటన చేశారు. ఆ నిర్ణయంతో సౌదీ తరఫున తొలి మహిళా రేసర్‌గా సత్తా చాటేందుకు రీమాకు అవకాశం దొరికింది. "ప్రొఫెషనల్ రేసర్ అవ్వాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. రేసింగ్‌లోకి ఆలస్యంగా అడుగు పెట్టినప్పటికీ తక్కువ సమయంలోనే రేసింగ్ కార్లను ఉరికించడంలో పట్టు సాధించా. ఇప్పటి వరకూ పురుషులు మాత్రమే రేసింగ్ కార్లు నడపడం చూసిన వాళ్లు, డ్రైవింగ్ నేర్చుకోని చాలామంది అమ్మాయిలు నేను రేసింగ్ కారు నడపడం చూసి ఆశ్చర్యపోతున్నారు. చాలామంది మహిళలకు డ్రైవింగ్ అనేది ఇంకా నెరవేరని కలగానే ఉంది. అందరు తల్లితండ్రుల్లానే మా అమ్మానాన్నా నా భద్రత గురించి కొంత ఆందోళన చెందేవారు. కానీ నా పట్టుదలను అర్థం చేసుకొని వెన్నుతట్టారు. నా ప్రతి అడుగులో వారి సహకారం, ప్రోత్సాహం ఎంతో ఉంది" అని చెబుతారు రీమా.

ఆమె కల అదే..

ఫ్రాన్స్‌లో 24 గంటలు జరిగే 'లే మాన్స్' రేసింగ్ పోటీలో పాల్గొనాలనేది రీమా కల. ఇందులో రేసర్లు రోజంతా విరామం లేకుండా రేసింగ్ కార్లను నడుపుతూ ఒళ్లు గగుర్పొడించే విన్యాసాలతో ప్రేక్షకుల్ని అలరిస్తారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న మోటార్ రేసింగ్ ఈవెంట్ ఇది. "కేటగిరీ, ఈవెంట్‌తో సంబంధం లేకుండా రేసర్‌గా గొప్ప శిఖరాలు చేరాలన్నది నా లక్ష్యం. పురుషులు ఆధిపత్యం చెలాయించే రేసింగ్ స్పోర్ట్స్‌లో మహిళా రేసర్‌గా గుర్తింపు తెచ్చుకోవడం నాకు చాలా సంతృప్తిని ఇస్తుంది. సౌదీ అరేబియాలో తొలి మహిళా రేసర్ నేనే కావడం నా ఆనందాన్ని రెట్టింపు చేస్తోంది" అని చెబుతున్న రీమా ఇన్నాళ్లు ఆంక్షలతో తమ ఆకాంక్షలకు దూరమైన ఎందరో అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

న్యూస్‌మేకర్

ఆదర్శం

దానం ఆయన ధర్మం! తన జీవితాంతం కూడబెట్టిన లక్షల రూపాయల సొమ్మును ప్రజల బాగు కోసం కరిగించారు సూర్యాపేట జిల్లా మట్టపల్లికి చెందిన సిరిపురం విశ్వనాథం. సమాజాన్ని సొంత కుటుంబంగా భావించి, విద్యాలయాలు, దేవాలయాలు ఎన్నింటినో బాగు చేశారు. పేద విద్యార్థులకు సాయం చేసి పైకి తెచ్చారు. అనాథలను ఆదుకున్నారు. అన్నిటికీ మించి తన ఇంటిని అమ్మగా వచ్చిన 50 లక్షల రూపాయలను సైనికుల సంక్షేమనిధికి ఇచ్చి దేశభక్తిని చాటుకున్నారు. తన సేవాకార్యక్రమాల గురించి ఆయన మాటల్లోనే...

విశ్వనాథం... సేవాదీపం!

"మా సొంతూరు మెదక్ జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిగుళ్ల గ్రామం. అక్కడే ఎనిమిదో తరగతి దాకా చదువుకున్నా. పేదరికంలో పుట్టిన నేను, బతుకు తెరువు కోసం 1970లో హుజూర్‌నగర్‌కు వలసొచ్చాను. 14 సంవత్సరాలు కిరాణం, జనరల్ స్టోర్ నడిపాను. జీవితం అప్పుడే గాడిన పడుతుందనుకునేలోగా అనుకోని విషాద ఘటన జరిగింది. నా కూతురు ఐదేళ్ల వయసులోనే చనిపోయింది. ఆ తర్వాత కొన్నాళ్లకు నా భార్య కూడా చనిపోయింది. నేను మళ్లీ పెళ్లి చేసుకోలేదు. నాకంటూ కుటుంబం లేదు. వ్యాపారం చేసి లక్షల రూపాయలు సంపాదించాను. అయినా సంతృప్తిలేకపోవడంతో గత ఇరవయ్యేళ్లుగా అనేక దానధర్మాలు చేస్తున్నా.

గుడి, బడి బాగుండాలని...

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని అనేక దేవాలయాల అభివృద్ధికి లక్షలాది రూపాయల సాయం అందజేశాను. వాసవీ సత్రంలో రెండు గదులు నిర్మించాను. రూ. 5 లక్షలతో సాయిబాబా దేవాలయంలో షెడ్డు, రూ. 5 లక్షలతో మట్టపల్లి ఆర్యవైశ్య సత్రంలో రేకుల షెడ్డు నిర్మించాను. మరో 5 లక్షల రూపాయలు హుజూర్‌నగర్ శివాలయం అభివృద్ధికి ఇచ్చాను. మా సొంత ఊరిలో పోచమ్మ, ముత్యాలమ్మ దేవాలయాలకు రూ. 10 లక్షలపైనే విరాళం ఇచ్చాను. వీటితో పాటు స్మశాన వాటికల్లో సౌకర్యాల కోసం 4 లక్షల రూపాయలు ఇచ్చాను.

రెండేళ్ల క్రితం 'సిరిపురం విశ్వనాథం ఛారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటుచేసి అనాథాశ్రమాలు నిర్వహిస్తూ, విద్యార్థులను ఆర్థికంగా ఆదుకుంటున్నాను. పాఠశాలల్లో తరగతి గదులు, మంచినీటి ట్యాంకులు నిర్మించాను. గ్రంథాలయాలకు పుస్తకాలు బహూకరించాను. పట్టణంలోని బాలికల పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మించడం నాకు సంతృప్తినిచ్చింది.

సేవా సైనికుడు...

దేశం కోసం పోరాడే సైనికులకు సహాయమందించాలనే ఆలోచన వచ్చింది. హుజూర్‌నగర్‌లోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న నా ఇంటిని ఈ మధ్యనే 55 లక్షల రూపాయలకు అమ్మాను. వయసు పెరుగుతుంటే నాలో ఓపిక లేదు. అనారోగ్యంగా ఉన్నాను. నేను మరణిస్తే నేను సంపాదించిన ఆస్తి వృథా అవుతుంది కదా అనిపించింది. అందుకే ఇంటిని అమ్మిన సొమ్మును సద్వినియోగం చేయాలకున్నా. సైనికులకు అండగా నిలవాలని భావించా. సైనికులు దేశ సరిహద్దుల్లో ఉండి పోరాటాలు చేస్తున్నారు. వారికి ఎంత ఇచ్చినా తక్కువే. అందుకే నా వద్ద ఉన్న 55 లక్షల్లో 50 లక్షల రూపాయలు దేశ సైనికుల సంక్షేమం కోసం గవర్నర్ తమిళసైకి అందజేశాను. ఆమె 'మంచిపని చేశావు' అని అభినందించారు. సైనికులకు సాయం అందించడం ఈ వృద్ధాప్యంలో నాకు ఎంతో సంతృప్తినిస్తోంది."

సైనికులు దేశ సరిహద్దుల్లో ఉండి పోరాటాలు చేస్తున్నారు. వారికి ఎంత ఇచ్చినా తక్కువే. అందుకే నా వద్ద ఉన్న 55 లక్షల్లో 50 లక్షల రూపాయలు దేశ సైనికుల సంక్షేమం కోసం గవర్నర్ తమిళసైకి అందజేశాను.

• **కోలా నాగేశ్వరరావు,** హుజూర్‌నగర్

విభిన్నం

కవితాత్మక టాటూలు!

సాధారణంగా పుస్తకాలు చదువుతున్నప్పుడు నచ్చిన వాక్యాలు, సందేశాలు, కవితాత్మక పంక్తులు కనిపిస్తే వాటిని వెంటనే డైరీలో రాసుకోవడం చాలామందికి అలవాటు. అయితే దేవప్రీత జెనా మాత్రం వాటిని తన శరీరంపై టాటూలుగా వేయించుకుంటుంది. పైగా శరీరమే తన డైరీ అంటుంది.

24 ఏళ్ల జెనా సోషియాలజీ స్కాలర్. ఆమె మెడ దగ్గర 'దేర్ ఈజ్ నో లవ్ ఆఫ్ లైఫ్ విథౌట్ డిస్పెయిర్ ఆఫ్ లైఫ్' అనే వాక్యం పచ్చబొట్టుగా కనిపిస్తుంది. "అది ఫ్రెంచ్ రైటర్ ఆల్బర్ట్ కామస్ రచనల్లోనిది" అంటోంది జెనా. ఢిల్లీలో సోషియాలజీలో మాస్టర్స్ చేసిన ఆమెకు ప్రపంచ సాహిత్యం పట్ల మక్కువ ఎక్కువ. ఫ్రెంచ్ రచయిత కామస్ రచనలను ఇష్టపడుతుంది. అందుకే ఆయన రచనల్లోని 'చలిలో మునిగిన తర్వాతే చివరికి నాకు తెలిసింది... నాలో కనిపించని వేసవి ఉందని' అనే అర్థం వచ్చే మరో వాక్యాన్ని కూడా ఒంటిపై టాటూగా వేయించుకుంది.

ఇవేగాక తన మనోభావాలను కూడా ఆమె టాటూ రూపంలో వెల్లడిస్తుంది. జెనా భుజంపై కనిపించే 'హెల్ ఓవర్ ఒబ్లివీయన్', మణికట్టుపై కనిపించే 'లైవ్. రివోల్ట్' అనే వాక్యాలు ఆమె ఆలోచనాక్షరాలే. "ఇవి జీవితం పట్ల నాకున్న నిర్దిష్ట అభిప్రాయాలను ప్రతిదినం రిమైండర్‌లా నాకు గుర్తుచేస్తాయి" అంటూ వాటిని ప్రేమగా తడుముకుంటారామె. వీటితోపాటు వేళ్లకొనలపై కూడా కవితాత్మకంగా ఉండే కొన్ని టాటూలు వేసుకున్నారు. సిగ్మండ్ ఫ్రాయిడ్ నుంచి కామస్ దాకా... ప్రపంచవ్యాప్తంగా ఉండే అనేక మంది తాత్వికులు, సామాజికవేత్తల పుస్తకాలు చదివిన జెనా ఒంటిపై కనిపించే టాటూలు ఆమెలోని ప్రత్యేకతను చాటుతాయి. 'జీవిత ప్రయాణంలో ఎదురైన అనేక అనుభవాల నేపథ్యంలోనే నచ్చిన కవితాత్మక పంక్తులు, జీవితసత్యాలను టాటూలుగా వేసుకుంటున్నా'నని చెబుతున్న ఈ సోషియాలజీ స్కాలర్ ప్రయత్నం కాస్త విభిన్నంగానే ఉంది కదూ!

బ్యూటీ

కన్‌సీలర్ వాడుతున్నారా?

నల్లమచ్చలు, మొటిమలు కనిపించకుండా హెవీమేకప్ వేసుకోవాల్సిన అవసరం లేదు. కన్‌సీలర్ ఉంటే చాలు వాటిని దాచేయొచ్చు. అయితే చర్మతత్వానికి సరిపడే కన్‌సీలర్ ఎంచుకోవడంతో పాటు దాన్ని సరిగ్గా ఉపయోగించడం తెలయాలి అంటున్నారు సౌందర్య నిపుణులు... అవేమిటంటే..

రెండు షేడ్స్ ఉండాలి: అన్ని సీజన్‌లకు ఒకే కన్‌సీలర్ సరిపోదు. కాబట్టి వేసవి, శీతాకాలంలో వాతావరణానికి తగ్గట్టుగా రెండు షేడ్స్ ఉన్న

కన్‌సీలర్స్ వాడాలి. మిగతా రోజుల్లో ఈ రెండిటిని కలగలిపి వాడితే మీ స్కిన్‌టోన్‌కు చక్కగా సరిపోతుంది.

రెండు రంగులు: నల్లమచ్చలు, మొటిమల్ని దాచేయడానికి ఏ రంగు కన్‌సీలర్ పనికొస్తుందో తెలుసుకొని కొనాలి. పసుపురంగు కన్‌సీలర్ వాడితే ఎర్రమచ్చలు, కళ్ల కింది వలయాలు కనిపించవు. అలాగే ఆకుపచ్చ కన్‌సీలర్‌తో మొటిమలు, వాటి తాలూకు మచ్చల్ని దాచేయచ్చు.

సహజకాంతిలో: కన్‌సీలర్ అప్లై చేసేటప్పుడు తగినంత వెలుతురు ఉండాలి. లేదంటే మీ చర్మానికి ఏరకం సరిపోతుందో తెలియదు. కాబట్టి కిటికి గుండా సూర్యరశ్మి పడుతున్న చోట నిల్చొని కన్‌సీలర్ వాడాలి. ఇలాచేస్తే మీ స్కిన్‌టోన్‌కు కన్‌సీలర్ ఏదో తెలుస్తుంది.

చేతితో తాకొద్దు: మేకప్ రంగు కన్‌సీలర్ స్టిక్‌కు అంటేందుకు చేతితో ముట్టుకోవద్దు. సింథటిక్ కన్‌సీలర్ బ్రష్ సాయంతో కళ్ల కింద మూడు చుక్కలు పెట్టి మేకప్ బ్రష్‌తో స్ప్రెడ్ చేయాలి.

నో కన్‌సీలర్: కళ్ల కింద ఏర్పడే వలయాల మీద కన్‌సీలర్ రాయొద్దు. దీంతో అవి హైలైట్ అయి ఎబ్బెట్టుగా కనిపిస్తాయి. ముఖం మీద ఏర్పడే ముడతలు, గీతల మీద కన్‌సీలర్ అప్లై చేస్తే అవి మరింత స్పష్టంగా కనిపించే వీలుంది.

వేడుక

సూర్య భగవానుడి సాక్షిగా...

శాస్త్రీయ నృత్య కళాకారుల కలల వేదిక 'కోణార్క్'. సూర్యభగవానుడికి నృత్య నీరాజనాలు ఇచ్చేందుకు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది కళాకారులు ఉత్సాహం చూపుతారు. 'వందే సూర్యమ్' అంటూ పరవశించిపోతారు. ప్రతీ ఏడాది పూరీలోని కోణార్క్ దేవాలయం వద్ద అంగరంగవైభవంగా నిర్వహించే 'కోణార్క్ ఫెస్టివల్ ఆఫ్ క్లాసికల్ డ్యాన్స్' ఆదివారం (1న) రాత్రి కన్నులపండువగా ప్రారంభమైంది. ఐదురోజుల పాటు సాగే ఈ ఉత్సవంలో ప్రసిద్ధ నృత్యకళాకారులు పాల్గొంటారు. ప్రారంభవేడుకల్లో భాగంగా ప్రదర్శించిన ఒక శాస్త్రీయ నృత్య సన్నివేశంలోని అద్భుత దృశ్యమిది.



లీగల్ కౌన్సెలింగ్

ఈ నరకం తప్పేదెలా?

నా పెళ్లయి ఇప్పటికి 11 ఏళ్లు. నాకు పదేళ్ల కూతురు ఉంది. నా సమస్య అంతా మా కుటుంబ సభ్యులతోనే. మా దాంపత్య జీవితంలో చిచ్చుపెట్టడానికి అత్తయ్య, ఆడపడుచు ఆమె భర్త చాలా కాలంగా ఏవేవో కుతంత్రాలు చేస్తూనే ఉన్నారు. నాపై లేనిపోనివన్నీ కల్పించి అదేపనిగా నా భర్తకు చెబుతూ ఉంటారు. దాంతో నా భర్త నన్ను తిట్టడం, కొట్టడం చేస్తుంటాడు. ఈ బాధలన్నీ భరించలేక నేను కొన్నాళ్లు మా పుట్టింట్లోనే ఉండిపోయాను. నా భర్త నన్ను కాపురానికి రమ్మని అడిగినప్పుడు 'మీ కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా వేరే ఇల్లు తీసుకుంటేనే మా అమ్మాయిని పంపిస్తా' అంటూ షరతు విధించారు మా వాళ్లు. అందుకు ఆయన ఒప్పుకున్నారు. ఆ మేరకు నా భర్త వేరే ఇల్లు తీసుకున్నారు. కానీ, అక్కడికి వెళ్లాక కూడా ఈ ముగ్గురూ వచ్చి, నన్ను పలు రకాలుగా క్షోభకు గురిచేస్తూనే ఉన్నారు. అంతిమంగా వీరంతా కలసి నా ప్రాణాలకే ముప్పు తెస్తారనిపిస్తోంది. నాకైతే ముందే వీరిని కట్టడి చేసేలా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే మేలేమో అనిపిస్తోంది. ఈ విషయంలో సలహా ఇవ్వండి.

- ఎల్, సత్యలక్ష్మి, కడప

మీరు రాసిన వివరాలను బట్టి మీ అత్తయ్య, ఆడపడుచు, మీ భర్త... ఈ ముగ్గురు కలిసి మిమ్మల్ని వేధిస్తున్న తీరు అంతా గృహహింస లేదా క్రూయాలిటీ కిందికి వస్తుంది. వేరే కాపురం పెట్టడానికి చేసుకున్న ఒప్పందం మేరకు మీరు కాపురానికి వెళ్లిన తరువాత కూడా మీ భర్త, మీ ఆడపడుచు ఆమె భర్త, మీ అత్తయ్య నుంచి మీకు ప్రాణహాని ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి ఒకసారి మధ్యవర్తుల ద్వారా అంగీకార పత్రం రాయించుకుని మీరు కాపురం చేయవచ్చు. ఆ తరువాత కూడా మీ భర్త గానీ, మీ అత్తగారి కుటుంబ సభ్యులు గానీ, మిమ్మల్ని శారీరకంగానో, మానసికంగానో హింసిస్తే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. పోలీసులు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అలా కాకుండా మీ భర్త లేదా వారి కుటుంబ సభ్యులు ఏదో చేస్తారని ఊహించి ముందుగానే ఫిర్యాదు చేస్తే ఆ విషయంలో ఏ చర్యలూ తీసుకోలేరు. హాని జరిగే ప్రమాదం ఉందని, ఇప్పుడే మీకు చట్టపరమైన రక్షణ కల్పించడానికి చట్టంలో ఏ వెసులుబాటూ లేదు. ఒకవేళ మీ భర్తమీద, వారి కుటుంబ సభ్యుల మీద మీకు బొత్తిగా నమ్మకం లేకపోతే మీరు మీ తల్లిదండ్రుల వద్దే ఉంటూ భర్త నుంచి మీకూ, మీ పాపకూ మెయింటెనెన్స్ కోసం భరణం పొందే అవకాశం ఉంది. మీ భర్తలో ఏ మార్పూ రాదని తేలితే, దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో అతను పెడుతున్న హింసల గురించి ఫిర్యాదు చేయండి. అందుకుగానూ గృహహింస చట్టం 498 - ఎ కింద కేసులు పెట్టవచ్చు. ఈ విషయమై సంబంధిత కోర్టులో పిటిషన్ వేస్తే మీకు వేరే నివాసం, మెయింటెనెన్స్ డబ్బు ఇప్పించడానికి కోర్టు తగిన సహకారం అందిస్తుంది.

• **ఒడ్నాల శ్రీహరి**
న్యాయవాది,
హైదరాబాద్



డిమెన్షియా కేర్

చంటి బిడ్డలా సాకుదాం!

కనిపించినవన్నీ నోట్లో పెట్టుకుంటారు.
ఆదమరిస్తే ఇంట్లో నుంచి వెళ్లిపోతారు.
తిండి తినకుండా మొండికేస్తారు.
అరుస్తారు, ఏడుస్తారు, కొడతారు!
...ఇలా ప్రవర్తించేది పిల్లలే అనుకుంటే పొరపాటు!
వృద్ధులైన డిమెన్షియా వ్యాధిగ్రస్తులదీ ఇదే ధోరణి!
ఒక రకంగా వాళ్లూ పసిపిల్లలే!
ఇలాంటి వారి బాగోగులు చూసేవాళ్లు
వారితో ఎలా మెలగాలి?
వార్ని ప్రవర్తనలను ఎలా అర్థం చేసుకోవాలి?

డిమెన్షియా, అల్జీమర్స్... రెండూ మతిమరుపు రుగ్మతలే అయినా రెండిటికీ తేడా ఉంది. జ్ఞాపకశక్తి తగ్గడం, రోజువారీ పనులను తమంతట తాము చేసుకోలేకపోవడం, భావసమాచారంలో లోపాలు డిమెన్షియా కోవలోకి వస్తాయి. అల్జీమర్స్ కూడా డిమెన్షియాలో ఆ భాగమే! అయితే వయసు పెరిగేకొద్దీ అల్జీమర్స్ మరింత తీవ్రమవుతూ జ్ఞాపకశక్తితో పాటు, ఆలోచించే విధానాన్నీ, భాషనూ కూడా ప్రభావితం చేస్తుంది. డిమెన్షియా, అల్జీమర్స్... రెండూ వృద్ధాప్యంలో వేధించే చిత్రమైన సమస్యలు. ఈ సమస్యలతో బాధపడేవారి కంటే, వారి బాగోగులు చూసుకునేవారికి డిమెన్షియా ఓ అగ్ని పరీక్ష. వారి సహనానికి అంతకు మించిన పరీక్ష. అయితే ఈ రుగ్మత కలిగిన వారితో మెలిగే విధానం, వారి ప్రవర్తనలకు తగ్గట్టు స్పందించడం ఎలాగో తెలుసుకోవాలి. అప్పుడే వ్యాధిగ్రస్తులతో పాటు, వారి కేర్ టేకర్స్, కుటుంబసభ్యులు కూడా నాణ్యమైన జీవితాన్ని గడపగలుగుతారు.

ప్రవర్తనలను బట్టి....

నలుదిక్కులా ఒకే రకమైన దారులు కనిపిస్తే, ఏ దారి సరైనదో తెలుసుకోలేక ఆయోమయానికీ, అసహనానికీ లోనవుతాం. డిమెన్షియా వ్యాధిగ్రస్తుల స్థితి ఇలాంటిదే! కాబట్టి వారిని చేయి పట్టి నడిపించవలసిన బాధ్యత మనదే! అయితే వ్యాధిలో భాగంగా వీరిలో పలురకాల వింత ప్రవర్తనలు కనిపిస్తూ ఉంటాయి. ఇలాంటి ప్రవర్తనలకు సున్నితంగా స్పందిస్తూ, పరిస్థితిని మన చేతుల్లోకి తీసుకుని, లౌక్యంగా మసలుకోవాలి!



ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోతుంటే?: అలా జరుగుతుంది కదా అని వారిని గదిలో బంధించకూడదు. తలుపులకు తాళాలు వేయడం లాంటివీ చేయకూడదు. అంటే.. తమను బంధిస్తున్నట్టు వారు గ్రహించేలా ప్రవర్తించకూడదు. అలాగని వారికి ఎల్లవేళలా కాపలా ఉండడం కూడా కుదరదు కాబట్టి, డిమెన్షియా ఉన్నవారు స్వేచ్ఛగా తిరగగలిగేటంత విశాలంగా నివాసం ఉండేలా చూసుకోవాలి. ఇంటి గేటుకు తాళం వేసి పెట్టాలి. అవసరాన్నిబట్టి జిపిఎస్ ట్రాకింగ్ పరికరాలను ఉపయోగించాలి. వారి పేరు, రుగ్మత, ఇంటి అడ్రస్ వివరాలున్న లాకెట్‌ను వారి మెడలో వేలాడదీయాలి.

అనుమానిస్తూ ఉంటే?: భోజనంలో ఏదో కలిపామనే అనుమానంతో తమ బాగోగులు చూసుకునేవాళ్లనే అనుమానించే వారూ ఉంటారు. ఇలాంటప్పుడు ఇంట్లో వారికి ఇష్టమైన వ్యక్తులతో భోజనం పెట్టించాలి. కుటుంబసభ్యులు అందరితో పాటు, వారికీ భోజనం పెట్టాలి. "మేం అందరం అదే తింటున్నాం, నీకూ అదే పెడుతున్నాం. కాబట్టి భోజనం సురక్షితమైనదే" అన్నట్టు ప్రవర్తించాలి.

భ్రమలకు లోనవుతూ ఉంటే?: ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు కొందరు ప్రవర్తిస్తూ ఉంటారు. వస్తువులను గుర్తుపట్టలేక, పొరపాటు పడుతూ ఉంటారు. ఈ భ్రమలను తేలికగా తీసుకూడదు. వారికి కనిపిస్తున్నది వారి దృష్టిలో వాస్తవం. కాబట్టి తేలికగా తీసుకోకుండా, వారి భ్రమలను మాటలతో దూరం చేయాలి. దుప్పటి మీద పురుగులు కనిపిస్తున్నాయని ఆరోపిస్తే, "అలాగా, దులిపితే వెళ్లిపోతాయి" అంటూ దుప్పటి దులపాలి.

కోపం తెచ్చుకుని, అరుస్తుంటే?: డిమెన్షియా వ్యాధిగ్రస్తులు తమ ప్రపంచానికి విరుద్ధమైన దేన్నీ తట్టుకోలేరు. తమకు జ్ఞాపకశక్తి లోపం ఉందనే విషయాన్ని ఎత్తి చూపే ఏ పరిస్థితినీ ఓర్చుకోలేరు. అలాగే తాము అనుకున్నది చేయడానికి అడ్డొచ్చే ఏ అవరోధాన్నీ సహించలేరు. అలాంటప్పుడు కోపం తెచ్చుకుని, అరుస్తారు. కాబట్టి కారణాన్ని కనిపెట్టి ప్రతికూల అంశాన్ని దూరం చేసే ప్రయత్నం చేయాలి! అయితే హింసాత్మకంగా ప్రవర్తిస్తుంటే వైద్యుల సూచన మేరకు మందులు వాడుకోవచ్చు.

భోజనం చేయకపోతూ ఉంటే?: కొందరు ఇతర కుటుంబసభ్యులు ఉన్నారనే విషయం ఆదమరిచి, భోజనం గిన్నెలు అన్నీ ఖాళీ చేసేస్తారు. ఇంకొందరు పూర్తిగా భోజనమే మానేస్తూ ఉంటారు. ఈ రెండు పరిస్థితులోనూ ఎంతో జాగ్రత్తగా మెలగాలి. ఇతరులను పట్టించుకోకుండా ఉన్నదంతా తినేసేవారికి ఒకేసారి ఎక్కువ మొత్తంలో భోజనం పెట్టకుండా, దాచి ఉంచి, విడతలవారీగా పెడుతూ ఉండాలి. భోజనమే మానేసేవారికి పిల్లలకు నచ్చచెప్పి పెట్టే విధంగా, "ఈ పదార్థం తిన్నావంటే, నీకిష్టమైన పని చేద్దాం" అంటూ వారు చేయడానికి ఇష్టపడే పనుల పట్ల ఆశ చూపాలి.

కాలకృత్యాలు: కొందరికి మలమూత్రాల మీద నియంత్రణ పోతుంది. మరికొందరికి అందుకోసం టాయ్‌లెట్ వాడాలనే ఆలోచన రాదు. ఇంట్లో తమకు తోచిన చోట చేసేస్తూ ఉంటారు. ఇలా నియంత్రణ లేని వారికి అడల్ట్ డయాపర్లు వాడాలి. టాయ్‌లెట్ ఎటు ఉందో మర్చిపోయేవారికి, ఎర్రని బాణం గుర్తులతో మార్గనిర్దేశం చేయాలి. టాయ్‌లెట్ సీటు వారికి ఇష్టమైన రంగులో ఉంటే మరీ మేలు!

దుస్తులు తీసేస్తూ ఉంటే?: తేలికగా ఉంటుంది కదా అని నైట్ డ్రస్ వేస్తే, దాన్ని తీసి గిరాటేస్తూ ఉంటారు. ఇలాంటప్పుడు వారికి ఇష్టమైన దుస్తులే వేస్తూ ఉండాలి. అలవాటు లేని, ఇష్టం లేని దుస్తులు వేస్తే, వాటిని డిమెన్షియా వ్యాధిగ్రస్తులు ఉంచుకోలేరు.

గ్రూపుగా ఏర్పడండి!

డిమెన్షియా వ్యాధిగ్రస్తుల బాగోగులు చూసేవాళ్లు, సపోర్టివ్ గ్రూప్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఉపయోగం ఉంటుంది. సలహాలు పొందడానికి, ఒకరికొకరు ఆసరాగా నిలవడానికి ఈ గ్రూప్స్ దోహదపడతాయి. అలాగే కేర్ టేకర్స్ కోసం గూగుల్ ప్లేలో రకరకాల యాప్స్ అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా కూడా కేర్ గివర్స్ ఉపయోగాలు పొందవచ్చు.

వారి ప్రపంచంలోకి వెళ్లాలి!

మనమెలా కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవాన్ని బలంగా నమ్ముతామో, డిమెన్షియా ఉన్న వ్యక్తులు కూడా వారు ఊహల్లో బ్రతుకుతున్న ప్రపంచమే వాస్తవమైనది అనే దృఢమైన నమ్మకంతో ఉంటారు. అయితే ఆ వాస్తవానికీ ఎదురుగా జరుగుతున్న సంఘటనలకూ, కనిపిస్తున్న దృశ్యాలకూ పొంతన కుదరకపోవడంతో అసహనానికి లోనవుతారు. అయితే వారు వ్యక్తపరిచే భావోద్వేగాలు, ప్రవర్తన, మాటల ఆధారంగా వారు ఏం కోరుకుంటున్నారో, అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో, ఏం చెప్పదలుచుకుంటున్నారో తేలికగా అర్థం చేసుకోగలగాలి. అందుకు తగ్గట్టు, మనం వారి ప్రపంచంలోకి వెళ్లి వారితో మెలగాలి.

ఎలా మాట్లాడాలంటే...

సరళమైన భాషలో: డిమెన్షియాతో బాధపడుతున్నవారిని ఒకసారికి ఒకే ప్రశ్న అడగాలి. ఒకటికి మించి ప్రశ్నలను కలిపి అడగకూడదు.

అవును, కాదు: 'భోజనంలో ఏం తిన్నావు?' అని కాకుండా, "భోజనం నీకు నచ్చిందా?" అని అడగాలి. "అవును లేదా కాదు" అనే సమాధానాలు పొందేలా మీ ప్రశ్నలు ఉండేలా చూసుకోవాలి.

ఓర్పు అవసరం: డిమెన్షియా ఉన్న వ్యక్తులకు సురక్షితంగా ఉన్నామనే భావన కలిగించాలి. అంతే తప్ప, ఒత్తిడికి లోను చేయకూడదు. వారి ప్రవర్తనతో చీకాకు, కోపం తలెత్తితే, స్వల్ప సమయం పాటు బ్రేక్ తీసుకుని, తిరిగి పూర్వపు ఓర్పును ప్రదర్శించండి.

నేర్పు అవసరం: కొన్ని ప్రశ్నలకు సమాధానాలు సూటిగా కాకుండా, నేర్పుగా చెప్పాలి. ఉదాహరణకు... "మా అమ్మ ఎక్కడుంది?" అని అడిగినప్పుడు "20 ఏళ్ల క్రితమే చనిపోయింది" అని చెబితే వారిలో అనవసరపు ఆందోళన తలెత్తుతుంది. కాబట్టి 'ఆమె ఇప్పుడు ఇక్కడ లేదు' అని నేర్పుగా చెప్పండి.

మెలకువలు: డిమెన్షియా ఉన్న వ్యక్తిని ఆకర్షించడం కోసం మాట్లాడేటప్పుడు చూపులు కలపడం, చిరునవ్వు నవ్వడం, చేతులు కదిలించడం, తాకడం లాంటి మెలకువలు అలవరుచుకోవాలి.

కూడని మాటలు: "నీకు గుర్తుందా? గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించు. మర్చిపోయావా? ఆ విషయం నీకెందుకు తెలియదు?" ఇలా వారిని మరింత నిస్సహాయతకు లోను చేసే మాటలు మాట్లాడకూడదు.

పెద్ద సంభాషణలు వద్దు!: ఒకేసారి పది వాక్యాల్లో పట్టేటంత పెద్ద సంభాషణలు చేయకూడదు. బదులుగా తక్కువ పదాలతో కూడిన ఏక వాక్య ప్రయోగాలు చేయాలి.

నిస్సహాయతను గుర్తు చేయకూడదు: 'నీకు ఇందాకే చెప్పాను కదా?" లాంటి మాటలతో వారి సమస్యను పదే పదే గుర్తు చేయకూడదు.

నిర్దిష్టంగా చెప్పాలి!: అక్కడ, అది, అవి, అతను, ఆమె అనే సర్వనామాలకు బదులు నేరుగా నామవాచకాలనే సంభాషణలో వాడాలి. ఉదాహరణకు... "అక్కడ కూర్చో" అనడానికి బదులు నిర్దిష్టంగా "ఆ ఎర్ర కుర్చీలో కూర్చో" అని చెప్పాలి.

హేళన కూడదు: వ్యంగ్యంగా, హేళనగా, హాస్యంగా డిమెన్షియా ఉన్న వారిని ఉద్దేశించి మాట్లాడకూడదు. ఇలా చేస్తే వారు అయోమయానికి లోనయ్యే ప్రమాదం ఉంటుంది. మనసు చిన్నబుచ్చుకునే అవకాశమూ ఉంటుంది.

- డాక్టర్ టి.సూర్య ప్రభ
న్యూరాలజిస్ట్, నిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్

హోమియో

చెవిలో శబ్దాలా?

- చలికాలంలో చెవి సమస్యలు చాలా ఎక్కువగానే ఉంటాయి. ముఖ్యంగా, చెవుల్లో హోరు, వినిపించకపోవడం, చెవుల్లో తేనెటీగెల మోత వంటి శబ్దాలు కొంత మందిని చాలా ఇబ్బంది పెడుతుంటాయి. చెవి సంబంధమైన నాడులు బలహీనమవడం వల్ల చెవుల్లో శబ్దాలతో పాటు తలతిరగడం ఉన్నా, ఉంటే 'శాలిసికం యాసిడం-30'మందు బాగా పనిచేస్తుంది.

- చెవుల్లో కొందరికి చీలుస్తున్నట్లు విపరీతమైన నొప్పి కలుగుతుంది. ఇలాంటి వారు 'స్కిల్లా-మారిటిమా- 30' మందు వేసుకుంటే త్వరితంగా ఉపశమనం లభిస్తుంది.
- చెవులు దిబ్బడ వేయడంతో పాటు, గుబిలి పట్టడం, ఆ కారణంగా చెవుడు రావడం, చలికాలంలో ఒక సమస్య, ఇదే సమయంలో ముక్కునుంచి నల్లని రక్తం రావడం, జెల్లీ వంటి చిక్కటి మ్యూకస్ చేరడం, ముక్కులో దురద, దిబ్బడ ఉంటే 'సెలీనియం- 30' మందు బాగా ఉపయోగపడుతుంది.
- కుడిచెవి వేడిగానూ, ఎడమ చెవి చల్లగానూ ఉండడంతో పాటు చెవుల్లో గోడగడియారపు టిక్‌టిక్‌ధ్వనులు, చెవుల్లో వాపు, చెవిపోటు వంటి సమస్యలు ఉంటే 'టెరెబింత్-30'మందు వేసుకోవాలి. దీని వల్ల చాలా వేగంగా ఆ సమస్యలనుంచి విముక్తి పొందవచ్చు.

- డాక్టర్ బి. అనిల్ కుమార్, హోమియో వైద్య నిపుణులు, హైదరాబాద్

హార్మోనల్ హెల్త్

ఈ అవమానాలు ఎంతకాలం?

డాక్టర్! మాకు పెళ్లై మూడేళ్లు. ఇంతవరకూ పిల్లలు కలగలేదు. నాకు స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉందని పరీక్షల్లో తేలింది. హకీమ్ దగ్గర చికిత్స కూడా తీసుకున్నాను. అయినా ఫలితం లేదు. దాంతో మా ఆవిడ, అత్తగారు నేను నపుంసకుడిని అనీ, ఎందుకూ పనికిరాననీ అవమానపరుస్తున్నారు. దాంతో మా ఆవిడకు శారీరకంగా కూడా దగ్గర కాలేకపోతున్నాను. వాళ్లు అంటున్నట్టుగా నేను నపుంసకుడిని అనుకోవాలా?

- హుస్సేన్, హైదరాబాద్

వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉన్నంత మాత్రాన నపుంసకులుగా భావించవలసిన అవసరం లేదు. నపుంసకత్వం అనేది లేదు, ఉండదు. అంతగా వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. మీ స్పెర్మ్ కౌంట్ తగ్గడానికి కారణాన్ని కనిపెట్టి, చికిత్స చేస్తే పరిస్థితి మెరుగవవచ్చు. అందుకోసం వైద్యులను కలవండి. ఒకవేళ చికిత్సతో సరిదిద్దలేని సమస్య అయిన పక్షంలో ఐ.యు.ఐ (ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినైజేషన్) ద్వారా పిల్లల కోసం ప్రయత్నించవచ్చు. కాబట్టి మీరు మీ భార్యను వెంటబెట్టుకుని వైద్యులను కలవండి. వైద్యుల మాటలతో ఆవిడ పరిస్థితిని అర్థం చేసుకోగలుగుతారు. మున్ముందు మిమ్మల్ని సూటిపోటి మాటలు అనడం మానేస్తారు.

- డాక్టర్ రాహుల్ రెడ్డి
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్
8332850090 (కన్సల్టేషన్ కోసం)

హెల్తీ ఫుడ్

నెయ్యితో ఎన్ని లాభాలో!

ఆహార పదార్థంగానే కాదు, నెయ్యిని ఒక ఔషధంగా వాడుతూ వస్తోంది మన భారతీయ సమాజం. ఎముకల పటిష్ఠతకూ, జీర్ణక్రియ సజావుగా సాగడానికీ నెయ్యి గొప్పగా తోడ్పడుతుంది. శీతకాలంలో దేహాన్ని వెచ్చగా కూడా ఉంచుతుంది. చర్మ కాంతికీ, కేశ పోషణకూ నెయ్యి ఉపయోగపడుతుంది. ఇంకా అనేకానేక ప్రయోజనాలు ఉండడం వల్ల కొందరు వంటకాల్లో నూనెకు ప్రత్యామ్నాయంగా నెయ్యి వాడుతున్నారు. శరీర అవయవాల్లో శక్తిని నింపడంతో పాటు జ్ఞాపకశక్తినీ, మేధస్సునూ పెంచడం ద్వారా నెయ్యి శారీరక, మానసిక శక్తిని పెంచే ఒక టానిక్‌గా పనిచేస్తోంది. నెయ్యిని కొందరు ఔషధ మూలికా కషాయాలకు సమానంగా పరిగణిస్తారు.

- మరిగించిన 60 మి.లీటర్ల నీటిలో చిటికెడు దాల్చిన చెక్క పొడి, చిటికెడు పసుపు పొడి, అరచెంచా నెయ్యి కలిపి పరగడుపున ఒకసారి, రాత్రి భోజనం తర్వాత ఒక సారి సేవిస్తే మధుమేహం అదుపులో ఉంటుంది.
- 30 మి.లీ. నీటిలో అరచెంచా పసుపు, ఒక టీ స్పూను నెయ్యి వేసి ఆరగిస్తే గొంతు నొప్పి, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది.
- పొడి చర్మం వాళ్లు నెయ్యితో మర్దన చేసుకుంటే, ఆ పొడితనం పోవడంతో పాటు చర్మం మృదువుగానూ, కాంతివంతంగానూ మారుతుంది.
- నెయ్యిలోని కొవ్వు కంటికి ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా రెటీనాను ఇది శక్తివంతంగా మారుస్తుంది.
- నిరంతరంగా నెయ్యి వాడే వారిలో వీర్యకణాల నాణ్యత, వాటి సంఖ్య పెరుగుతాయి.
- నోటిలో బొబ్బలు వచ్చిన వారు, ఆయా భాగాల్లో నెయ్యి రాస్తే చాలా త్వరితంగా తగ్గుతాయి.

అయితే దేశీయ ఆవు నెయ్యితో మాత్రమే ఈ ఫలితాలు లభిస్తాయనే విషయాన్ని ఎప్పుడూ విస్మరించకూడదు.

విజ్ఞాన

చేసెయండి!

బొమ్మ లారీ

కావలసినవి
- రెండు ఖాళీ అట్ట డబ్బాలు (వేర్వేరు సైజులవి)
- అట్టముక్క
- స్కెచ్‌లు
- పాత న్యూస్ పేపర్లు
- కత్తెర
- జిగురు
- రెండు స్ట్రాలు
- రంగు కాగితాలు

రెండు అట్టడబ్బాలను తీసుకుని వాటిలో పాత న్యూస్‌పేపర్లు వేసి నింపండి. తరువాత అట్టపెట్టెలని మూసి జిగురుతో అంటించండి. ఆ పెట్టెలకి రంగు కాగితాలను అతికించండి. చిన్న పెట్టె వెనుక పెద్ద పెట్టెను అతికించండి. స్ట్రాలను లారీ పొగ గొట్టాలుగా అంటించండి. స్కెచ్ పెన్నులతో అద్దాలు, తలుపులు, లైట్లు గీయండి. ఇంకేం... మీరు ఆడుకోవడానికి బొమ్మ లారీ రెడీ.



బొమ్మల ఆధారంగా గడులు పూరించండి

జత ఉన్న బొమ్మ ఏది?

దారి కనుక్కోండి?

చుక్కలు కలిపి రంగులు వేయండి

డైలీ సుడోకు - 212

		1			4		7	
6		3						
	5				2			1
1			4			2	9	
4				5				6
	6	9			7			3
8			6				2	
						4		8
	4		1			3		

సుడోకు- 211 సమాధానం

4	2	5	7	3	6	9	8	1
1	3	6	4	9	8	5	2	7
9	8	7	5	2	1	6	3	4
7	9	2	3	1	4	8	5	6
5	1	8	6	7	9	3	4	2
6	4	3	2	8	5	1	7	9
2	7	9	1	5	3	4	6	8
3	6	1	8	4	7	2	9	5
8	5	4	9	6	2	7	1	3

ఎలా పూరించాలి? ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

'వెంకీమామ' పుట్టినరోజుకి వస్తున్నారు!

వెంకటేశ్, నాగచైతన్య

మేనమామ వెంకటేశ్‌తో కలిసి ఆయన మేనల్లుడు నాగచైతన్య హీరోలుగా నటించిన సినిమా 'వెంకీమామ'. కె.ఎస్. రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో సురేశ్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రమిది. ఇందులో రాశీ ఖన్నా, పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్లు. ఈ చిత్రాన్ని వెంకటేశ్ పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 13న విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. "నాగచైతన్య, రాశీ ఖన్నా పుట్టినరోజులకు వారి టీజర్స్ విడుదల చేశాం. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు అద్భుత స్పందన లభించింది. అంచనాలకు తగ్గట్టు సినిమా ఉంటుంది" అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎస్.ఎస్. తమన్ సంగీత దర్శకుడు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాత.

మాస్ లుక్.. మైండ్ బ్లాక్!

మహేశ్‌బాబు

మహేశ్‌బాబు పాటల సందడి మొదలైంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్న 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో మొదటి పాటను సోమవారం విడుదల చేశారు. 'మైండ్ బ్లాక్.. బాబూ.. నీ మాస్ లుక్కు మైండ్ బ్లాకు' అంటూ సాగే పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా దేవిశ్రీప్రసాద్ మాస్ బీట్‌తో ట్యూన్ అందించారు. రెనినా రెడ్డి, బ్లేజ్ ఆలపించిన ఈ పాటలో 'నువ్ కొట్టరా..' అని మహేశ్ ఇచ్చిన వాయిస్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా ఉంది. ఇదే నెలలో మిగిలిన నాలుగు పాటల్ని విడుదల చేస్తామని చిత్ర బృందం పేర్కొంది. "మాస్ పాటను ఎవరు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అవుతుందో ఆడే డీఎస్‌పీ' అని మొదటి పాట విడుదల చేయడానికి ముందు అనిల్ రావిపూడి ట్వీట్ చేశారు. దిల్‌రాజు శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సమర్పణలో జి.ఎం.బి. ఎంటర్‌టైన్‌మెంట్, ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రమిది. విజయశాంతి ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. రష్మిక మందన్నా కథానాయిక. సంక్రాంతి కానుకగా జనవరి 11న విడుదల చేస్తున్నారు.

జయలలితగా రమ్యకృష్ణ

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవిత కథ ఆధారంగా గౌతమ్ మీనన్ తెరకెక్కిస్తున్న 'క్వీన్' వెబ్ సిరీస్ టీజర్ సోమవారం విడుదలైంది. ఇందులో జయలలితగా రమ్యకృష్ణ కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'క్వీన్' ఫస్ట్‌లుక్ ఎంతగానో ఆకట్టుకుంది. 'స్కూల్ డేస్‌లో స్టేట్ టాపర్, 18 ఏళ్ల వయసుకే స్టార్ హీరోయిన్, అతి చిన్న వయస్కురాలైన ముఖ్యమంత్రి, ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకునే 'క్వీన్' మీకోసం ఎదురుచూస్తుంది' అని 'క్వీన్' బృందం సోషల్ మీడియాలో పేర్కొంది. ఈ నెల 5న ట్రైలర్ విడుదల చేయనున్నారు. జయలలిత జీవిత కథతో చాలా బయోపిక్‌లు సిద్ధమవుతున్నాయి. వీటిలో రెండు చిత్రాలు మాత్రం చిత్రీకరణ దశలోనే మంచి క్రేజ్ తెచ్చుకున్నాయి. అందులో ఒకటి గౌతమ్ మీనన్ తెరకెక్కించే 'క్వీన్', రెండోది విజయ్ దర్శకత్వం వహిస్తున్న 'తలైవి'.

నిజాలే రాయండి

- రకుల్

తెలుగుతోపాటు తమిళంలోనూ అగ్ర కథానాయికగా వెలుగొందిన ఢిల్లీ భామ రకుల్ ప్రీత్‌సింగ్. మాతృభాషలో అరాకొరా సినిమాలు చేసినా అవి అంతంత మాత్రంగానే ఆడాయి. ప్రస్తుతం రకుల్ బాలీవుడ్‌పై ఎక్కువ దృష్టి సారించింది. అక్కడ వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా ఉండడంతో హైదరాబాద్ నుంచి మకాం మార్చేస్తుందని ఇటీవల వార్తలు వచ్చాయి. తను ఎంతో ఇష్టపడి హైదరాబాద్‌లో కొనుకున్న ఇంటిని అమ్మేసి బెంగళూరులో కొత్త ఇల్లు కొన్నదని గాసిప్పులూ వచ్చాయి. ఈ విషయంపై రకుల్ ట్విట్టర్ వేదికగా సీరియస్‌గా స్పందించారు. "ఇలాంటి వార్తలు ఎలా వస్తాయో అర్థంకాదు. నేను హైదరాబాద్‌లో ఇల్లు కొన్నప్పుడు.. ఓ హీరో ఆ ఇంటిని నాకు బహుమతిగా ఇచ్చారని రాశారు. మళ్లీ ఇప్పుడు హైదరాబాద్‌లో ఇంటిని అమ్మేసి బెంగళూరులో ఇల్లు కొన్నానని రాస్తున్నారు. దయచేసి ఇలాంటి అసత్యాలను ప్రచారం చేయకండి. నిజాలు మాత్రమే రాయండి" అని రకుల్ పేర్కొన్నారు.

'కమ్మరాజ్యంలో కడపరెడ్లు' చిత్రానికి సెన్సార్ అభ్యంతరం

వారం రోజుల్లోగా 'కమ్మరాజ్యంలో కడపరెడ్లు' చిత్రం చూడాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రీజినల్ సెన్సార్ బోర్డ్ ఆ చిత్రాన్ని చూసి సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించింది. ఇది తమ నైతిక విజయమని ఆ సినిమాపై కోర్టుకు వెళ్లిన ఇంద్రసేన చౌదరి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సెన్సార్ కార్యాలయానికి ఇంద్రసేన చౌదరి, హైకోర్టు న్యాయవాది బాలాజీ వెళ్లి సెన్సార్ అధికారిని కలిశారు. ఈ సందర్భంగా ఇంద్రసేన చౌదరి విలేకరులతో మాట్లాడుతూ ' పబ్లిక్ ఇంట్రస్టెడ్ లిటిగేషన్ కింద హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయడం వల్ల కోర్టువారు మా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను ఆదేశించారు. హైకోర్టు సూచనల మేరకు సెన్సార్ బోర్డు సభ్యులు శనివారం సినిమాను చూసి, 'కమ్మరాజ్యంలో కడపరెడ్లు' చిత్రం ప్రజల్లోకి వెళ్లడం సహేతుకం కాదని నిర్ణయించారు. పిటీషనర్ వ్యక్తం చేసిన అభ్యంతరాలు సినిమాలో చాలా స్పష్టంగా ఉన్నాయని సెన్సార్ బోర్డ్ భావించి సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించింది. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని కోర్టు మరోసారి నిరూపించింది. ఆ సినిమాకు సెన్సార్ బోర్డ్ సర్టిఫికెట్ నిరాకరించడం మా విజయంగా భావిస్తున్నాం' అన్నారు. సెన్సార్ బోర్డ్ సర్టిఫికెట్ ఇవ్వలేమని చెప్పిన నేపథ్యంలో ఆ సినిమాకు సంబంధించిన ట్రైలర్లు, హోర్డింగులు ప్రదర్శించడం చట్టరీత్యా నేరమవుతుందనీ, వెంటనే వాటిని నిర్మాతలు తొలగించాలనీ న్యాయవాది బాలాజీ చెప్పారు.

రివైజింగ్ కమిటీకి...

ఈ విషయమై చిత్రనిర్మాతలను సంప్రదించగా, రీజినల్ సెన్సార్ బోర్డ్ అభ్యంతరం చెప్పడంతో రివైజింగ్ కమిటీకి వెళుతున్నామనీ, సెన్సార్ సర్టిఫికెట్ చేతికి వచ్చిన తర్వాత విడుదల తేదీ ప్రకటిస్తామని చెప్పారు.

నేను... అంజలా జవేరి... పిల్లలు వద్దనుకున్నాం!

"నేను పంజాబీ! పంజాబ్‌లో పుట్టాను. అస్సాంలో పెరిగాను. చెన్నైలో చదువుకున్నాను. బెంగళూరులో మోడల్‌గా పని చేశా. నటుడిగా హిందీ సినిమాలతో కెరీర్ ప్రారంభించాను. ఇప్పుడు దక్షిణాది సినిమాలు ఎక్కువ చేస్తున్నాను. అందుకని, నన్ను నేను 'భారతీయుడి'గా చెప్పుకుంటాను. నేను ఎక్కడికి వెళ్లినా 'సౌత్ విలన్' అంటున్నారు. సంతోషంగా ఉంది" తరుణ్ రాజ్ అరోరా అన్నారు. 'ఖైదీ నంబర్ 150'తో ఆయన తెలుగు తెరకు ప్రతినాయకుడిగా పరిచయమయ్యారు. తర్వాత 'కాటమరాయుడు', 'జయ జానకీ నాయక', తాజాగా విడుదలైన 'అర్జున్ సురవరం'లో ఆయన ప్రతినాయకుడిగా నటించారు. ఈ సందర్భంగా తెలుగు మీడియాతో తరుణ్ రాజ్ అరోరా ముచ్చటించారు. ఆ విశేషాలు...

- 'అర్జున్ సురవరం' మాతృక 'కణితన్'లో నటించా. తెలుగులో మళ్లీ అదే పాత్ర పోషించా. అయితే... తెలుగులో భావోద్వేగ సన్నివేశాలను జోడించారు. రెండు సినిమాలూ హిట్టయ్యాయి. నా నటనకు మంచి పేరొచ్చింది. నన్నంతా స్టైలిష్ విలన్ అంటుంటే హ్యాపీగా ఉంది.
- ప్రతి ఒక్కరూ హీరో కావాలనే చిత్రసీమకు వస్తారు. నేనూ హీరో కావాలనే వచ్చాను. ప్రారంభంలో హిందీ సినిమాల ఎంపికలో కొన్ని తప్పులు చేశా. అందువల్ల, 'జబ్ వుయ్ మెట్' తర్వాత కొంత విరామం తీసుకున్నా. అయితే... ఆ తప్పులే నాకు నటన నేర్పాయి. ఇప్పుడు ప్రతినాయకుడి పాత్రలపై దృష్టి పెట్టాను. విలన్‌గా డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలు చేయాలనుంది.
- నా సినిమాల ఎంపికలో నా శ్రీమతి, నటి అంజలా జవేరి జోక్యం ఉండదు. నాకంటూ నేనుగా ఓ గుర్తింపు తెచ్చుకోవడం తనకు సంతోషంగా ఉంది. చిరంజీవిగారు 'ఖైదీ నంబర్ 150'లో నాకు అవకాశం ఇచ్చినందుకు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటామని చెబుతుంటుంది. ఆ సినిమా వల్లే తెలుగులో నాకింత గుర్తింపు లభించింది.
- అంజలా జవేరితో నాది 20 ఏళ్ల స్నేహం. తను తెలుగు సినిమాల్లో నటించేటప్పుడు మోడల్‌గా చేసేవాణ్ణి. స్నేహితుల ద్వారా పరిచయమైంది. మెల్లగా ప్రేమలో పడ్డాం. ముందు నేనే ప్రపోజ్ చేశా. ఇంట్లోవాళ్ల కోసం పెళ్లి చేసుకున్నాం. మా పెళ్లై ఏడెనిమిదేళ్లు అవుతోంది. పిల్లలు వద్దనుకున్నాం. కొన్ని రోజుల తర్వాత ఓ చిన్నారిని దత్తత తీసుకుంటాం.
- 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' తర్వాత అంజలా జవేరి నటించలేదు. నన్ను చూసి తనూ నటించాలనుకుంటోంది.


వివేక్, వందన, టీజీ విశ్వప్రసాద్, హేమంత్, కోన వెంకట్, సుబ్బరాజు

హాలీవుడ్ స్థాయిలో తెలుగు సినిమా తీయాలని...

"తెలుగు చిత్రసీమలో 'నిన్ను కోరి'తో మా ప్రయాణం మొదలైంది. ఆ చిత్రానికి అమెరికాలో లైన్ ప్రొడక్షన్ చూసుకున్నాం. టెక్నాలజీ రంగంలో వ్యాపారం చేస్తున్నా... సినిమాలంటే ప్రేమ. హాలీవుడ్ స్థాయిలో తెలుగు సినిమా తీయాలని 'నిశ్శబ్దం' ప్రారంభించాం. అమెరికా నటీనటులను తెలుగు రాష్ట్రాలకు తీసుకురావడం కష్టం కాబట్టి... మనవాళ్లను అమెరికా తీసుకువెళ్లి, హాలీవుడ్ నటులతో క్రాస్ ఓవర్ సినిమాగా చేశాం. హాలీవుడ్ స్థాయిలో ఉండే భారతీయ చిత్రమిది" అని టీజీ విశ్వప్రసాద్ అన్నారు. అనుష్క, మాధవన్, అంజలి, మైఖేల్ మ్యాడసన్, షాలినీ పాండే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'నిశ్శబ్దం'. హేమంత్ మధుకర్ దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మాతలు. వచ్చే ఏడాది జనవరి 31న చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. "సాక్షి అనే మూగ, చెవిటి పెయింటర్ పాత్రలో అనుష్క కనిపిస్తారు. అందుకోసం ఆమె నాలుగు నెలలు కష్టపడి సైన్ లాంగ్వేజ్, పెయింటింగ్ నేర్చుకున్నారు" అని హేమంత్ మధుకర్ అన్నారు. కోన వెంకట్ మాట్లాడుతూ "ఈ సినిమాలో ముందు వేరే హీరోయిన్‌ని అనుకున్నాం. వీసాలు డిలే కావడంతో ఆ అమ్మాయి చేయలేనని చెప్పింది. అప్పుడు ముంబై నుండి ఫ్లైట్‌లో వస్తున్నప్పుడు అనుష్క కనిపించింది. లక్కీగా, వేరే కారణాలతో మా ఫ్లైట్ డిలే కావడంతో ఆమెకు కథ చెప్పా. వారం రోజుల తర్వాత ఫోన్ చేస్తే సినిమా చేస్తానని చెప్పింది. ఇదొక క్రైమ్ థ్రిల్లర్. హీరో హీరోయిన్లు ఎవరూ ఉండరు. ప్రతి ఒక్కరిదీ ప్రధాన పాత్రే. విశ్వప్రసాద్‌గారి భార్య వందన డాక్టర్‌గా మంచి పాత్రలో నటించారు. తెలుగు, తమిళ భాషల్లో షూటింగ్ చేశాం. మలయాళం, హిందీలో డబ్బింగ్ చేస్తున్నాం. ఈ నాలుగు భాషల్లో విడుదల చేశాక, ఇంగ్లిష్‌లో విడుదల చేస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజు, సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల పాల్గొన్నారు.



దీపికా పడుకోన్

శ్రీదేవి జీవితం ఎంతోమందికి స్ఫూర్తి

- కాజోల్

దివంగత నటి శ్రీదేవి జీవిత చరిత్ర 'శ్రీదేవి: ది ఎటెర్నల్ స్క్రీన్ గాడెస్' అనే పుస్తక రూపంలో రానుంది. ప్రముఖ రచయిత సత్యార్థ్ నాయక్ ఈ పుస్తకాన్ని రచించారు. పెంగ్విన్ సంస్థ ప్రచురించింది. శ్రీదేవి చిన్నతనం నుంచి స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన జర్నీ మొత్తాన్ని ఈ పుస్తకంలో పొందుపర్చారు. కాజోల్ ఈ పుస్తకానికి ముందుమాట రాయడం విశేషం. ఢిల్లీలోని ఇండియా హాబీటాట్ సెంటర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బాలీవుడ్ నాయిక దీపికా పడుకోన్, బోనీ కపూర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. "శ్రీదేవి ఐకానిక్ హీరోయిన్. ఆమె సినిమాలు చూస్తూ పెరిగాను. నటనలో ఆమె ఒక ఇన్‌స్టిట్యూట్. శ్రీదేవి నట జీవితం ఎంతోమందికి స్ఫూర్తి. ఈ పుస్తకానికి ముందుమాట రాయడం నా అదృష్టం" అని కాజోల్ ట్వీట్ చేశారు.

స్ట్రీట్ స్మార్ట్ చిలిపి తనం..

నిఖిలా విమల్, కార్తీ

'ఖైదీ' లాంటి హిట్ సినిమా తర్వాత కార్తీ 'దొంగ' టైటిల్‌తో రానున్నారు. జీతు జోసెఫ్ దర్శకత్వంలో వయాకామ్ 18 స్టూడియోస్, ప్యారలల్ మైండ్స్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో కార్తీ వదిన జ్యోతిక కీలక పాత్ర పోషిస్తున్నారు. నిఖిలా విమల్ కథానాయిక. ఈ నెల 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'రూపి రూపి.. ఎవ్వరినీ వదలదుగా నా స్ట్రీట్ స్మార్ట్ చిలిపితనం.. మాయలోన పుట్టి మాయలోన పెరిగి నాను' అంటూ సాగే వీడియో సింగిల్‌ను ఆదివారం విడుదల చేశారు. గోవాలో కలర్‌ఫుల్‌గా పిక్చరైజ్ చేసిన ఈ పాటలో పొడవైన జుట్టుతో న్యూ లుక్‌లో ఎనర్జిటిక్‌గా కనిపించారు కార్తి. ఈ పాట హీరో క్యారెక్టరైజేషన్‌ను తెలిపేలా సాగుతుంది. గోవింద్ వసంత సంగీత సారథ్యంలో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను రంజిత్ గోవింద్ పాడారు. అనువాద కార్యక్రమాలు పూర్తి చేసి ఈ నెల 20న ప్రపంచ వ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నారు.

తనీష్ 'మహాప్రస్థానం'

తనీష్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మహాప్రస్థానం. 'జర్నీ ఆఫ్ ఎన్ ఎమోషనల్ కిల్లర్' అన్నది ఉపశీర్షిక. జానీ దర్శకుడు.ఓంకారేశ్వర క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ నెల మొదటివారంలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. దర్శకుడు జానీ మాట్లాడుతూ "క్రైమ్ నేపథ్యంలో హృదయానికి హత్తుకునే ప్రేమకథగా రూపొందుతున్న సినిమా ఇది. ఇందులో కథానాయకుడి ప్రేమ, బాధ, కోపం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. తనీష్ ఈ కథకు పర్ఫెక్ట్‌గా యాప్ట్ అవుతాడు" అని అన్నారు.

క్రిస్మస్ సందర్భంగా...


పీడీ రాజు

'నేను సినిమా చూశా. చాలా బావుంది. 'కరుణామయుడు' కంటే పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని సీనియర్ దర్శకులు సాగర్ అన్నారు. ఏసుక్రీస్తుగా పీడీ రాజు నటించిన చిత్రం 'తొలికిరణం'. జాన్‌బాబు దర్శకుడు. ఎమ్.ఆర్.సి. నాయుడు నిర్మాత. ఆర్పీ పట్నాయక్ స్వరకర్త. క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ "సమాధి నుండి తిరిగొచ్చిన తర్వాత భూమ్మీద ఏసు 40 రోజులు ఏం చేశారనేది చిత్రకథ. ఆలస్యం అయినప్పటికీ... సినిమా గొప్పగా వచ్చింది. సాగర్‌గారు మాకు అన్ని విధాల సహకరించారు. ముఖ్యమైన పాత్రలో నటించిన భానుచందర్‌కి థ్యాంక్స్" అన్నారు. "మూడేళ్ల కృషికి నిదర్శనం ఈ సినిమా" అని పీడీ రాజు అన్నారు. "అన్ని మతాలవారికీ నచ్చే విధంగా సినిమా ఉంటుంది" అని భానుచందర్ అన్నారు.

ఓన్లీ థ్రిల్లర్!

అమితి గ్రేవ్

చెంగ్, మైరా అమితి జంటగా విఘ్నేశ్ కలగర దర్శకత్వంలో శ్రీనివాస్ శరకడం నిర్మిస్తున్న చిత్రం 'ఓన్లీ నేను'. ఓ స్కాం నేపథ్యంలో థ్రిల్లర్ ఫిల్మ్‌గా తెరకెక్కుతోంది. చిత్రీకరణ చివరి దశలో ఉంది. తెలంగాణ సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు మామిడి హరికృష్ణ, నటుడు కాశీ విశ్వనాథ్, దర్శకుడు వీరభద్రం చౌదరి సమక్షంలో సోమవారం టీజర్ విడుదల చేశారు. వచ్చే ఏడాది వేసవిలో చిత్రాన్ని విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి ఎస్.కె. బాలచంద్రన్ సంగీత దర్శకుడు.

అనుభూతులు... భావోద్వేగాలు

ప్రదీప్ రుద్ర

సాఫ్ట్‌వేర్ రంగం నుంచి తెలుగు చిత్రరంగంలోకి వచ్చిన అనిల్ పంగులూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'క్షీరసాగర మథనం'. మానస్ నాగులపల్లి, ప్రముఖ నటుడు బ్రహ్మాజీ తనయుడు సంజయ్‌కుమార్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో అక్షిత సొనవనే కథానాయిక. చిత్రంలో విలన్‌గా నటిస్తున్న ప్రదీప్ రుద్ర లుక్‌ను నటుడు అడివి శేష్ విడుదల చేశారు. 'సినిమాలోని గుండెల్ని మెలిపెట్టే అనుభూతులు, పలు రకాల భావోద్వేగాలు ప్రేక్షకుల్ని అలరిస్తాయి. చాలా రోజుల తర్వాత ఓ మంచి సినిమా చూశామనే సంతృప్తి ప్రతి ఒక్కరికీ కలుగుతుందని కచ్చితంగా చెప్పగలం' అని దర్శకుడు అనిల్ పంగులూరి చెప్పారు. ఆర్ట్ అండ్ హార్ట్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

నేర 'సమరం'

సాగర్, ప్రగ్య

సాగర్ గంధం, ప్రగ్యా నయన్ జంటగా శ్రీనివాస్ వీరంశెట్టి, జీవీఎస్ నిర్మించిన చిత్రం 'సమరం'. బషీర్ ఆలూరి దర్శకుడు. చిత్రీకరణ, నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. నిర్మాత రాజ్ కందుకూరి ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశారు. "వాణిజ్య హంగులతో అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా క్రైమ్ థ్రిల్లర్‌గా సినిమా రూపొందింది. ఈ నెలలో విడుదల చేయాలనుకుంటున్నాం. త్వరలో సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి, విడుదల తేదీ ప్రకటిస్తాం" అని దర్శక, నిర్మాతలు తెలిపారు. సుమన్, వినోద్ కుమార్, సత్యప్రకాశ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి రాజ్ కిరణ్ సంగీత దర్శకుడు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత))	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలర్‌కు)	ముడి చమురు
40,802.17	12,048.20	37,979	44,200	71.66	61.53
8.36	7.85	40	170	8 పైసలు	

కార్వీ ఖాతాదారులకు పెద్ద ఊరట

90% మంది ఖాతాల్లోకి వారి షేర్లు

సెబీ ఆదేశంతో ఎన్ఎస్‌డీఎల్ బదిలీ

ట్రేడింగ్ లైసెన్స్ సస్పెన్షన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తమ ఖాతాల్లోని షేర్లను కోల్పోయి ఆందోళన చెందుతున్న కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) ఖాతాదారులకు ఊరట లభించింది. దాదాపు 90 శాతం మంది తమ షేర్లను పొందారు. సెబీ ఆదేశాల మేరకు కార్వీ ఖాతాదారుల షేర్లను వారి ఖాతాల్లోకి కొద్ది సమయంలోనే నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) బదిలీ చేసింది. కార్వీకి చెల్లింపులు చేయాల్సిన ఖాతాదారులు తప్ప మిగిలిన వారందరికీ షేర్లు లభించాయి. ఎవరైనా ఖాతాదారులు ప్రత్యేక పరిస్థితుల్లో షేర్లు పొందలేకపోయినా.. వారికి సెబీ ఇన్వెస్టర్ రక్షణ నిధి నుంచి నగదు రాగలరని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సెబీ నిర్ణయం మార్కెట్‌లోనూ, మదుపర్లలోనూ విశ్వాసాన్ని నింపుతుందని.. ఇది ఊహించని నిర్ణయమేకాక సెబీ అవలంబిస్తున్న కఠిన వైఖరికి నిదర్శనమని అంటున్నారు. సెబీ చాలా వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని.. త్వరలోనే ఫోరెన్సిక్ నివేదిక కూడా అందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఖాతాదారుల ఖాతా నుంచి అనుమతి లేకుండా షేర్లను కార్వీ తన ఖాతాలోకి బదిలీ చేసింది. తాకట్టు పెట్టింది. ఈ విధంగా షేర్లను పోగొట్టుకున్న 83,000 మంది ఖాతాదారులకు వారి షేర్లను ఎన్ఎస్‌డీఎల్ బదిలీ చేయనుంది. 90 శాతం మంది షేర్లను తిరిగి పొందారని.. కార్వీకి చెల్లింపులు చేయాల్సిన వారు వాటిని చెల్లించిన తర్వాత వారు కూడా షేర్లను పొందుతారని ఎన్ఎస్‌డీఎల్ స్పష్టం చేసింది. 95,000 మందికి చెందిన రూ. 2,300 కోట్ల విలువైన షేర్లను తాకట్టు పెట్టి కార్వీ దాదాపు రూ.600 కోట్ల నిధులను బ్యాంకులు, ఎన్‌బీఎఫ్ఎసీల నుంచి సమీకరించిందని ఎన్ఎస్ఈ విచారణలో తేలింది. సెబీ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఈ పర్యవేక్షణలో ఎన్ఎస్‌డీఎల్ షేర్లను బదిలీ చేసింది.

ఎన్ఎస్ఈ, బీఎస్ఈ వేటు

స్టాక్ ఎక్స్ఛేంజీల నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు అన్ని విభాగాల్లో కార్వీ స్టాక్ బ్రోకింగ్ ట్రేడింగ్ లైసెన్స్‌ను ఎన్ఎస్ఈ, బీఎస్ఈ సస్పెండ్ చేశాయి. ఈక్విటీ, డెట్ విభాగాల్లో కార్వీ టెర్మినళ్లను డీయాక్టివేట్ చేసినట్లు బీఎస్ఈ వెల్లడించింది. ఈక్విటీ డెరివేటివ్స్, కరెన్సీ డెరివేటివ్స్, కమోడిటీ విభాగాన్ని రిస్క్ రిడక్షన్ మోడ్‌లో ఉంచింది. డెరివేటివ్ విభాగంలో ఉన్న ఓపెన్ పొజిషన్లను కార్వీ ఖాతాదారులు స్క్వేర్ ఆఫ్ చేసుకోవచ్చు. కొత్త పొజిషన్లను తీసుకోవడానికి వీలు లేదు. ట్రేడింగ్ చేయడానికి ఖాతాదారులు మరో బ్రోకర్ వద్ద ఖాతాను తెరవాల్సి ఉంటుంది. కార్వీకి దాదాపు 2.5 లక్షల మంది యాక్టివ్ ఖాతాదారులు ఉన్నారని.. సగటున 20 వేల మంది వరకూ ప్రతి రోజు ట్రేడింగ్ చేస్తారని మార్కెట్ వర్గాల అంచనా. ఈ పరిణామానికి ముందే పవర్ ఆఫ్ అటార్నీపై కార్వీ కోరిన వెసులుబాటును సెబీ తిరస్కరించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఖాతాదారుల పే-ఇన్ ఆబ్లిగేషన్లను పూర్తి చేయడానికి పరిమితి ప్రయోజనం ప్రాతిపదికన పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వాలని సెక్యూరిటీస్ అప్పిలేట్ అథారిటీ (శాట్)ను కార్వీ ఆశ్రయించింది. దీని పరిశీలించాల్సిందిగా సెబీని శాట్ కోరింది. అయితే.. అందుకు సెబీ నిరాకరించింది. ఖాతాదారుల షేర్లను తన ఖాతాలోకి బదిలీ చేయడంతోపాటు తాకట్టు పెట్టి ఆ నగదును అనుబంధ కంపెనీలోకి బదిలీ చేసిందన్న ఆరోపణలపై కొత్త ఖాతాలను ప్రారంభించడానికి వీలు లేదని కార్వీపై సెబీ తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. ఎన్ఎస్ఈ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది.

గత ఏడాది జనరల్ అట్లాంటిక్ చేతుల్లోకి వెళ్లిన కార్వీ ఫిన్‌టెక్ పేరు కేఫిన్ టెక్నాలజీస్‌గా మారింది. సంస్థకు కొత్త చైర్మన్‌గా మావిల విశ్వనాథన్ నాయర్‌ను నియమించినట్లు జనరల్ అట్లాంటిక్ వెల్లడించింది. ప్రస్తుతం ట్రాన్స్‌యూనియన్ సిబిల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎంవీ నాయర్

కార్వీ ఫిన్‌టెక్ ఇక కేఫిన్ టెక్నాలజీస్

సంస్థ కొత్త చైర్మన్‌గా ఎంవీ నాయర్

పలు ప్రైవేట్ ఈక్విటీలు, వెంచర్ క్యాపిటల్ ఫండ్ కంపెనీలకు సలహాదారుగానూ ఉన్నారు. గత కొద్దికాలం వరకు ఆయన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్, ఎండీగానూ పనిచేశారు. స్విఫ్ట్, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌కూ చైర్మగా వ్యవహరించారు. కార్వీ గ్రూప్ నకు చెందిన ఈ ఫైనాన్షియల్ టెక్నాలజీ సేవల కంపెనీలో మెజారిటీ వాటా (83 శాతం)ను జనరల్ అట్లాంటిక్ కొనుగోలు చేసింది. మిగతా వాటా కార్వీ ప్రమోటర్ల చేతుల్లో ఉంది.

మేం ప్రభుత్వ వ్యతిరేకులం కాదు

బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలను విమర్శించేందుకు పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారన్న బజాజ్ గ్రూప్ చైర్మన్ రాహుల్ బజాజ్ వ్యాఖ్యలను బయోకాన్ కంపెనీ చీఫ్ కిరణ్ మంజుదార్ షా మరోసారి సమర్థించారు. అలా అని తమను దేశ లేదా ప్రభుత్వ వ్యతిరేకులుగా చూడవద్దని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. 'మేడమ్ మేము దేశానికి లేదా ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ దేశ ఆర్థిక మంత్రిగా మీరు విజయవంతం కావాలని కోరుకుంటున్నాం. మీ సారథ్యంలో భారత్ అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థగా ఎదగాలి. నేను రాజకీయాలతో సంబంధం లేని భారతీయురాలినని గర్వంగా చెప్పగలను. రాష్ట్రాల స్థాయిలో కూడా మంచి విధానాలను ప్రోత్సహించాలని మాత్రమే మేము కోరుతున్నాం' అని ట్వీట్ చేశారు. బజాజ్ వ్యాఖ్యలు దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తాయన్న సీతారామన్ ట్వీట్‌కు ప్రతిగా.. కిరణ్ మజుందార్ షా ఈ ట్వీట్ చేసినట్టు భావిస్తున్నారు.

బజాజ్ వ్యాఖ్యలు దేశ ప్రయోజనాలకు దెబ్బ : ఆర్థిక మంత్రి

ప్రభుత్వ విధానాలను విమర్శించేందుకు పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారన్న పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ వ్యాఖ్యలపైనా ఆర్థిక మంత్రి సీతారామన్ స్పందించారు. ఈ విషయంలో ఆయన సొంత అభిప్రాయాలు జాతీయ ప్రయోజనాలను దెబ్బతీస్తాయని ట్వీట్ చేశారు. 'సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా ప్రభుత్వం నుంచి సమాధానాలు పొందవచ్చు. అంతే తప్ప ఇలా సొంత అభిప్రాయాలు వ్యాప్తి చేయడం బాగోలేదు. ఈ ధోరణి పెరిగితే అది జాతీయ ప్రయోజనాలనూ దెబ్బతీస్తుంది' అన్నారు. లోక్‌సభలోనూ ఆర్థిక మంత్రి ఈ విమర్శలను తోసిపుచ్చారు. 'ప్రభుత్వం విమర్శను వినేందుకు ఇష్టపడడం లేదన్న ఆరోపణ అన్యాయం. విమర్శలను వింటున్నాం కాబట్టే, సమస్యలపై ఎప్పటికపుడు స్పందిస్తున్నాం' అన్నారు.

వైజాగ్‌లో ఉబెర్ కేంద్రం

500 మందిని నియమించుకోనున్న సంస్థ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ద్వారా క్యాబ్ బుకింగ్ సేవలందించే ఉబెర్.. విశాఖపట్నంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో పనిచేసేందుకు 500 మందిని నియమించుకోనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇప్పటికే 70 మందిని నియమించుకున్నట్లు, వచ్చే ఏడాది తొలినాళ్లలో ఉద్యోగుల సంఖ్య 120కి పెరగవచ్చని తెలిపింది. దేశీయ క్యాబ్ అగ్రిగేటర్ ఓలాకు ప్రధాన ప్రత్యర్థి అయిన ఈ అమెరికన్ కంపెనీ ఇప్పటికే హైదరాబాద్‌లో సీఓఈని ఏర్పాటు చేసింది. దాదాపు రూ.5.73 కోట్ల పెట్టుబడితో వైజాగ్‌లో ఏర్పాటు చేసినది రెండోది. ఈ కేంద్రం ద్వారా భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్ రీజియన్ మార్కెట్లకూ సేవలందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. వైజాగ్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉబెర్‌కు 12 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలున్నాయి.

విశాఖకు ఇండిగో కొత్త సర్వీసు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విమానయాన సంస్థ ఇండిగో విశాఖపట్నానికి మరో కొత్త సర్వీసును అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ విమాన సర్వీసు చెన్నై, హైదరాబాద్ వెళ్లే వారికి ఉపయోగపడనుంది. ఈ నెల 23 నుంచి ఈ సర్వీసు ప్రారంభంకానుంది. చెన్నై నుంచి విశాఖకు ఈ విమానం 6.25 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 6.45కు హైదరాబాద్‌కు బయలుదేరి వెళుతుంది. హైదరాబాద్ నుంచి తిరిగి 10.40 గంటలకు విశాఖకు చేరుకుని 11.10కి చెన్నైకి వెళుతుంది. కాగా విశాఖ విమానాశ్రయం నుంచి ప్రయాణించే విమానాల సంఖ్య రెండున్నర నెలల్లోనే 60 నుంచి 78కి చేరుకుందని విమానాశ్రయ డైరెక్టర్ రాజకిశోర్ వెల్లడించారు. మరోవైపు విశాఖ-బెంగళూరు మధ్య ఆదివారం నుంచి కొత్త సర్వీసు ప్రారంభమైంది.

2020లో జీతాలు 9.2% పెంపు

న్యూఢిల్లీ: వచ్చే సంవత్సరం భారత ఉద్యోగుల జీతాలు 9.2 శాతం మేర పెరగవచ్చని కార్న్ ఫెర్రీ గ్లోబల్ శాలరీ ఫోర్‌కాస్ట్ సర్వే అంచనా వేసింది. గతేడాదిలో నమోదైన 10 శాతంతో పోలిస్తే మాత్రం తక్కువే. అయితే, ఆసియా దేశాల్లోకెల్లా ఇదే అత్యధిక వేతన వృద్ధి కానుందని అంటోంది. వేగంగా పెరుగుతున్న ధరల ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే భారత్‌లో వాస్తవిక వేతన పెంపు 5 శాతంగా నమోదుకానుందని రిపోర్టులో పేర్కొంది. 2020లో ప్రపంచవ్యాప్తంగా వేతనాల సరాసరి పెంపు 4.9 శాతంగా, ఆసియాలో 5.3 శాతంగా నమోదు కావచ్చని రిపోర్టు అంచనా.

పెట్టుబడుల కోసమే పన్నుల కోత

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన కోసమే ఇటీవల కంపెనీలపై పన్ను (కార్పొరేట్ టాక్స్) భారం తగ్గించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన పన్ను చట్టాల (సవరణ) బిల్లు, 2019ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయం చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇప్పటికే ఫలితాలిస్తున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయన్నారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికలో జీడీపీ వృద్ధి రేటు, ఐదేళ్ల కనిష్ఠ స్థాయి 5 శాతానికి పడిపోయింది. దాంతో వృద్ధి రేటుకు ఊతమిచ్చేందుకు సెప్టెంబరు 20న ప్రభుత్వం కార్పొరేట్ టాక్స్‌ను 34.94 శాతం నుంచి 25.17 శాతానికి తగ్గించింది. కొత్తగా ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేసే కంపెనీలపై విధించే పన్ను భారాన్నీ 15 శాతానికి కుదించింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ఈ చర్య అవసరమైందని సీతారామన్ చెప్పారు. ఈ యుద్ధంతో చైనాలోని అనేక బహుళ జాతి కంపెనీ (ఎంఎన్‌సీ)లు తమ ఉత్పత్తి కేంద్రాలను ఇతర దేశాలకు తరలించాలనుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేందుకూ కార్పొరేట్ టాక్స్ తగ్గింపు అవసరమైందన్నారు.

రూ.లక్ష కోట్ల రియల్టీ రుణాలకు డిఫాల్ట్ గండం



రియల్ ఎస్టేట్ కంపెనీలకిచ్చిన 1400 కోట్ల డాలర్ల (దాదాపు రూ.లక్ష కోట్లు) రుణాలకు డిఫాల్ట్ గండం పొంచి ఉందని ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టింగ్ సంస్థ అనరాక్ హెచ్చరించింది. ఈ ప్రాపర్టీ కన్సల్టింగ్ సంస్థ విడుదల చేసిన తాజా నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

రియల్టీ సంస్థలకు ఇచ్చిన మొత్తం రుణాల్లో వేటి వాటా ఎంత?

38%- హెచ్ఎఫ్‌సీలు

34%- బ్యాంకులు

28%- ఎన్‌బీఎఫ్‌సీలు

9,300 కోట్ల డాలర్లు	రియల్టీ కంపెనీలకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ, హెచ్ఎఫ్‌సీ మంజూరు చేసిన రుణాలు
5,800 కోట్ల డాలర్లు	ఎలాంటి ఒత్తిడి లేకుండా మెరుగైన స్థితిలో ఉన్న రుణాల విలువ
2,100 కోట్ల డాలర్లు	కొంత మేర ఒత్తిడి ఎదుర్కొంటున్న రుణాలు
1,400 కోట్ల డాలర్లు	తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న, మున్ముందు డిఫాల్ట్ అయ్యే అవకాశాలున్న రుణాలు

ఎన్‌బీఎఫ్‌సీలకే ముప్పెక్కువ

రియల్టీ రుణాల రికవరీ విషయంలో బ్యాంకులు, హెచ్ఎఫ్‌సీల కంటే ఎన్‌బీఎఫ్‌సీలకే ఎక్కువగా డిఫాల్ట్ ముప్పు పొంచి ఉంది. బ్యాంకులు మంజూరు చేసిన రియల్టీ రుణాల్లో 70 % మెరుగైన స్థితిలోనే ఉన్నాయి. హెచ్ఎఫ్‌సీల విషయంలో ఈ వాటా 65%గా ఉంది. ఎన్‌బీఎఫ్‌సీలిచ్చిన రుణాల్లో 58 శాతమే మెరుగైన స్థితిలో ఉన్నాయి.

క్రెడిట్ కార్డు చెల్లింపులపై చార్జీలుండవు: ఎల్ఐసీ

ముంబై: డిజిటల్ లావాదేవీలను మరింతగా ప్రోత్సహించేందుకు క్రెడిట్ కార్డు చెల్లింపులపై చార్జీలను రద్దు చేస్తున్నట్లు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ప్రకటించింది. ప్రీమియం రెన్యూవల్, కొత్త ప్రీమియం, లోన్ చెల్లింపులు, రుణంపై వడ్డీ చెల్లింపులు వంటి లావాదేవీలను క్రెడిట్ కార్డు ద్వారా చేస్తే ఎటువంటి చార్జీలు విధించబోమని స్పష్టం చేసింది. వినియోగదారులు ఆన్‌లైన్ లావాదేవీలు చేయాలనుకుంటే 'మై ఎల్ఐసీ' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది.

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

వృద్ధి 5.1 శాతమే

ఇంకా తగ్గని జీఎస్‌టీ, రెరా, దివాలా కోడ్ ప్రభావం

క్రిసిల్ తాజా నివేదిక

ముంబై : భారత వృద్ధి రేటు సమీప భవిష్యత్తులో పుంజుకునే అవకాశాలు కనిపించడంలేదని, ప్రస్తుత మందగమనం ఊహించిన సమయం కన్నా అధికంగానే కొనసాగుతుందని క్రిసిల్, డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ తాజా నివేదికల్లో పేర్కొన్నాయి. 2020 సంవత్సరం వృద్ధి రేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.3 శాతం నుంచి భారీగా 5.1 శాతానికి కుదించిన క్రిసిల్ జీఎస్‌టీ, రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్, దివాలా కోడ్ వంటి సంస్కరణలు ఇప్పటికీ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తూనే ఉన్నాయని తెలిపింది. క్రిసిల్ ప్రకటించిన అంచనా జపాన్ బ్రోకరేజి సంస్థ నోమురా ప్రకటించిన 4.7 శాతం కన్నా మెరుగైనదే అయినా వివిధ సంస్థలు ప్రకటించిన కనిష్ఠ స్థాయి అంచనాల్లో ఒకటిగా నిలిచింది. కాగా సెప్టెంబరు త్రైమాసికంలో వృద్ధి రేటు 26 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 4.5 శాతానికి దిగజారిన నేపథ్యంలో వెలువడిన ఈ అంచనా ఆందోళనకరంగా ఉంది. ఇదిలా ఉండగా ఆర్‌బీఐ సారథ్యంలోని ద్రవ్య విధాన కమిటీ వృద్ధి రేటుకు ఊతం ఇచ్చేందుకు వచ్చే గురువారం నాటి సమీక్షలో మరోసారి రెపోరేట్లు తగ్గించే ఆస్కారం ఉన్నట్టు కూడా తెలిపింది. ఇప్పటికే వరుసగా ఐదు విడతలుగా రెపో రేటును ఎంపీసీ 1.35 శాతం తగ్గించి 5.45 శాతానికి తీసుకువచ్చింది. కాగా స్వల్పకాలిక ఆర్థిక సూచీలు పారిశ్రామికోత్పత్తి సూచీ, వాణిజ్య ఎగుమతులు, బ్యాంకుల రుణవితరణ, వస్తు రవాణా, విద్యుత్ ఉత్పత్తి వంటివన్నీ బలహీనతనే ప్రదర్శిస్తున్నాయని క్రిసిల్ పేర్కొంది.

అయితే ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో వృద్ధి రేటు స్వల్పంగా పుంజుకుని 5.5 శాతం వరకు వెళ్లవచ్చునని కూడా తెలిపింది. స్థిర పెట్టుబడులు క్షీణించగా ప్రైవేటు వినియోగంలో వృద్ధి కూడా బలహీనంగా ఉన్నదని తేల్చిచెబుతూ కేవలం ప్రభుత్వ వినియోగమే ప్రధమార్థంలో వృద్ధికి అండగా నిలిచినట్టు పేర్కొంది. నిర్మాణం, వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్ విభాగాలన్నింటిలోనూ పరిస్థితి బలహీనంగానే ఉందని తేల్చిచెప్పింది.

ఇప్పట్లో కోలుకోవడం కష్టమే : డీ అండ్ బీ

భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పట్లో కోలుకోవడం కష్టమేనని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ తాజాగా స్పష్టం చేసింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవాలంటే పారిశ్రామికోత్పత్తిలో రికవరీ తప్పనిసరి అని తెలిపింది. ఆటో, రియల్టీ సహా పలు రంగాల్లో ఒత్తిడి కొనసాగుతున్నదని, ఇటీవల కార్పొరేట్ లాభాల మార్జిన్లు, ప్రభుత్వ రెవిన్యూ వసూళ్లలో ఇది ప్రతిబింబించిందని తెలిపింది. కాగా ఇటీవల సంభవించిన వరదలు, వ్యవసాయ దిగుబడుల్లో క్షీణత కారణంగా గ్రామీణ ఆర్థిక రంగంలో డిమాండు నిస్తేజంగానే ఉంటుందని పేర్కొంది. ఒకపక్క స్టాక్ మార్కెట్లలో వృద్ధి, మరోపక్క వృద్ధి రేటులో క్షీణత, ద్రవ్యోల్బణం, పెరిగిపోయిన నిరుద్యోగిత విధానకర్తలకు సవాళ్లు విసురుతూనే ఉన్నట్టు సంస్థ చీఫ్ ఎకనామిస్ట్ అరుణ్ సింగ్ అన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలన్నీ ప్రస్తుతం అమలులో ఉన్న మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో వేగం పెంచాలని సూచించారు.

వాల్‌మార్ట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): 'బెస్ట్ ప్రైస్' సభ్యుల కోసం వాల్‌మార్ట్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డును ప్రవేశపెట్టాయి. బీ2బీ క్యాష్ అండ్ క్యారీ స్టోర్లయిన 'బెస్ట్ ప్రైస్' ఖాతాదారుల కోసం ఈ కార్డు ను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని శివరాంపల్లి బెస్ట్‌ప్రైస్ స్టోర్‌లో ఈ కార్డును వాల్‌మార్ట్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ క్రిష్ అయ్యర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేమెంట్స్ బిజినెస్ అధిపతి పరాగ్ రావు విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న 26 బెస్ట్ ప్రైస్ స్టోర్లలో కూడా దీన్ని ఇదే రోజు ప్రవేశపెట్టారు. హోల్‌సేల్ కొనుగోలుదారులు తమ చెల్లింపులను ఈ కో బ్రాండెడ్ కార్డు ద్వారా చేయొచ్చు. బెస్ట్ ప్రైస్ సేవ్ స్మార్ట్, సేవ్ మాక్స్ పేరుతో ఈ కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చారు.

చట్ట ప్రకారమే కొచ్చర్ తొలగింపు

ముంబై: చట్టప్రకారమే చందా కొచ్చర్‌ను బ్యాంక్ సీఈఓ, ఎండీ పదవుల నుంచి తొలగించినట్టు ఐసీఐసీఐ బ్యాంక్.. బొంబాయి హైకోర్టుకు తెలిపింది. ముందే రిటైర్‌మెంట్ తీసుకుంటానన్న తన విజ్ఞప్తిని ఆమోదించాక కూడా బ్యాంక్ తనను తొలగించడాన్ని కొచ్చర్ హైకోర్టులో సవాల్ చేశారు. ఆర్‌బీఐ ఆమోదం లేకుండా బ్యాంక్ తనను తొలగించడం చట్టవిరుద్ధమని కొచ్చర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. బ్యాంక్ మాత్రం అంతా నియామక ఒప్పందంలోని నిబంధన ప్రకారమే జరిగిందని కోర్టుకు తెలిపింది. కేసు తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 9కు వాయిదా వేసింది.

2న ఫారం గేటు అమ్మకం ధరలు

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.00 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	443	విశాఖపట్నం	460
బెంగళూరు	463	వరంగల్	447
విజయవాడ	455	చెన్నై	473
గోదావరి	455	చిత్తూరు	466
నమక్కల్	431	ముంబై	498

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	88	విజయవాడ	93
వరంగల్	88	గుంటూరు	93
మహబూబ్‌నగర్	88	ఒంగోలు	95
కరీంనగర్	88	చిత్తూరు	89
కర్నూలు	88	నెల్లూరు	89
విశాఖపట్నం	82	అనంతపురం	84
గోదావరి	88		

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	38,340	---	39,280	38,850	37,780
క్రితం ముగింపు	38,100	38,940	39,100	38,850	38,070
22 క్యారెట్లు	36,480	---	36,130	36,030	36,170
క్రితం ముగింపు	36,280	36,100	35,970	36,030	36,460
వెండి (కిలో)	44,200	---	45,600	45,700	47,600
క్రితం ముగింపు	44,300	46,200	45,700	45,700	48,110

కీలక మద్దతు 12000

టెక్నో స్ట్రాట్

నిఫ్టీ పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభమై 12100 వరకు వెళ్లినా నిలదొక్కుకోలేక ఇంట్రాడే రియాక్షన్‌లో పడింది. ఆ క్రమంలో ప్రధాన మద్దతు స్థాయి 12000 వరకు దిగజారి చివరిలో మైనర్ రికవరీ సాధించింది. మార్కెట్ కన్సాలిడేషన్, అనిశ్చిత ధోరణిలో నడుస్తోంది. బలమైన దిశ కోసం 12000 వద్ద బలంగా క్లోజ్ కావడం తప్పనిసరి. మార్కెట్ ప్రస్తుత కీలక స్థాయిల్లో నిలిచి ఉంది. స్వల్పకాలిక కరెక్షన్ నివారించుకోవాలంటే బలమైన పునరుజ్జీవం సాధించి తీరాలి.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 12080

మద్దతు : 12000

- మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 12080 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 12150. ఇదే గత వారంలో సాధించిన గరిష్ఠ స్థాయి.
- ప్రధాన మద్దతు స్థాయి 12000 కన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 11800.

■ వి.సుందర్ రాజా

ముగింపు సెషన్ నిస్తేజం

స్టోక్ స్ట్రాట్

తిథి : మార్గశిర శుక్ల సప్తమి; నక్షత్రం : ధనిష్ఠ (2.15 వరకు), శతభిషం

అప్రమత్తం : పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర/ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 2.14

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిలడక/మెరుగ్గా ప్రారంభమై 12 గంటల వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 1.30 నుంచి చివరి వరకు నిలకడ/నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 1.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 12090, 12125

మద్దతు స్థాయిలు : 12010, 11970

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

'నేతన్న హస్తం' గుర్తింపులో అన్యాయం

సిక్కోలులో చేనేత కార్మికుల వినూత్న నిరసన

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 2: 'నేతన్న హస్తం' పథకం గుర్తింపులో అన్యాయం జరిగిందంటూ చేనేత కార్మికులు రోడ్డెక్కారు. మహాత్ముని విగ్రహం వద్ద రాట్నం వడుకుతూ తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. శ్రీకాకుళం జిల్లా రాజాం మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. '40 ఏళ్లుగా ఇంటింటికీ మగ్గం ఉన్నా, ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు రాజాంలోని మల్లికార్జున సొసైటీ ఆధ్వర్యంలో ఆప్‌కో సంస్థ ఏర్పాటు చేసిన భవనంలో మగ్గాలు ఏర్పాటు చేసుకున్నాం. అక్కడే పనిచేస్తూ పనిని బట్టి చెల్లిస్తున్న వేతనంతోనే జీవనం సాగిస్తున్నాం. కానీ ఇంటి మగ్గం ఉంటేనే 'నేతన్న హస్తం' పథకానికి అర్హులంటూ ప్రభుత్వం ప్రకటించడంతో మాకు అన్యాయం జరుగుతోంది' అని వారు వాపోయారు. తక్షణం ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 'స్పందన'లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు జి.చిన్నారావు, గుమ్మన శంకరావు, ఎ.చంద్ర, కె.భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం తీసేశారు.. చనిపోతున్నాం!

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబం ఆత్మహత్యాయత్నం

ఒంగోలు(క్రైం), డిసెంబరు 2: ప్రకాశం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై పని చేస్తున్న ఓ ఉద్యోగిని ఉన్నతాధికారి విధుల నుంచి తొలగించడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. జిల్లాలోని మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడుకు చెందిన పొతకమూరి కమలేశ్వరరావు ఎనిమిదేళ్ల నుంచి సాంఘిక సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. క్రమ శిక్షణ చర్యల కింద ఆయనను సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీసుధ ఈ ఏడాది ఆగస్టు 17న విధుల నుంచి తొలగించారు. మనస్తాపానికి గురైన కమలేశ్వరరావు కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం రాత్రి పలువురు మంత్రులకు తాను కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటున్నానని మెసేజ్ పెట్టాడు. వెంటనే స్పందించిన మంత్రి కన్నబాబు ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌కు ఫార్వర్డ్ చేశారు. రంగంలోకి దిగిన ఎస్ఐ ఖాదర్‌బాషా హుటాహుటిన కమలేశ్వరరావు ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం ఉదయం సీఐ, ఒంగోలు డీఎస్పీ ప్రసాద్‌లు మరోసారి నచ్చజెప్పారు. అనంతరం డీఆర్‌వో వెంకటసుబ్బయ్య వద్దకు తీసుకెళ్లగా ఉద్యోగంపై భరోసా ఇచ్చారు.

నాడు ముద్దులు.. నేడు గుద్దులు

ప్రశ్నిస్తే వేధింపులూ, అరెస్టులా?: బాబు

కర్నూలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు వీధి వీధి తిరిగి ముద్దులు పెట్టిన సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఇప్పుడు పిడిగుద్దుల పాలన చేస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. ప్రశ్నించిన ప్రతివారినీ వేధిస్తూ, అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయిస్తున్నారని ఆగ్రహించారు. కర్నూలు జిల్లాలో మూడురోజుల పర్యటనలో భాగంగా స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. వైసీపీ నేతల వేధింపులకు తాళలేక ఇటీవలే ఆత్మహత్య చేసుకొన్న ఈ జిల్లాలోని గాజులపల్లి గ్రామానికి చెందిన కొండారెడ్డి అనే టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. "ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి. ఆ ప్రభుత్వాన్ని చూసుకుని మన కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెడుతున్న పోలీసులు మూల్యం చెల్లించుకోక తప్పదు" అని హెచ్చరించారు. దేవుళ్లు, దేవాలయాలు, స్కూళ్లు, చివరకు శ్మశానాలకూ రంగులద్దుకునే ఆ పార్టీ పిచ్చి పరాకాష్ఠకు చేరిందని మండిపడ్డారు. "ప్రభుత్వం నుంచి వచ్చిన ఫర్నిచర్‌ను తీసుకెళ్లాలని లేఖ రాసినా ఉద్దేశపూర్వకంగా మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌పై అక్రమ కేసులు నమోదు చేశారు. ఫర్నిచర్ కోసం ఇలా కేసులు పెడితే రూ.43వేల కోట్లు దోచుకున్న జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న కేసులకు ఇంకెన్నాళ్లు శిక్ష వేయాలి? సొంత బాబాయి హత్య కేసు నిందితుల్ని ఆర్నెల్లుగా పట్టుకోలేక... టీడీపీ అభిమానులపై సీఎం తన ప్రతాపం చూపిస్తున్నారు. ప్రశ్నించిన ప్రతి టీడీపీ కార్యకర్తలపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతున్నారు. గత ఐదేళ్లలో మనమూ ఇలా చేసుంటే ఇప్పటికి వైసీపీ అడ్రస్ ఉండేది కాదు" అన్నారు. ఇంకా ఆయన మాటల్లోనే..

30 ఏళ్ల నాయకత్వాన్ని అందిస్తా..

'30 ఏళ్ల భవిష్యత్తు నాయకత్వాన్ని మీకందిస్తాను. టీడీపీ పనైపోయిం

"కర్నూలులో గుడ్డు కాంట్రాక్టు కోసం కొట్టుకున్న మంత్రులున్నారు. దోమలపై దండయాత్ర అంటే ఏమిటో కూడా తెలియకుండా విమర్శలు చేశారు. ఇప్పుడు ఆ మంత్రి (ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని ఉద్దేశించి)నియోజకవర్గంలో డెంగీ ప్రబలుతుంటే ఏంచేస్తున్నారు. ఆ దోమలు వైసీపీ నాయకులను కుట్టేదాకా వారికి ప్రజల బాధలు అర్థం కావేమో! నేను అప్పులు చేసి వెళ్తే జగన్మోహన్‌రెడ్డి తీర్చలేకపోతున్నారంటూ మంత్రులు మాట్లాడుతున్నారు. కుక్కలకు బిస్కెట్లేస్తే విశ్వాసంగా ఉంటాయి. ఈ యువతకు ఉద్యోగాలిచ్చినా విశ్వాసంగా ఉండరని ఓ మంత్రి అంటారు. వైసీపీ కార్యకర్తలకు ఉద్యోగాలిచ్చుకుంటూ పోతుంటే రాష్ట్ర యువత మీకు ఊడిగం చేయాలా? ఉపాధి లేక భవన నిర్మాణ కార్మికులు చనిపోతే, కాలం చెల్లి చనిపోతున్నారని మంత్రులు అంటున్నారు. అమరావతిని ఓ మంత్రి శ్మశానంతో పోల్చారు. మా అమ్మ, నాన్నను బూతులు తిడుతూ మరో మంత్రి నోటికి ఎంతొస్తే అంత మాట్లాడారు. స్పీకర్ పదవిలో ఉన్న నేత మాటలు వింటుంటే ఏమనాలో అర్థం కావట్లేదు" అని చంద్రబాబు అన్నారు.

వీళ్లా మంత్రులు..!

దన్న వాళ్లకు సమాధానం చెబుతాను. తెలుగుజాతి ఉన్నంతకాలం టీడీపీ ఉంటుంది. భయపెట్టే కొద్దీ టీడీపీ బలపడుతుంది. కేసులు తవ్వుతామన్నారు, ఏది? ఎలుకను కాదు కదా! కనీసం తోకనూ పట్టుకోలేకపోయారు"

జనం పన్నులతో కార్యకర్తలకు జీతాలా?

'ఏటా రైతులకు రూ.12,500 భరోసాగా ఇస్తామని హామీ ఇచ్చి రూ.7,500తోనే సరిపెడుతున్నారు. ప్రజలు చెల్లించే పన్నులతో వైసీపీ కార్యకర్తలకు మాత్రం నెలకు రూ.8వేల చొప్పున జీతాలిస్తున్నారు. రైతు రుణ మాఫీలో 4, 5 విడతల విడుదలకు అప్పటి సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం అడ్డుపడ్డారు. దీనిపై రైతులు కోర్టుకెళితే వారికి తప్పక న్యాయం జరుగుతుంది".

'అన్య' పాపం వాళ్లదే..

"టీటీడీ వెబ్‌సైట్లో అన్యమత పేర్లు వస్తే అది నా తప్పని బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. మేం అధికారంలో ఉండగా మత సామరస్యాన్ని పాటించాం. ఎస్సీల మధ్య నేను చిచ్చు పెడుతున్నానని వైసీపీ నాయకుల అంటున్నారు. వారి మాటలు అవాస్తవం. ఎస్సీల ఏ,బీ, సీ,డీ వర్గీకరణకు నేను కట్టుబడి ఉన్నాను. స్థానిక ఎన్నికల్లో బడుగులకు ప్రాధాన్యమిస్తాం" అన్నారు.

దిశా హంతకులను ఉరితీయాలి

– చంద్రబాబు

షాద్‌నగర్‌లో అమానుషంగా దిశా ప్రాణాలు తీసిన వ్యక్తులను ఉరి తీయాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ ఘటన జరిగిన ప్రాంతం కర్నూలు జిల్లా సరిహద్దుల్లోనే ఉందన్నారు.

స్వీయ లబ్ధికోసమే కులమతాల చిచ్చు

- తన సామాజిక వర్గానికే సీఎం జగన్ పెద్దపీట
- వెయ్యి కోట్ల అతిథి గృహాన్ని 200 కోట్లకు కట్టబెట్టే కుట్ర
- కళా వెంకట్రావు బహిరంగ లేఖ

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన రాజకీయ లబ్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌లో కులాలు, మతాల మధ్య చిచ్చు రేపుతున్నారు. రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరి మాదిరి చేస్తున్నారు. విశ్వాసఘాతానికి, విధ్వంసానికి, వికృత చర్యలకు జగన్ ఆరు నెలల పాలన చిరునామాగా నిలిచింది' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు దుమ్మెత్తిపోశారు. జగన్ ప్రభుత్వ ఆరు నెలల పాలనపై సోమవారం ఆయన రాష్ట్ర ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు. దానిలో.. తరాల నుంచి నెలకొన్న ఐకమత్యానికి తూట్లు పొడుస్తూ హిందూ, ముస్లిం, క్రైస్తవుల మధ్య బేదాభిప్రాయాలను లేవనెత్తారంటూ వివరణాత్మకంగా పేర్కొన్నారు. జగన్ కేవలం తన సామాజిక వర్గానికే పెద్ద పీట వేస్తున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రులను ఉత్సవ విగ్రహాలుగా ఉంచడం తప్ప వారికి ఏ అధికారం ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్రం వద్దని వారించినా వినకుండా పోలవరంలో రివర్స్ టెండరింగ్‌కు వెళ్లి ఏడున్నర వేల కోట్ల నష్టం కలిగించారని చెప్పారు. విజయవాడ నడిబొడ్డున ఉన్న రూ.1000 కోట్ల విలువైన స్టేట్ గెస్ట్ హౌస్‌ను రూ.200 కోట్లకు వైసీపీ నేతలకు కట్టబెట్టడానికి కుట్ర జరుగుతోందని కళా వెంకట్రావు ఆరోపించారు.

ఆంధ్ర పోలీసులపై కేంద్రానికి ఫిర్యాదు

ఏపీ పోలీస్ శాఖ అధికార పార్టీ ఆదేశాలతో టీడీపీ కార్యక్రమాలను భగ్నం చేస్తోందని కళా వెంకట్రావు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం, జాతీయ అధ్యక్షులు చంద్రబాబుపై అమరావతిలో జరిగిన దాడి గురించి వివరిస్తూ సోమవారం హోం శాఖ ముఖ్య కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. వైసీపీ నాయకుల ఒత్తిడితో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటన్నింటిపై వెంటనే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

సీఎం విచారించినా ఓకే: అచ్చెన్న

విద్యాధరపురం, డిసెంబరు 2: 'మాజీ సీఎం చంద్రబాబు అమరావతి పర్యటనలో బస్సుపై జరిగిన దాడి ఘటనపై సిట్ విచారణతో పాటు, ముఖ్యమంత్రి జగన్ స్వయంగా విచారించినా మాకేమీ భయం లేదు. జరిగిన వాస్తవాలను ప్రజల ముందు ఉంచటమే మాకు కావాలి' అని టీడీపీ నేత అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం ఆయన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, తదితరులతో కలిసి విజయవడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాడి ఘటనపై కేంద్రానికి ఫిర్యాదు చేయబట్టే విచారణకు సిట్ ఏర్పాటు చేశారని అన్నారు. దాడికి పాల్పడిన వారు తెనాలి, కడప నుంచి వచ్చినట్టు ఒప్పుకున్నారని అన్నారు. రాజధాని తరలింపును నిరసిస్తూ, అమరావతిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ 5న అఖిలపక్ష నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జగన్ వల్లే అమరావతి నిలిచిపోయిందని వర్ల రామయ్య ఆరోపించారు.

రాష్ట్రంలో రక్షణ కల్పించలేని వారు...

తెలంగాణ ఘటనపై మాటలేల?: బుద్ధా

విజయవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సోమవారం ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఉద్దేశించి ట్వీట్ చేశారు. రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించలేని వారు, తెలంగాణలో ఘటనపై మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ ఎద్దేవా చేశారు. రేప్ కేసు, వరకట్న కేసులో ఉన్న వ్యక్తులకు సీట్లు ఇచ్చిన పార్టీ వైసీపీ అన్నారు. నేర చరిత్ర ఉన్న 70 శాతం మందిని పార్టీలో పెట్టుకుని లెక్చర్లు ఇవ్వడం సిగ్గుగా లేదా?అని ప్రశ్నించారు. 6నెలల జగన్ పాలనలో రాష్ట్రం లో 20 మంది మహిళలపై అత్యాచార, వేధింపుల ఘటనలు జరిగాయన్నారు.

సంక్షేమ పథకాల పర్యవేక్షణ మనదే: తమ్మినేని

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, చట్ట సభల ద్వారా ఎన్నికైన సభ్యులపై సంక్షేమ పథకాలను పరిశీలించాల్సిన బాధ్యత కూడా ఉందని స్పీకర్ తమ్మినేని సీతారం అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో అసెంబ్లీ కార్యదర్శి బాలకృష్ణమాచార్యులు అధ్యక్షతన సోమవారం శాసనసభ నూతన కమిటీ చైర్మన్లు, సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా కమిటీలు పరిశీలించాలన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేయాలని తమ్మినేని పిలుపునిచ్చారు. పథకాల అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఏం చర్యలు తీసుకోవాలో కమిటీలు సంబంధిత అధికారులతో సమీక్షించవచ్చని చెప్పారు.

రాజధాని 'అస్సైన్డ్'పై కీలక చర్చ!

- అసెంబ్లీ సమావేశాల వ్యూహంపైనా సమాలోచన
- మంత్రి బొత్స, సలహాదారు సజ్జల, ఎమ్మెల్యేలు హాజరు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అస్సైన్డ్ భూముల వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో వివిధ అంశాలపై ప్రభుత్వం ఏ వైఖరిని అవలంబించాలి? స్థానిక ఎన్నికల్లో ఏ వ్యూహం అమలు చేయాలి? తదితర అంశాలపై మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో విస్తృత చర్చ జరిగింది. విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశం దీనికి వేదికైంది. ఈ చర్చలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు, ఆళ్ల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబు, ఉండవల్లి శ్రీదేవి, రెవెన్యూ, సీఆర్డీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమరావతి కోసం గత టీడీపీ ప్రభుత్వం అమలు పరచిన భూసమీకరణ పథకం (ఎల్పీఎస్) వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రాజధాని గ్రామాల్లోని అస్సైన్డ్, బలహీన వర్గాలకు చెందిన కొందరు చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అస్సైన్డ్ రైతులకు అందించాల్సిన ఎల్పీఎస్ ప్యాకేజీని సవరించడంపై ప్రధానంగా చర్చ సాగినట్లు సమాచారం. అలాగే మాజీ సీఎం చంద్రబాబు అమరావతి పర్యటనలో బస్సుపై జరిగిన దాడి ఘటనపై ఎలా స్పందించాలన్న దానిపైనా చర్చించినట్టు తెలిసింది. ఇదే సమావేశంలో 9 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ శీతాకాల సమావేశాల్లో రాజధానికి సంబంధించిన ఇతర అంశాలపై ప్రభుత్వం అనుసరించదగిన వైఖరిపై కూడా చర్చలు జరిపారని సమాచారం. రాష్ట్రంలో కొద్ది నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఆ అంశం కూడా ప్రస్తావనకు వచ్చిందని విశ్వసనీయ వర్గాల కథనం.

జగన్ 6 నెలల పాలనలో...

28 వేల కోట్లు అప్పు

- లోటస్ పాండ్‌లోని ఇంటికి 35 లక్షలు
- విజయవాడలో కోట్ల ఖర్చు : తులసిరెడ్డి

కడప (కలెక్టరేట్), డిసెంబరు 2: "సీఎం జగన్మోహన్‌రెడ్డి కేవలం ఆరు నెలల పాలనలో రూ.28 వేల కోట్ల అప్పుల భారం ప్రజలపై మోపారు" అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.తులసిరెడ్డి ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో 1951 నుంచి 2014 వరకు కేవలం లక్ష కోట్ల రూపాయల అప్పులు మాత్రమే అయ్యాయన్నారు. 2014 నుంచి 2019 వరకూ మరో 1.50 లక్షల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చారన్నారు. దుబారా ఖర్చులు తగ్గిస్తామంటూనే తెలంగాణలోని లోటస్‌పాండ్‌లోని గృహానికి రూ.35 లక్షల నిధులు వెచ్చించడం, అలాగే విజయవాడలోని ఇంటికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ జీవోలు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో ఆమోదం పొందితే రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకపోవడంతో సచివాలయ ఉద్యోగాల్లో దాదాపు 40వేల మంది ఓసీ పేద యువతకు అన్యాయం జరిగిందన్నారు.

ఆరోపణల్లో సంయమనం పాటించాలి

- నిరాధార ఆరోపణలు అలవాటుగా మారింది
- ఆరోపణలను ఖండించిన ఐపీఎస్‌ల సంఘం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): "పోలీసులపై ఆరోపణలు చేసే ముందు రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలి. కానిస్టేబుల్ నుంచి పోలీస్ బాస్ వరకూ పోలీసు సిబ్బందిపై నిరాధార ఆరోపణలు చేయడం కొన్ని రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది" అని ఆంధ్రప్రదేశ్ ఐపీఎస్ అధికారుల సంఘం ఆక్షేపించింది. అమరావతిలోని రాజధాని ప్రాంతంలో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రయాణిస్తోన్న బస్సుపై కొందరు రాళ్లు, చెప్పులు విసిరారు. ఈ ఘటనలు పోలీసుల సహకారంతోనే జరిగాయని ఆరోపిస్తూ... డీజీపీ గౌతమ్ సవాంగ్‌పైనా టీడీపీ నేతలు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. రాజకీయ నాయకులు పోలీసులపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఈ విధమైన ఆరోపణలతో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేయాలని, ఆత్మస్థైర్యం దెబ్బతీయాలని చూడటం మంచిది కాదని అన్నారు. ఇటువంటి ఆరోపణలు పోలీసు ప్రతిష్ఠను దిగజారుస్తాయని ఐపీఎస్ అధికారుల సంఘం ఓ ప్రకటనలో పేర్కొంది. సంఘం కార్యదర్శి ద్వారకా తిరుమలరావు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో అనురాధ, పీవీ సునీల్ కుమార్, పాలరాజు, క్రాంతి రాణా టాటా, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

నా మతం మానవత్వం

(మొదటి పేజీ తరువాయి)

బాధ కలుగుతుంది. గుంటూరు వేదిక నుంచి నేను వారికి సమాధానం చెబుతున్నా. నా మతం మానవత్వం... మాట నిలబెట్టుకోవడమే నా కులం" అని ఆయన పేర్కొన్నారు. వైసీపీ మేనిఫెస్టోయే తనకు భగవద్గీత, బైబిల్, ఖురాన్‌తో సమానమన్నారు. గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆసరా పథకాన్ని జగన్ ప్రారంభించారు. అనంతరం ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులను ఆయన కలసి పరామర్శించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకే తాను ఆరోగ్యశ్రీ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టినట్టు ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన తెలిపారు. "సంపాదించే వ్యక్తి జబ్బు పడితే ఆ కుటుంబం ఎంత ఇబ్బందులు పడుతుందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే వారికి నేను మాట ఇచ్చాను. దాని ప్రకారం రోగులకు విశ్రాంతి భృతిని చెల్లిస్తున్నాను. ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్సలు చేయించుకొన్న రోగులకు విశ్రాంతి సమయంలో రోజుకు రూ.225 చొప్పున నగదు చెల్లిస్తాం. వైద్యులు సిఫారసు చేసినన్ని రోజులు ఈ జీవన భృతి రోగులకు చెల్లిస్తాం" అని వివరించారు. మాట నిలబెట్టుకొనేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నానని, ఆయా కార్యక్రమాల అమలుకు డబ్బులు సమకూర్చడం కష్టంగా ఉందన్నారు. "నా దగ్గర మంత్రదండం లేదు. అయినప్పటికీ మీ (ప్రజల) ఆదరణ, దేవుడి ఆశీస్సులుంటే నా అడుగు ముందుకే పడుతుంది" అన్నారు.

మార్పు ప్రజలకే చూపుతాం

రాష్ట్రంలో ఆరోగ్య ఉప కేంద్రం నుంచి వైద్య బోధన ఆసుపత్రి వరకు ప్రతి ప్రభుత్వాస్పత్రి రూపు రేఖలను మార్చే 'నాడు-నేడు' కార్యక్రమానికి నెలాఖరు నుంచి శ్రీకారం చుడుతున్నట్లు జగన్ ప్రకటించారు. ఈ కార్యక్రమం కింద రూ.13 వేల కోట్ల నిధులతో మూడేళ్లల్లోనే ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రుల కంటే గొప్పగా తీర్చిదిద్దుతామని తెలిపారు. "ఆరోగ్య ఉప కేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆస్పత్రులు, జిల్లా కేంద్ర ఆస్పత్రులు, వైద్య బోధన ఆస్పత్రుల్లో 'నాడు-నేడు' అమలవుతుంది. ఇప్పుడు ఆయా వైద్యశాలల ఫొటోలు తీస్తాం. వాటి రూపు రేఖలను మూడేళ్లలో మార్చివేసి, మరోసారి అవే వైద్యశాలల ఫొటోలు తీసి మార్పును స్వయంగా ప్రజలకు చూపుతాం" అని పథకం వివరాలను తెలిపారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీతో పాటు ప్రభుత్వాస్పత్రుల పనితీరును భ్రష్టు పట్టించిందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నా, వాటి భర్తీపై ఏమాత్రం శ్రద్ధ చూపలేదని విమర్శించారు. ఈ ఏడాది మే నాటికి రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల, స్టాఫ్ నర్సుల, సహాయ సిబ్బంది పోస్టులను పూర్తిగా భర్తీ చేస్తామన్నారు. "ఇటీవల ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించినప్పుడు, ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయి. చాలా చోట్ల మందులు లేవు. ఉన్నకొద్దిచోట్ల నాణ్యమైన మందులు లేవు. ఈ పరిస్థితిని చక్కదిద్దుతాం. ఈ నెల 15వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో 510 రకాల మందులను అందుబాటుల్లో ఉంచుతాం. వచ్చే ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నాణ్యతా ప్రమాణాలతో కూడిన మందులను మాత్రమే ఆస్పత్రులల్లో ఉంటాయి. వచ్చే మూడేళ్లల్లో విజయనగరం, పాడేరు, ఏలూరు, మచిలీపట్నం, గురజాల, మార్కాపురం, పులివెందుల్లో ఏడు కొత్త వైద్య కళాశాలలు, అనుబంధ బోధనాస్పత్రులను ఏర్పాటు చేస్తాం. అలాగే, ఏప్రిల్ నాటికి 1060 కొత్త 104, 108 అంబులెన్స్ వాహనాలు కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటుల్లోకి తెస్తాం. ఆయా వాహనాలను ఫోన్ చేసిన 20 నిమిషాల్లోపే వచ్చి రోగులను ఆస్పత్రులకు తరలిస్తాయి" అని తెలిపారు.

ఏ ప్లస్ గ్రేడ్ తెచ్చుకోలేకపోతే..

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు త్వరలో గ్రేడింగ్ విధానం అమలు చేయనున్నట్లు జగన్ వివరించారు. ఆస్పత్రుల్లో ఉండే సౌకర్యాలను బట్టి వీటికి ఏ ప్లస్, ఏ గ్రేడులు కేటాయిస్తామన్నారు. ఏ గ్రేడ్‌లో ఉన్న ఆస్పత్రులు ఆరు నెలల్లో సౌకర్యాలు మెరుగుపర్చుకొని ఏ ప్లస్ గ్రేడ్‌లోకి రావాలని, లేకుంటే ఎంప్యానల్ నుంచి ఆ ఆస్పత్రిని తొలగిస్తామని స్పష్టం చేశారు. రోగులకు మంచి ఆపరేషన్లు చేయించాలనే ఉద్దేశంతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర మహానగరాల్లో 130 కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నవంబరు ఒకటి నుంచి అందుబాటుల్లోకి తెచ్చినట్లు చెప్పారు. జనవరి ఒకటో తేదీ నుంచి క్యూఆర్ కోడ్ ఉండే కొత్త హెల్త్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్డులో రోగులకు సంబంధించిన మెడికల్ రికార్డుల వివరాలన్నీ ఉంటాయన్నారు. చెవిటి, మూగ పిల్లలకు బైలేట్రల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సలు చేయిస్తామని తెలిపారు. జనవరి ఒకటి నుంచి కేన్సర్ వ్యాధిగ్రస్తులకు అవసరమయ్యే కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, శస్త్రచికిత్సలను పూర్తిగా ఆరోగ్యశ్రీ ప్యాకేజీలో చేరుస్తున్నామన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి మరో ఏడు రకాల దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు పెన్షన్ మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. థలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా, హీమోఫీలియా రోగులకు నెలకు రూ.10 వేలు, రోడ్డు ప్రమాదాలు, పక్షవాతం, కండరాల క్షీణతతో మంచం పట్టిన రోగులకు, బోద కాలు, కిడ్నీ రోగులకు నెలకు రూ.5 వేలు, కుష్టు వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.3 వేలు పెన్షన్ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆళ్ల నాని, మోపిదేవి, సుచర

కొస్తినలో మన గళం

'పునరావాసం' తేల్చండి

- దానిని బట్టే పోలవరం నిర్మాణం: రాష్ట్రానికి కేంద్రం స్పష్టం

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీని ఎంత త్వరగా పూర్తి చేస్తే తాము అంత త్వరగా ప్రాజెక్టు పూర్తి చేస్తామని కేంద్రం వెల్లడించింది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, ఈ విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని రాజ్యసభలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును 2021 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ మేరకు సోమవారం రాజ్యసభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. మరో సభ్యుడు జైరాంరమేష్ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ నవంబరులో టెండర్లు ఖరారయ్యాయని, గడువును పొడిగించి నిర్ణీత కాలపరిమితిలోగా నిర్మాణం పూర్తిచేయనున్నట్లు మంత్రి జవాబిచ్చారు. పోలవరం కాంట్రాక్టులకు సంబంధించి అదనపు చెల్లింపుల విషయంలో గత టీడీపీ ప్రభుత్వం నియమ నిబంధనలేవీ అతిక్రమించలేదని వైసీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ జవాబిచ్చారు. పోలవరం కాంట్రాక్టు కంపెనీలకు అదనంగా రూ.2346.85 కోట్లు చెల్లింపులు జరిగినట్లు ఏపీ ప్రభుత్వం నియమించిన కమిటీ వెల్లడించిందని తెలిపారు. కమిటీ నివేదిక ప్రకారం 2015-16లో రివిజన్ అగ్రిమెంట్ ప్రకారం రూ.1331 కోట్లు పెరిగిందని, మొబలైజేషన్ అడ్వాన్స్‌పై వడ్డీ కింద రూ.84.43 కోట్లు పెరిగిందని, ఇంప్రెస్డ్ మనీ కింద రూ.144.22 కోట్లు, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు స్వాధీన పరచకముందు రూ.787.20 కోట్లు అదనంగా చెల్లించినట్లు మంత్రి వివరించారు. కాగా, పోలవరం సాగునీటి ప్రాజెక్టు నిర్మాణ నిధులు నేరుగా పీపీఏ ద్వారా రాష్ట్రానికి వచ్చేలా ఒత్తిడి పెంచేందుకు జల వనరులశాఖ సిద్ధమవుతోంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోను కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ త్వరలోనే నియమించనున్నది. బాధ్యతలు చేపట్టిన వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలంటూ సీఈవోను డిమాండ్ చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ నిర్ణయించింది.

విశాఖ బీచ్‌కు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొరింగ, కృష్ణాజిల్లాలోని తీర ప్రాంతాన్ని అత్యంత ప్రమాదకరమైన తీరప్రాంతగా గుర్తిస్తూ నోటిఫికేషన్ జారీచేసినట్టు కేంద్ర మంత్రి బాబుల్ సుప్రియో వెల్లడించారు. రాజ్యసభలో సోమవారం టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. విశాఖపట్నంలోని రిషికొండ బీచ్‌కు దేశంలో బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ కోసం ఎంపిక చేసిన 13 బీచ్‌ల జాబితాలో స్థానం కల్పించినట్టు మంత్రి వెల్లడించారు.

కడప స్టీల్ ప్లాంట్‌కు సహకరిస్తాం: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కడపలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు కేంద్రం తరఫున అన్ని విధాలా సహకరిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. సోమవారం లోక్‌సభలో వైసీపీ సభ్యుడు బాలశౌరి అడిగిన ఒక ప్రశ్నకు స్పందించారు. అనంతరం, బాలశౌరిమీడియాతో మాట్లాడుతూ, కడప స్టీల్ ప్లాంటుకు వైఎస్సార్ స్టీల్ ప్లాంట్ అని పేరు పెట్టాలని సూచించినట్టు చెప్పారు.

దుగరాజపట్నం ఓడరేవుకు రాంరాం!

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీలోని దుగరాజపట్నంలో ఓడరేవు నిర్మాణానికి అనువైన వాతావరణంలేదని, అందువల్ల ఈ ప్రతిపాదన విరమించుకున్నట్లు కేంద్ర ఓడరేవుల శాఖ మంత్రి సోమవారం రాజ్యసభలో బీజేపీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక జవాబిచ్చారు. ప్రత్యామ్నాయంగా మరో చోట మేజర్ ఓడరేవును ఏర్పాటు చేయడానికి అనువైన ప్రదేశం పరిశీలన కోసం నిపుణుల కమిటీని నియమించినట్లు మంత్రి చెప్పారు.

ఆర్టీసీ విలీనానికి అనుమతి తప్పనిసరి:గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ పునర్వ్యవస్థీకరణ, ప్రభుత్వంలో విలీనం వంటి అంశాలపై తమకు ఎలాంటి ప్రతిపాదనలూ రాలేదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రోడ్డు రవాణా సంస్థల చట్టం-1950 ప్రకారం సెక్షన్ 47ఏ-కు లోబడి ఆర్టీసీ విషయంలో ఎలాంటి మార్పులు చేయాలన్నా కేంద్రం అనుమతి తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుందని గడ్కరీ స్పష్టం చేశారు.

ఆదాయం పెరిగేదెలా?.. నేడు మంత్రుల భేటీ

రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చి పెట్టే మార్గాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధన, భూగర్భగనుల శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జల వనరులశాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ మంగళవారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలో భేటీ కానున్నారు.

బార్ పాలసీపై హైకోర్టుకు యజమానులు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టదలచిన నూతన బార్ల పాలసీని వ్యతిరేకిస్తూ పలువురు బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. 2017లో బార్ల లైసెన్సు పొందిన తమకు ముందస్తు ఒప్పందం మేరకు 2022 జూన్ వరకు అవకాశం ఉందని, అయితే ప్రభుత్వం ఆ లైసెన్సులను హఠాత్తుగా రద్దు చేసి, కొత్త విధానాన్ని ప్రవేశపెట్టడం సరికాదని పిటిషన్లలో పేర్కొన్నారు. వీటిపై మంగళవారం విచారణ జరిగే వీలుంది.

శభాష్ అర్జునరావు!

- కాల్వలోకి దూకి మహిళ ఆత్మహత్యాయత్నం
- ప్రాణాలకు తెగించి కాపాడిన ఆర్ఎస్ఐ
- 'ప్రధాని అవార్డు'కు ప్రతిపాదన: డీజీపీ

మహిళకు ప్రథమ చికిత్స చేస్తున్న అర్జునరావు

విజయవాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆయనో యువ పోలీసు అధికారి. కాల్వ పక్కన ఉన్న పోలీసు క్వార్టరులో నివాసం. ఉదయం విధులకు సిద్ధమవుతూ.. స్థానానికని బాత్‌రూముకు వెళ్లారు. అనుకోకుండా కిటికీలో నుంచి చూస్తే.. పక్కనే కాలువ ప్రవాహంలో ఓ మహిళ కొట్టుకుపోతోంది. అంతే.. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు.. ఇంట్లో నుంచి బయటికి వచ్చారు. ప్రాణాలకు తెగించి కాలువలో దూకారు. ఆమె ప్రాణాలు కాపాడారు. విజయవాడలోని బందరు కాల్వ వద్ద సోమవారం జరిగిన ఘటన ఇది. వివరాలివీ.. ఇక్కడి రాణిగారితోటకు చెందిన లక్ష్మి(55) కొంతకాలంగా మానసికంగా ఇబ్బందులు పడుతోంది. ఆమె భర్త రమణ కూరగాయల వ్యాపారి. ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన లక్ష్మి జాతీయ రహదారి దాటుకుని బందరు కాల్వ గట్టు మీదకు వెళ్లింది. అక్కడి నుంచి నీటిలోకి దూకేసింది. కాల్వనీటి ప్రవాహంలో ఆమె కొట్టుకుపోతోంది. ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో.. పక్కనే ఉన్న పోలీసు క్వార్టరులో నుంచి ఏఆర్ ఎస్ఐ దంగేటి అర్జునరావు ఆ దృశ్యాన్ని చూశారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా.. ఒంటిపై ఉన్న లుంగీతోనే పరుగులు తీశారు. కాల్వ వద్ద మెట్లపై నుంచి నీటిలోకి వెళ్లారు. అప్పటికే గట్టుకు అవతలి వైపున చాలామంది చూస్తున్నారు. కొట్టుకుపోతున్న ఆమెను చూసి కేకలు వేస్తున్నారు. నీటిలోకి దూకిన అర్జునరావుకు లక్ష్మిని ఒడ్డుకు తీసుకురావడానికి మరో నలుగురు చేయందించారు. ఆయనకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిస్టెన్స్)లో నైపుణ్యం ఉండడంతో లక్ష్మికి ప్రాథమిక వైద్యం చేశారు. ఆమెను బోర్లా పడుకోబెట్టి కడుపులో నీటిని బయటకు రప్పించారు. తర్వాత ఛాతీపై నిమిషానికి 70-80సార్లు ఒత్తిడి చేసి శ్వాసను పునరుద్ధరించారు. ఆమె ప్రాణాలతో ఉందని నిర్ధారించుకుని కొంతమంది యువకులు డయల్ 100కు, 108 అంబులెన్స్‌కు ఫోన్లు చేశారు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు యత్నించిన మహిళ ప్రాణాలు కాపాడిన ఆర్ఎస్ఐ అర్జునరావును డీజీపీ గౌతమ్ సవాంగ్, విజయవాడ పోలీసు కమిషనర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అభినందించారు. అర్జునరావు పేరును ప్రధానమంత్రి లైఫ్ సేవింగ్ అవార్డుకు ప్రతిపాదిస్తున్నామని డీజీపీ గౌతమ్ సవాంగ్ ప్రకటించారు.

ఏపీలో పన్ను రాబడికి గండి

- దీనికి జగన్ ప్రభుత్వమే కారణం
- కాదు.. గత టీడీపీ సర్కారు వల్లే దుస్థితి
- లోక్‌సభలో గల్లా వర్సెస్ మిథున్‌రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ ఎంపీలు గల్లా జయదేవ్, మిథున్ రెడ్డిలు లోక్‌సభ సాక్షిగా పరస్పరం ఢీ అంటే ఢీ అనే స్థాయిలో వాగ్వాదానికి దిగారు. కేంద్రం కొత్తగా ప్రవేశ పెడుతున్న 'పన్నుల సవరణ చట్టం-2019' బిల్లుపై లోక్‌సభలో సోమవారం చర్చ జరిగింది. టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ మట్లాడుతూ.. "ఏపీలో జగన్ ప్రభుత్వం వచ్చాక అనాలోచిత విధానాలవల్ల పరిశ్రమలు వెనక్కి వెళ్లి పోతున్నాయి. కొత్త పెట్టుబడులు రావడంలేదు. పన్నుల రాబడి తగ్గింది. గత టీడీపీ హయాంలో 2014-19 ఆర్థిక సంవత్సరాల్లో ఆదాయ వనరులు బాగా పెరిగాయి. పన్నుల రాబడి దశలవారీగా పెంచాం" అని గల్లా మాట్లాడారు. ఈ సమయంలో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి జోక్యం చేసుకుని బిగ్గర స్వరంతో అడ్డుతగిలారు. "జాతీయ స్థాయిలో పన్నుల సవరణ బిల్లుపై జరిగే చర్చలో.. ఏపీ గురించి ఎందుకు? ఇది అసెంబ్లీ కాదు. పార్లమెంటు. వాస్తవానికి టీడీపీ హయాంలో ఏపీలో పెద్దఎత్తున అవినీతి జరిగింది. అందుకే ఇప్పుడు రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు క్షీణించాయి. దీనికి మీరు కారణం కాదా?" అని విరుచుకుపడ్డారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో సభాపతి జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. అనంతరం, జయదేవ్ మాట్లాడుతూ, నూతన పన్నుల సవరణ చట్టాన్ని సేవారంగాలకూ విస్తరింపజేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మేక్ ఇన్ ఇండియా నినాదానికి అప్పుడు అర్థం చేకూరుతుందన్నారు. దేశంలో వినియోగం తగ్గడంతో పరిశ్రమలన్నీ ఇబ్బందుల్లో ఉన్నాయని, ఈ సమస్య నుంచి పారిశ్రామిక వేత్తలకు ఉపశమనం లభించేలా విధానాలు ఉండాలని సూచించారు.

జైలుకెళ్లడం ఇంగ్లీషు నేర్పిందా?

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలలు ఉండి, ఎనిమిది భాషామాధ్యమాలలో బోధన జరుగుతుంటే కేవలం తెలుగు మీదే ఎందుకు పడ్డారని, మాతృభాషనే ఎందుకు చంపాలని కంకణం కట్టుకున్నారని ప్రశ్నించారు. "భాషల జోలికి రాకండి. లేదంటే సరస్వతి.. అపర దుర్గగా మారి సమూలంగా నాశనం చేస్తుంది" అని ప్రభుత్వాన్ని తీవ్రస్వరంతో హెచ్చరించారు. రాయలసీమ పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్ సోమవారం తిరుపతిలో 'మన నుడి- మన నది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా 'తెలుగు వైభవం' పేరిట సాహితీవేత్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కవులు, రచయితలు ఆలపించిన తెలుగు పద్యాలకు పవన్ పరవశించిపోయారు. ఈ సందర్భంగానూ, పార్టీ నేతలతో జరిపిన సమావేశంలోనూ రాష్ట్ర ప్రభుత్వం, జగన్‌పై విరుచుకుపడ్డారు. మాతృభాష పట్ల తనకున్న మక్కువను మరోసారి చాటుకొన్నారు. "నాకు తెలియని, నా మాతృభాష కాని ఇంగ్లీషు వల్లనే తెలుగు తాలూకూ అందాన్ని, ధ్వనిని ఆనందించలేకపోయాను. చిన్న వీధిబడిలో చదువుకున్న నన్ను ప్రాథమిక విద్య అనంతరం ఇంగ్లీషు మీడియంలో చేర్పించారు. దీంతో చదువంటేనే ఒక రకమైన విరక్తి, భయం వచ్చేశాయి" అని తెలిపారు. చదువు జ్ఞానాన్ని ఇవ్వాలి గానీ, భయాన్ని కాదన్నారు. "మేడసాని మోహన్ అవధానం చేస్తుంటే వినే శక్తి నాకు లేదు. రాయలవారి ఆముక్తమాల్యదను అర్థం చేసుకునే శక్తిలేకుండా పోయింది. షేక్స్పియర్ గురించే ఎందుకు చదువుకోవాలి? తిక్కన, నన్నయ ఉన్నారు కదా!" అని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పాలకులకు తెలుగును పరిరక్షించేందుకు శక్తిలేనప్పుడు కొత్తగా ఏమి చేస్తారని పవన్ ప్రశ్నించారు. తమ బిడ్డలను ఏ మాధ్యమంలో చదివించాలనేది వారి తల్లిదండ్రుల ఇష్టానికే వదిలేయాలని పవన్ సూచించారు.

తిరుపతిలో పార్టీ నేతల సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్

ఉప్పు సత్యాగ్రహంలాంటి ఉద్యమం..

ప్రతిచోటా ఉప్పు సత్యాగ్రహం వలే మన నుడి-మన నది ఉద్యమం రావాలని పవన్ ఆకాంక్షించారు. వెంకన్న ఆశీస్సులతో మొదలయిన ఈ కార్యక్రమాన్ని బలమైన భాషా ఉద్యమంగా ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఇది తొలి అడుగు మాత్రమేనని, ప్రతి జిల్లాలో తెలుగు భాషా పరిరక్షణకు అందరి సహాయ సహకారాలు కావాలని కోరారు. తెలుగు మాధ్యమాన్ని తీసేయడంపై కాకుండా.. విద్యాలయాలు, హాస్టళ్లల్లో మౌలిక వసతులు కల్పించడంపై జగన్ ప్రభుత్వం దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ కోరారు.

మా జోలికొస్తే ఖబడ్దార్

వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు అవుతున్నా ప్రజాసమస్యలను పక్కన పెట్టి కనిపించిన భవనాలన్నింటికీ వైసీపీ రంగులు కొట్టుకుంటున్నారని, చివరికి పావురాలకు కూడా పార్టీ రంగులు కొట్టి రాష్ట్రాన్ని రంగుల రాజ్యంగా మార్చేస్తున్నారే తప్ప రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసమస్యలను పట్టించుకున్న పాపానపోవడం లేదని పవన్‌కల్యాణ్ ఆరోపించారు. మతం మారినప్పుడు కులం పేరు చెప్పుకోకూడదని, అయితే ఓట్లు కోసం కులమతాలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్న నాయకుడు జగన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు, కార్మికుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ఈ సమస్యలపై ప్రజలతో కలిసి పోరాడాలని చిత్తూరు, తిరుపతి పార్టీ పార్లమెంటరీ నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు. రైల్వేకోడూరులో తమ పార్టీ నాయకుడి బత్తాయితోటను వైసీపీ నాయకులు నరికి వేయడం దుర్మార్గమన్నారు. మరోసారి ఇలా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. పసికందులు, మహిళలపై అత్యాచారాలు చేసేవారిని చంపేయడం పరిష్కారం కాదని, జీవితంలో మళ్లీ అలాంటి తప్పులు చేయకుండా ఆ కామాంధులను కర్రలతో కొట్టి గట్టిగా శిక్షించాలని పవన్ అభిప్రాయపడ్డారు.

హీరోలకు తెలుగు రాదు

తెలుగు చిత్ర పరిశ్రమలో చాలా మంది హీరోలకు తెలుగు మాట్లాడటం అటుంచితే రాయడం కూడా రాదని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. "తెలుగు సినిమాలు కావాలి... తెలుగు సినిమాల ద్వారా డబ్బులు సంపాందించుకోవాలి... కానీ తెలుగు భాష అంటే పట్టింపు ఉండదు. నేను కూడా మొదట్లో అలాగే ఉండేవాడిని. చాలామందికి కాళిదాసు ఎవరో, ఆముక్త మాల్యద అంటే ఏంటో తెలియదు. మేడసాని వంటి వ్యక్తులు ఇండస్ట్రీలో ఉంటే మంచి సినిమాలు వచ్చేవి. బూతులు, తిట్లే సినిమాలో ప్రమాణాలైపోతుంటే సమాజం కూడా అటే పోతోంది' అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, నాగబాబు, విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు, సహస్ర అవధాని మేడసాని మోహన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆరు దారులు.. రూ.60వేల కోట్లు!

- పోలవరం-బానకచర్ల ఎత్తిపోతలకు వాప్కోస్ ఫీజబులిటీ నివేదిక సిద్ధం
- సీఎం జగన్ ఆదేశాల మేరకు తుది నిర్ణయం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం-బానకచర్ల ఎత్తిపోతల పథకానికి ఫీజబులిటీ (సాధ్యాసాధ్యాలు) నివేదిక సిద్ధమైంది. ఈ పథకాన్ని చేపట్టేందుకు రూ.60వేల కోట్ల వ్యయం అవుతుందని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వాప్కోస్ ప్రాథమికంగా అంచనా వేసింది. ఏ విధంగా అమలు చేయాలో ఆరు మార్గాల(ఆప్షన్లు)ను సూచించింది. పోలవరం సాగునీటి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నుంచి శ్రీశైలం జలాశయంలోకి గోదావరి జలాలను ఎత్తిపోసి, బానకచర్ల కాంప్లెక్స్‌కు తీసుకెళ్లడం ద్వారా రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఇందులోభాగంగా గుంటూరు జిల్లా బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీల సామర్థ్యం కలిగిన భారీ రిజర్వాయర్‌ను నిర్మిస్తారు. దీనివల్ల 9.61 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చని జల వనరులశాఖ చెబుతోంది. ముఖ్యమంత్రి జగన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పథకానికి వాప్కోస్ ఇచ్చిన ఫీజబులిటీ నివేదికపై ఆయన వద్ద ఒకటి రెండు రోజుల్లో సమీక్ష జరగనున్నది. నివేదికలో ఇచ్చిన ఆరు ఆప్షన్లలో జగన్ సూచించిన దానిని తీసుకుని తదుపరి చర్యలు తీసుకోవాలని జల వనరుల శాఖ భావిస్తోంది. ఇది భారీ వ్యయంతో కూడిన నిర్మాణం అయినందున ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా రాష్ట్ర జల వనరులశాఖ సిద్ధమవుతోంది.

తగ్గిన మద్యం విక్రయాలు

- గతేడాదితో పోలిస్తే 24%తగ్గుదల
- అయినా ఆదాయం మాత్రం భేష్

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయి. 2018 నవంబరులో 29.62 లక్షల కేసుల లిక్కర్‌ను విక్రయించగా, ఈ ఏడాది నవంబరులో 22.31 లక్షల కేసుల మద్యాన్ని మాత్రమే అమ్మారు. దీంతో 24.67శాతం మేర తగ్గుదల నమోదైందని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. 2018 నవంబరులో 17.80 లక్షల కేసుల బీరు అమ్ముడుపోగా, ఈ ఏడాది అదే మాసంలో 8.13 లక్షల కేసులు మాత్రమే విక్రయించారు. అంటే బీర్ల అమ్మకాలు 54.30 శాతం తగ్గింది. నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టడంతో గతంలో ఉన్న 4380 మద్యం షాపులను 3500కు తగ్గించారు. వ్యాపార సమయాన్ని ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకే పరిమితం చేశారు. గతంలో పర్మిట్ రూమ్‌లతో కొన్ని చోట్ల, పర్మిట్‌లు లేకుండా మరికొన్ని చోట్ల మద్యం సేవించేవారు. ఇప్పుడు పర్మిట్ రూమ్‌లు రద్దు చేయడంతో మద్యం షాపులు అమ్మకానికే పరిమితం అవుతున్నాయని అధికారులు చెప్తున్నారు. కాగా.. మద్యం విక్రయాలు, వినియోగం తగ్గినప్పటికీ నూతన విధానం వలన ఆదాయం మాత్రం తగ్గలేదని అధికారులు పేర్కొన్నారు.

హచ్ కుక్కను మించిన పవన్

- జనసేన చీఫ్‌పై మంత్రి అనిల్ ధ్వజం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): "చంద్రబాబు నాయుడును ఫాలో అవడంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 'హచ్ కుక్క'ను మించిపోయాడు" అని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ విమర్శించారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి పవన్ కల్యాణ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబును ఫాలో అవుతున్నందునే పవన్ కల్యాణ్‌ను పవన్ నాయుడు, కల్యాణ్ నాయుడు అంటున్నారని అన్నారు. ఆయనను రాజకీయ నాయకుడనాలో, సినీ నటుడనాలో అర్థం కావడం లేదన్నారు. జగన్ దమ్ము, ధైర్యం గురించి ప్రజలకు తెలుసుననీ, పవన్ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పవన్ సత్తా ఏమిటో సార్వత్రిక ఎన్నికల్లో తెలిసిందన్నారు. సీఎం జగన్‌ను, పవన్ ఎలా పిలిచినా తమకు అనవసరమన్నారు. పవన్‌ను పట్టించుకోనవసరం లేదన్నారు. ప్రజలు భారీ మెజారిటీతో జగన్‌ను సీఎంగా గెలిపించారన్నారు. సోషల్ మీడియాలో రెచ్చిపోయి మాట్లాడుతున్న ఫ్యాన్స్‌ను ఆయన కంట్రోల్ చేసుకోవాలని సూచించారు. పవన్ ఎవరి తోలూ, తాటలూ తీయలేరని, ఆయన వల్ల ఏమీ కాదన్నారు.

అయోమయం ఇరిగేషన్!

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు అయోమయంలో పడిపోయాయి. ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టు పనులు చేపడతామని ప్రభుత్వం ప్రకటించినా... గత ఆరు నెలలుగా ఈ అంశంపై స్పష్టత రావడం లేదు. ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం బడ్జెట్‌లో రూ.13వేల కోట్లు కేటాయించినా.. నామమాత్రంగానే నిధులు విడుదలయ్యాయి. మరో నాలుగు నెలల్లో 2019-20 ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో.. ఈ ఏడాదికి సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగేందుకు అవకాశాలు లేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కీలకమైన పోలవరం సాగునీటి ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.5500 కోట్లలో... రూ.1850 కోట్లను కేంద్రం విడుదల చేసింది. నాబార్డు నుంచి ఈ నిధులు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సి ఉంది. దాదాపు రూ.13వేల కోట్ల బడ్జెట్ కేటాయింపులు కలిగిన జలవనరుల శాఖ ఇప్పుడు కేంద్రం మంజూరు చేసిన రూ.1850 కోట్ల కోసం ఎదురు చూస్తోందంటే ఈ శాఖ ఆర్థికంగా ఎంత కుదేలైందో అర్థమవుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

25 శాతం తేలలేదు

పోలవరం సాగునీటి ప్రాజెక్టు హెడ్ వర్క్స్, కుడి, ఎడమ ప్రధాన కాలువ పనులకు ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌కు వెళ్లింది. అదేవిధంగా పోలవరం హైడల్ ప్రాజెక్టు విషయంలోనూ ఇదే నిర్ణయం తీసుకుంది. ఈ పనులను ఒకే ప్యాకేజీగా పిలిచారు. ఇదే తరహాలో మిగిలిన ప్రాజెక్టులకూ రివర్స్ టెండర్‌కు వెళతామని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలపై ముఖ్యమంత్రి జగన్ నిర్వహించిన సమీక్షల్లో... 25 శాతంలోపు పనులు జరిగిన ప్రాజెక్టుల విషయంలో ఒక నిర్ణయం తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా 25 శాతానికిపైగా జరిగిన సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వివరించారు. కానీ... 25 శాతంలోపు నిర్మాణాలు జరిగిన ప్రాజెక్టుల విషయంలో ఏం చేయాలో ఇంతవరకూ స్పష్టత రాలేదు. అదేవిధంగా అంతకంటే ఎక్కువ జరిగిన ప్రాజెక్టు పనులలో వేటిని కొనసాగించాలో, వేటికి రివర్స్ టెండరింగుకు వెళ్లాలో ఇప్పటికీ అస్పష్టతే! ఇదే సమయంలో.. రాయలసీమ ప్రాంతంలో కొత్తగా ఎత్తిపోతల పథకాలపైనా ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. ఇదిలావుంటే, కాంట్రాక్టు సంస్థలకు బకాయిల చెల్లింపుల కోసం ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపుల నుంచి విడుదల కావాల్సిన రూ.7,657 కోట్లు ప్రతి త్రైమాసికంలోనూ విడుదలవుతాయని జల వనరులశాఖ ఆశించింది. ఇదే సయయంలో కొత్త ప్రాజెక్టులు నిర్మించేందుకు రూ.7,572 కోట్లు అవసరమవుతాయని ఈ శాఖ అంచనా వేసింది. కానీ... ప్రాజెక్టు పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థలకు చెల్లించాల్సిన రూ.3500 కోట్లనే ఇవ్వలేక తిప్పలు పడుతోంది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల కోసం కార్పొరేషన్ పెట్టి రుణాలు తీసుకోవాలని భావిస్తోంది. కానీ ప్రాజెక్టుల వల్ల రైతులకు లబ్ధి ఎంత మేర జరుగుతుందో, కొత్త ఆయకట్టు ఎంతో స్పష్టత వస్తే తప్ప బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి సిద్ధపడవని ఆ శాఖే చెబుతోంది.

ముద్ర ఎవరిది? ముద్ద ఎవరికి?

(మొదటి పేజీ తరువాయి)

సరుకులు అందించినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రం మొత్తం కలిపినా వేలిముద్రలు పడనివారు 40 వేలకు మించి ఉండరని పౌరసరఫరాలశాఖ అధికారులు ఎప్పటి నుంచో చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 2 వేల మంది మాత్రమే వేలిముద్రలు పడని వారు ఉన్నారని అధికారులు తెలిపారు. మరి వలంటీర్లు ఇంత మందికి వేలిముద్ర ఎందుకు వేయాల్సి వచ్చిందనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఆరంభమే ఆగమాగం..

ప్రజా పంపిణీ వ్యవస్థను సమూలంగా మార్చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అందులో భాగంగా ఇంటింటికీ రేషన్ డోర్ డెలివరీ విధానాన్ని ప్రవేశపెట్టింది. తొలుత రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబరు 1 నుంచి ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించినా.. నాణ్యమైన బియ్యం కొరత వలన తొలు

2,976

దేశంలో పులుల సంఖ్య ఇది. 2015లో వీటి సంఖ్య 2,976. ఈ నాలుగేళ్లలో 750 పెరిగాయి.

1.09 కోట్లు

ఐదేళ్లలో నరికివేతకు గురైన చెట్లు. ప్రభుత్వ అనుమతితో, తప్పని పరిస్థితుల్లో వీటిని నరికేశారు. ఇందుకు పరిహారంగా చెట్లను నరికిన వారితో మొత్తం 12 కోట్ల మొక్కలను నాటించారు.

90%

ఐదేళ్లలో దేశంలో పెరిగిన ఇంటర్నెట్ వినియోగదారుల శాతం. ప్రాంతీయ భాషల్లో సెర్చింగ్ చేసే వారు కూడా 20 శాతం పెరిగినట్టు గూగుల్ తెలిపింది. 2014లో ఇలా శోధించే వారిది 2 శాతమే.

100%

స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ) కింద వందశాతం గ్రామాలు బహిరంగ విసర్జన రహితం(ఓడీఎఫ్)గా మారాయి. 5,99,963 గ్రామాల్లో 10.14 కోట్ల ఇళ్లకు మరుగుదొడ్డి సౌకర్యం కల్పించారు.

ముగ్గురు ఐఐటీ విద్యార్థులకు.. 1.54 కోట్ల జీతంతో కొలువులు

వారాణసీ, డిసెంబరు 2: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ-రూర్కీ)కి చెందిన ముగ్గురు విద్యార్థులకు.. ఆది, సోమవారాల్లో జరిగిన ప్రాంగణ నియామకాల్లో ఏడాదికి రూ. 1.54 కోట్ల వేతనంతో ఉద్యోగాలు లభించాయి. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నుంచి జరుగుతున్న ఈ నియామకాల్లో మైక్రోసాఫ్ట్, ఉబర్, క్వాల్‌కం, సిస్కో, ఇంటెల్, ఒరాకిల్, జాగ్వార్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే సహా.. మొత్తం 41 కంపెనీలు పాల్గొంటున్నాయి. సింహభాగం కంపెనీలు రూ. 10 లక్షలు - రూ. 58.21 లక్షల మేర ఆఫర్లిచ్చాయి. అమెరికాకు చెందిన నాలుగు ఎంఎన్‌సీలు మాత్రం ఏడాదికి రూ. 1.54 కోట్ల ఆఫర్‌తో ముందుకు వచ్చాయని అధికారులు తెలిపారు.

దక్షిణ కొరియా అంతటా భారత ఆర్మీ అధికారి ఫొటోలు

న్యూఢిల్లీ, డిసెంబరు 2: భారత ఆర్మీలో తెరమరుగైన ఒక అధ్యాయం దక్షిణ కొరియా నిర్ణయంతో మళ్లీ వెలుగులోకి వచ్చింది. వచ్చే ఏడాది జూలై నాటికి కొరియా యుద్ధం జరిగి 70 ఏళ్లు అవుతుంది. ఆ సందర్భంగా మహావీరచక్ర అవార్డు గ్రహీత, లెఫ్టినెంట్ కర్నల్ ఏజీ రంగరాజ్ ఫొటోలను దక్షిణ కొరియా వ్యాప్తంగా ప్రదర్శించి, స్మరించాలన్నదే ఆ నిర్ణయం. భారత ఆర్మీ వైద్య విభాగమైన '60 పారా ఫీల్డ్ అంబులెన్స్‌కు రంగరాజ్ సారథ్యం వహించారు. 1950-53 కొరియా యుద్ధంలో గాయపడిన 2.2 లక్షల మంది సైనికులకు ఆయన బృందం వైద్య సేవలు అందించింది.

పొగ తాగని వారికి 6 సెలవులు

న్యూఢిల్లీ, డిసెంబరు 2: సీట్లోంచి మధ్యలో మాయమైపోతుంటాడు... కాసేపటికి మళ్లీ ప్రత్యక్షమవుతుంటాడు! ఆఫీసుల్లో పొగరాయుళ్లకు ఇలాంటి బ్రేకులు మామూలే! వీటికి బాస్ అనుమతి అక్కర్లేదు కూడా! వాళ్లని దమ్ముకొట్టని ఉద్యోగులు కొరకొరా చూడడమూ కొత్త కాదు! ఈ గొడవ లేకుండా ఉండాలంటే ఏం చేయాలని ఓ జపాన్ కంపెనీ ఆలోచించి, పరిష్కారం కనిపెట్టింది. పొగతాగని వాళ్లకు ఏడాదికి అదనంగా ఆరు ఆర్జిత సెలవులు ప్రకటించి, వారికి 'కిక్' ఇచ్చింది.

బాబ్రీ పునర్నిర్మాణంతోనే పూర్తి న్యాయం



5 ఎకరాలు మేం అడగలేదు

▸▸ అయోధ్య తీర్పుపై సమీక్ష కోరిన అసలు కక్షిదారు

న్యూఢిల్లీ, డిసెంబరు 2: అయోధ్య వివాదంపై ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నవంబరు 9న వెలువరించిన తీర్పుపై సమీక్ష కోరుతూ జమియత్ ఉలేమా-ఎ-హింద్ సోమవారంనాడు ఓ పిటిషన్ వేసింది. బాబ్రీ మసీదును కూల్చినచోటే మళ్లీ కట్టినప్పుడే సిసలైన న్యాయం జరుగుతుందని అసలు కక్షిదారైన ఎం సిద్దిఖ్ తరఫున ఆయన వారసుడు, జమియత్ ఉలేమా అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అషాద్ రషీదీ ఆ పిటిషన్లో అభిప్రాయపడ్డారు. తీర్పు లోపభూయిష్టమని, తప్పిదమనీ, వాస్తవాల్ని కాదంటోందని ఆయన పేర్కొన్నారు. 'చట్టవ్యతిరేక చర్యలు జరిగినట్లు ధర్మాసనం అంగీకరించింది. ఓ పక్క అలా అంటూనే బాబ్రీ మసీదు స్థలాన్ని రామాలయ నిర్మాణానికి ఇచ్చేసింది. అంటే చట్టవిరుద్ధ చర్యలను క్షమించి మాఫీ చేయడమే. అసలు హక్కుదారులైన ముస్లింలకు వేరేచోట ఐదెకరాలు ఇవ్వమని ఆదేశించారు. మేం ఐదెకరాలూ ఇవ్వాలని కోరామా?" అని పిటిషనర్ కోరారు. "కేసు ఎంత సున్నితమైనదో మాకు తెలుసు. దేశంలో శాంతి సామరస్యాలు నెలకొనాలంటే దీనికి శాశ్వత ముగింపు పలకాలన్న వాదననీ మేం కాదనడం లేదు. అయితే పూర్తి న్యాయం జరగని చోట శాంతి అసాధ్యం" అని పిటిషనర్ స్పష్టం చేశారు. తీర్పు మొత్తాన్ని తాము కాదనడం లేదని అంటూ... తన అభ్యంతరాలను కక్షిదారు విశదీకరించారు:

మౌలానా సయ్యద్ అషాద్ రషీదీ

- ఆలయ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం అంటే బాబ్రీ మసీదు విధ్వంసానికి కోర్టు తీర్పు ఉత్తర్వు ఇచ్చినట్లే
- మసీదుపై దాడికి సంబంధించి 1934, 1949, 1992లో జరిగిన ఘటనలను కోర్టు ఖండించింది.. అదే సమయంలో ఆ పనిచేసిన వారికే స్థలాన్ని కట్టబెట్టింది.
- ఓ చట్టవ్యతిరేక చర్య నుంచి ఏ వ్యక్తీ లాభం పొందజాలడన్నది ఏనాడో ఆమోదించిన న్యాయసూత్రం. తీర్పును హిందూ పక్షాలకు అనుకూలంగా ఇవ్వడం ద్వారా ఆ సూత్రాన్ని కోర్టు విస్మరించింది.
- ఓ తప్పుడు చర్యను సమర్థించడం, దానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడం సివిల్ దావాలో కుదరదన్న న్యాయ సూత్రాన్ని కూడా కోర్టు పట్టించుకోలేదు
- ఈ కేసులో 142వ అధికరణాన్ని తప్పుగా అన్వయించారు
- కేవలం ఆ స్థలాన్ని స్వాధీనపర్చుకునేందుకే కేంద్ర గుమ్మటం కిందే రాముడు పుట్టాడన్న వాదనను హిందూ పక్షాలు పైకితెచ్చాయి.
- అక్కడ ఉన్నది ఓ మసీదు అనీ, అది ముస్లింల సొంతమన్న నిజాన్ని కోర్టు పరిగణించలేదు.
- మూడు శతాబ్దాల పైబడి- 1528 నుంచి 1856 దాకా అది మసీదనీ, అక్కడ నమాజ్ జరిగేదనీ అనేక తీర్పులు వచ్చాయి. భారతీయ సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 114ను సుప్రీంకోర్టు పరిగణించలేదు.
- దేశాన్ని సందర్శించిన యాత్రికుల రాతలను, పురావస్తు శాఖ నివేదికలను ఆధారాలుగా తీసుకున్నారు. నిజానికవి అసంపూర్ణం, అసమగ్రం
- మసీదు విధ్వంసాన్ని, చట్టవిరుద్ధంగా లోనికి చొచ్చుకెళ్లే చర్యలను ఆ స్థలంపై హక్కును సాధించుకోడానికే హిందూ పక్షాలు చేశాయని కోర్టు పేర్కొనడం తప్పు
- మేం మా వాదనలకు సంబంధించి వివిధ పత్రాలతో కూడిన ఆధారాలిచ్చాం. హిందూ పక్షాలు కేవలం మౌఖిక ఆధారాలు ఇచ్చాయి. కోర్టు హిందూ పక్షాలకే అనుకూల తీర్పిచ్చింది. ఇది తప్పు. 'సంభావ్యత ప్రాముఖ్య సిద్ధాంతాన్ని' ఇది సరిగా అనువర్తింపజేయకపోవడమే!

నీట్-2020 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

న్యూఢిల్లీ, డిసెంబరు 2: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్) దరఖాస్తు ప్రక్రియ సోమవారం ఆరంభమైంది. జాతీయ పరీక్ష నిర్వహణ సంస్థ(ఎన్టీఏ) వెబ్‌సైట్ ntaneet.nic.in ద్వారా అర్హులైన అభ్యర్థులు నీట్(యూజీ)-2020కి దరఖాస్తు చేసుకోవచ్చు. మే 3, 2020న నిర్వహించనున్న నీట్‌కు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. తొలిసారిగా ఈ పరీక్షను 11 భాషల్లో నిర్వహిస్తున్నారు. కీలక తేదీలు..

దరఖాస్తులకు చివరి తేదీ	డిసెంబరు 31, 2019
ఫీజు చెల్లింపు చివరి తేదీ	డిసెంబరు 31, 2019
దరఖాస్తులో మార్పుచేర్పులు	జనవరి 15, 2020
మార్పుచేర్పులకు చివరి తేదీ	జనవరి 31, 2020
అడ్మిట్‌కార్డు-2020	మార్చి 27, 2020
పరీక్ష తేదీ	మే 3, 2020
ఫలితాల వెల్లడి	జూన్ 4, 2020

ఈ-సిగరెట్ నిషేధ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 2: దేశంలో ఈ-సిగరెట్లను పూర్తిస్థాయిలో నిషేధిస్తూ చేసిన బిల్లుకు రాజ్యసభలో సోమవారం ఆమోదం లభించింది. దీనిని ఇప్పటికే లోక్‌సభ ఆమోదించగా.. సెప్టెంబరు నెలలో ఆర్డినెన్స్ విడుదలైంది. తాజాగా మూజువాణి ఓటుతో రాజ్యసభలో బిల్లు పాసవ్వడంతో.. రాష్ట్రపతి ఆమోద ముద్ర పడగానే.. 'ఎలక్ట్రానిక్ సిగరెట్ నిషేధ చట్టం-2019' అమల్లోకి రానుంది. దీని ప్రకారం.. ఈ-సిగరెట్ల క్రయవిక్రయాలు, వినియోగం, వాటిని కలిగి ఉండటం నేరం. మొదటి సారి నేరానికి ఏడాది జైలు లేదా లక్ష రూపాయల జరిమానా లేదా రెండు శిక్షలూ వేసే అవకాశాలున్నాయి. రెండో సారి నేరానికి పాల్పడితే.. మూడేళ్ల జైదుతోపాటు.. రూ. 5 లక్షల జరిమానా విధిస్తారు.

బీజేపీకి పంకజ్ ముండే ఝలక్!

▸▸ ట్విట్టర్‌లో పార్టీ వివరాలు ఎత్తివేత

▸▸ తనదారి చూసుకుంటానని సంకేతాలు

ఔరంగాబాద్, డిసెంబరు 2: బీజేపీ నేత పంకజ్ ముండే తన పార్టీకి షాక్ ఇచ్చారు. వ్యక్తిగత ట్విట్టర్ ఖాతా బయోగ్రఫీలో బీజేపీ ప్రస్తావనను, రాజకీయ ప్రస్థానాన్ని ఎత్తేశారు. నవంబరు 28న చేసిన మూడు ట్వీట్‌లలో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఉద్ధవ్ రాక్రేకు అభినందనలు తెలిపారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పంకజ్ ముండే బీడ్ జిల్లాలోని పార్లి నియోజకవర్గం నుంచి ఎన్‌సీపీ అభ్యర్థి, పెదనాన్న కొడుకు ధనుంజయ్ ముండే చేతిలో ఓడిపోయారు. పంకజ్ ముండే తండ్రి 2014లో మహారాష్ట్ర కాబోయే ముఖ్యమంత్రిగా రాజకీయంగా అత్యున్నత స్థాయిలో ఉండగా రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో గెలిచిన పంకజ్‌కు మహారాష్ట్ర కేబినెట్లో చోటు దక్కింది. ఆదివారం ఫేస్‌బుక్ పోస్టులో ఆమె డిసెంబరు 12న గోపీనాథ్ ముండే జయంతి సందర్భంగా బీడ్ జిల్లాలోని ఆయన స్మారక స్థూపం దగ్గరకు రావాలని అభిమానులకు పిలుపునిచ్చారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో రేపటి మార్గాన్ని సరి చూసుకోవాల్సి ఉందని చెప్పారు. అయితే, పంకజ్ ముండే పార్టీని వీడటం లేదని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు చంద్రకాంత్ పాటిల్ ప్రకటించారు.

మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల్ని నిరశిస్తూ సోమవారం హైకోర్టు వెలుపల ధర్నా నిర్వహిస్తున్న న్యాయవాదులు. జస్టిస్ వర్మ చేసిన సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆడపిల్లల జోలికొస్తే ఆటకట్టిస్తాం

▸▸ మంత్రి కన్నబాబు హెచ్చరిక.. కాకినాడలో కొవ్వొత్తుల ర్యాలీ

కాకినాడ, రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆడపిల్లల జోలికొస్తే వదిలే ప్రసక్తే లేదని మంత్రి కురసాల కన్నబాబు హెచ్చరించారు. దిశ హత్యాచార ఘటనను నిరసిస్తూ సోమవారం రాత్రి తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జేఎన్టీయూ, రంగరాయ వైద్య కళాశాల విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ దిశ ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. తెలుగు రాష్ట్రాలకు ఇలాంటివి మాయని మచ్చ అన్నారు. పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నా ఇలాంటివి జరగడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో ఆకతాయిల ఆట కట్టిస్తున్నామని చెప్పారు. బాలికలు, మహిళలు వేధింపులకు గురైతే తక్షణం ఎస్పీ కార్యాలయం వాట్సాప్ 94949 33233 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్పీ నేతృత్వంలో నిఘా బృందాలు నిరంతరం పహరా కాస్తున్నాయని చెప్పారు.



ఉరిశిక్ష వేస్తేనే భయం: చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

'దిశ'ను అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను ఉరితీస్తే తప్ప ఇతరులు భయపడరని టీడీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సోమవారం హైదరాబాద్ నుంచి కర్నూలుకు రోడ్డు మార్గంలో వెళ్లిన ఆయన షాద్‌నగర్‌లో మాట్లాడారు. అఘాయిత్యాలను నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందన్నారు. ఈ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన టీడీపీ నాయకులు బక్కని నర్సింహులు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని జడ్చర్ల, కొత్తకోట, పెబ్బేరు, పుల్లూరు తదితర ప్రాంతాల్లోనూ చంద్రబాబుకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటానని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

▸▸ కూతురు వరసైన బాలికపైనే నిందితుడు లైంగిక దాడి

విజయవాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి విజయవాడలోని పోక్సో ప్రత్యేక కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. రూ.500 జరిమానా విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ సమీప ఇబ్రహీంపట్నానికి చెందిన 45 ఏళ్ల మహిళ భర్త నుంచి విడిపోయింది. ఉయ్యూరులోని ఓ పరిశ్రమలో పనిచేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకునేది. అదే కర్మాగారంలో పనిచేస్తున్న సైకం కృష్ణారావు ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. తనకు భార్య లేదని, తోడుగా ఉంటానని, ఇద్దరు పిల్లల బాధ్యత కూడా తీసుకుంటానని నమ్మించి తాళి కట్టాడు. ఇబ్రహీంపట్నంలో అద్దె ఇల్లు తీసుకుని కాపురం పెట్టారు. ఆమె కుమారుడు(17) ఐటీఐ, కుమార్తె(15) పదో తరగతి చదివేవారు. ఇద్దరూ ఉయ్యూరులోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉండేవారు. కుమార్తెకు ఆరోగ్యం బాగోకపోవడంతో 2017 డిసెంబర్ 12న కృష్ణారావు, ఆ మహిళ కలిసి ఇబ్రహీంపట్నంలోని ఇంటికి తీసుకొచ్చారు. బాలికను ఇంట్లో వదిలి కృష్ణారావు దంపతులు ఇబ్రహీంపట్నం సెంటర్‌లో తోపుడు బండిపై కూరగాయలు విక్రయించేవారు. 2018 జనవరి 27న కూరగాయల బండి వద్ద నుంచి కృష్ణారావు నీళ్లు పట్టి వస్తానని చెప్పి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై కన్నేశాడు. వరసకు కూతురవుతుందన్న విచక్షణ కూడా లేకుండా ఆ చిన్నారిపై అత్యాచారం చేశాడు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడలోని పోక్సో కేసుల ప్రత్యేక కోర్టు విచారించి నేరం రుజువుకావడంతో జైలు శిక్ష విధించింది.

క్షమాభిక్షలతో సాగదీయొద్దు!

(మొదటిపేజీ తరువాయి)

మానవత్వానికే మాయని మచ్చ అని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు అన్నారు. హత్యాచార నిందితులు కూడా అప్పీళ్లు, క్షమాభిక్ష పిటిషన్ ముసుగులో ఏళ్ల తరబడి కేసులను సాగదీస్తున్నారని, దాంతో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగిన భావన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి క్షమాభిక్ష కోరే అవకాశం కూడా లేకుండా చేయాలన్నారు. ఇంతకంటే అమానవీయ ఘటన మరొకటుండదని, వీటిని అరికట్టేందుకు ఎంతటి కఠోర చట్టాన్ని చేయడానికైనా వెనుకాడమని కేంద్ర ప్రభుత్వం తరఫున లోక్‌సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజ్యసభలో చైర్మన్ వెంకయ్య నాయుడు సోమవారం సభ ప్రారంభం కాగానే జీవో అవర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై చర్చను ప్రారంభించారు. హైదరాబాద్ ఘటన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. ఇది మానవత్వానికే మచ్చలాంటిదని అన్నారు. త్వరితగతిన విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసినప్పటికీ, మళ్లీ పై స్థాయిలో విచారణ జరుగుతోందని, చివరకు క్షమాభిక్ష పిటిషన్ల పేరుతో రాష్ట్రపతి వరకు వెళుతోందన్నారు. న్యాయ ప్రక్రియలో ఆలస్యం కారణంగా న్యాయం జరుగుతుందనే భావన కలగడం లేదని, అందుకే, న్యాయవ్యవస్థలో మార్పుల గురించి ఆలోచించాలని సూచించారు. నిరంతర నిఘా, ప్రతి కేసు నమోదు చేయడం, టీవీ, సోషల్ మీడియాలపై అదుపు వంటివి అత్యవసరమన్నారు. ఇలాంటి తీవ్రమైన అంశంపై రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పుతోనే అత్యాచార సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఇందుకు నాయకులు, పత్రికలు, సినిమా రంగం వారు దృష్టి పెట్టాలని సూచించారు. నీలి చిత్రాలను అరికట్టాలని, జాతీయ రహదారులపై మద్యం, డ్రగ్స్ అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజ్యసభలో చర్చను గులాం నబీ ఆజాద్ ప్రారంభించారు. ఘాతుక చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, కులం, మతానికి అతీతంగా దోషులందరికీ సమాన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. కొరియా, అమెరికాలోని కాలిఫోర్నియా లాంటిచోట్ల ఇలాంటి నేరగాళ్లకు సర్జికల్, రసాయనిక అంగవిచ్ఛేదం చేస్తారని, కోర్టులకు ఆ శిక్ష విధించే అధికారం కల్పించాలని డీఎంకే సభ్యుడు పి.విల్సన్ సూచించారు. మనిషి మనస్తత్వం మారనిదే చట్టాలు ఏమీ చేయలేవని, న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ, అధికార వ్యవస్థ కలిసికట్టుగా సంస్కరణల గురించి యోచించాలని గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ అమీ యాజ్ఞిక్ అన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను బయటకు పంపించాలంటే భయపడుతున్నారని ఎండీఎంకే ఎంపీ వైగో అన్నారు. స్త్రీలపై ఘాతుకాలకు పాల్పడ్డ వారిని బహిరంగంగా కొట్టిచంపడమే సరైన శిక్ష అని సమాజ్‌వాదీ ఎంపీ జయాబచ్చన్ అన్నారు.

దిశా హత్యాచారాన్ని నిరసిస్తూ ప్రకాశం జిల్లా చీరాలలో విద్యార్థుల మానవహారం

పూజించడం కాదు.. బతకనివ్వండి: వంగ గీత

మహిళలు తమను పూజించాలని అనడం లేదని, తమ బతుకులు తాము క్షేమంగా బతికేలా చూడాలని కోరుతున్నారని వైసీపీ ఎంపీ గీత అన్నారు. కాంగ్రెస్ సభ్యుడు మహ్మద్ అలీ ఖాన్, ఆప్ సభ్యుడు సంజయ్ సింగ్ మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలను మతం కోణంలో చూడొద్దని, నలుగురు ముద్దాయిలూ నాలుగు విభిన్న మతాలకు చెందిన వారని ప్రస్తావించారు. బీఎస్పీ సభ్యుడు డ్యానిష్ అలీ మాట్లాడుతూ, ఈ ఘటన మొత్తం దేశానికే సిగ్గు చేటన్నారు. కాగా, హైదరాబాద్ తరహా ఘటనలను అరికట్టేందుకు ఎలాంటి చట్టాలు చేయడానికైనా వెనుకాడబోమని లోక్‌సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఘాతుకం మొత్తం దేశానికి తలవంపులు తెచ్చిందని, అందరి మనసులను గాయ పరిచిందని, నేరగాళ్లకు కఠినమైన శిక్షలు విధించాల్సి ఉందని రాజ్‌నాథ్ చెప్పారు. ఇలాంటి నేరాలపై రాజీలేని విధంగా వ్యవహరిస్తామని, సీఆర్‌పీసీ, ఐపీసీల్లో మార్పులు తెస్తామని కిషన్‌రెడ్డి ప్రకటించారు. వీలైతే ఈ సమావేశాల్లోనే చేస్తామన్నారు.

'సిట్' ముందుకు అవినాశ్ రెడ్డి తండ్రి

▸▸ సీఎం మరో బంధువుకూ ప్రశ్నలు.. ఇద్దరు టీడీపీనేతలపైనా విచారణ

▸▸ వివేకా హత్య కేసులో మళ్లీ కదలిక

కడప, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ముఖ్యమంత్రి జగన్ బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో 'సిట్ దర్యాప్తు ఒక్కసారిగా వేగం పుంజుకొంది. జగన్‌కు సమీప బంధువు, ఎంపీ అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డితోపాటు మనోహర్ రెడ్డిలను సిట్ అధికారులు సోమవారం పిలిపించి ప్రశ్నించారు. అలాగే.. టీడీపీకి చెందిన శివరాఘవరెడ్డి సహా ఇద్దరు టీడీపీ నేతలనూ సిట్ బృందం ప్రశ్నించినట్టు సమాచారం. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలైనా స్వయానా బాబాయిని హత్య చేసిన నిందితులను ఎందుకు పట్టుకోలేదని గతవారం కడప జిల్లాలో పర్యటించిన ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఈ నెల 24 నుంచి సీఎం జగన్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో వివేకా హత్య కేసులో సిట్.. సీఎం సమీప బంధువులను పిలిపించి ప్రశ్నించడం సంచలనం సృష్టించింది. గతంలో భాస్కర్ రెడ్డిని పులివెందులలోనే ఒకసారి ప్రశ్నించారు. ఇప్పుడు కడపకు పిలిపించి రహస్య ప్రాంతంలో విచారణ జరిపినట్లు తెలిసింది. సోమవారం రాత్రి పొద్దుపోయేదాకా ఈ విచారణ కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఈ ఏడాది మార్చి 15న పులివెందులలోని తన స్వగృహంలో వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసును ఛేదించేందుకు అప్పటి సీఎం చంద్రబాబు సిట్ బృందాన్ని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా టెక్నికల్ టీం, ఫీడ్ టీం, డాక్యుమెంటరీ సేకరణ టీం, ఇన్వెస్టిగేషన్ టీంలను నియమించారు. అప్పట్లో ఎన్నికలకమిషన్ ఆదేశాల మేరకు మార్చి 26న నాటి కడప ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మను బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎస్పీగా అభిషేక్ మహంతిని నియమించారు. మహంతి ఆధ్వర్యంలోనే వివేకా హత్య కేసును సిట్ బృందం దర్యాప్తు చేసింది. మే 30న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టారు. విచారణ కొనసాగుతుండగానే సిట్‌కు నాయకత్వం వహిస్తున్న ఎస్పీ మహంతి నెలన్నర క్రితం దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో.. ఆయన స్థానంలో ఎస్పీగా కేకేఎన్ అన్బురాజన్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం సిట్ విచారణకు ఆయనే నేతృత్వం వహిస్తున్నారు.

మా పిల్లల పేర్లు కూడా 'దిశ'యే!

▸▸ ఇప్పుడెందుకు పేరు మార్పు?

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హత్యాచార బాధితురాలి పేరును పోలీసులు.. 'దిశ'గా మార్చడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలి పేరు, వివరాలు రెండు, మూడు రోజులపాటు ప్రచారమైన తర్వాత.. పేరు మారుస్తూ నిర్ణయం తీసుకోవడమేమిటని కొంపల్లికి చెందిన కవి పీవీ మూర్తిరాజు అభిప్రాయపడ్డారు. తన మనవరాలి పేరు 'దిశ' అని.. ఈ పేరున్న చాలా మంది ఉంటారని, వారికి పోలీసుల నిర్ణయం ఇబ్బంది కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనే కాదు.. తమ పిల్లల పేర్లు కూడా 'దిశ' అని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

దిశ అస్థికలను కృష్ణానదిలో కలిపిన తండ్రి

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబరు 2: తన కుమార్తె అస్థికలను తన చేతులతో నదిలో కలిపే దుస్థితి వస్తుందని ఊహించలేదని.. దిశ తండ్రి కన్నీటిపర్యంతమయ్యారు. ఇటీవల హత్యాచారానికి గురైన దిశ అస్థికలను సోమవారం బాధిత కుటుంబ సభ్యులు జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం బీచుపల్లి వద్ద కృష్ణానదిలో కలిపారు. అనంతరం దిశ తండ్రి మీడియాతో మాట్లాడారు. తన కుమార్తె పట్ల అతి కిరాతకంగా ప్రవర్తించిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇక జీరో ఎఫ్ఐఆర్

▸▸ బాధితులకు సరిహద్దుల సాకు చెప్పొద్దు

▸▸ పరిధి తెలుసుకొని ఫిర్యాదు చేయాలంటే.. అప్పటికే దారుణాలు జరిగిపోతాయి!

▸▸ తీవ్రనేరాల్లో ఫిర్యాదు నిరాకరిస్తే ప్రాసిక్యూషనే: డీజీపీ

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సరిహద్దుల సాకు చెప్పకుండా జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయండి' అని డీజీపీ గౌతమ్ సవాంగ్ రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దిశ ఘటన నేపథ్యంలో పోలీసు స్టేషన్లలో పరిధి పేరుతో ఫిర్యాదు నిరాకరిస్తోన్న అంశం చర్చనీయాంశమైంది. దీంతో ఏపీ పోలీస్ బాస్ చర్యలు చేపట్టారు. ఎవరైనా బాధితులు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ, న్యాయం కోసం సమీప పోలీస

ప్రపంచ కప్ జట్టులో తిలక్

భారత అండర్-19 జట్టు ఎంపిక

తిలక్ వర్మ

ముంబై: తెలుగు కుర్రాడు నంబూరి రాకూర్ తిలక్ వర్మ అద్భుత చాన్స్ కొట్టేశాడు. ఈ హైదరాబాదీ యువ క్రికెటర్ ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌నకు ఎంపికయ్యాడు. వచ్చే జనవరి 17 నుంచి ఫిబ్రవరి 9 వరకు దక్షిణాఫ్రికా వేదికగా ఈ మెగా టోర్నమెంట్ జరగనుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన టాపార్డర్ బ్యాట్స్‌మన్, 19 ఏళ్ల ప్రియమ్ గార్గ్ 15 మంది సభ్యుల ఈ ప్రపంచకప్‌లో కెప్టెన్‌గా భారత జట్టును ముందుండి నడిపించనున్నాడు. వికెట్ కీపర్ ధ్రువ్ చంద్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇక.. ఇటీవల యూత్ ఆసియా కప్‌లో జాతీయ జట్టు తరఫున ఆడిన 17 ఏళ్ల తిలక్‌కు ఇది రెండో అంతర్జాతీయ టోర్నమెంట్ కావడం విశేషం. ఈ మెగా ఈవెంట్‌కు ఎంపికైన మరో స్టార్ ఆటగాడు యశస్వి జైస్వాల్. 17 ఏళ్ల యశస్వి.. ఈ ఏడాది విజయ్ హజారే ట్రోఫీలో డబుల్ సెంచరీ కొట్టి లిస్ట్-ఎ మ్యాచ్‌లో ఈ ఘనత సాధించిన పిన్న వయసు ఆటగాడిగా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. అండర్-19 ప్రపంచకప్‌లో పోటీపడే మొత్తం 16 జట్లను నాలుగు (ఎ, బి, సి, డి) గ్రూపులుగా విభజించారు. క్వాలిఫయర్ జపాన్, న్యూజిలాండ్, శ్రీలంక జట్లతో కలిపి భారత్ గ్రూప్-ఎ నుంచి తలపడనుంది. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ లీగ్ దశకు అర్హత సాధిస్తాయి. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న యువ భారత్ ఈ టోర్నీలో నాలుగుసార్లు విజేతగా నిలిచింది. ప్రపంచకప్ కంటే ముందు ఈ భారత యువ జట్టు సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్, ఆ వెంటనే క్వాడ్రాంగులర్ సిరీస్ ఆడనుంది. ఈ రెండు సిరీస్‌లకు కూడా ప్రియమ్ గార్గ్ సారథిగా వ్యవహరిస్తాడు. కాగా, ఈ సిరీస్‌లకు భారత జట్టులో అదనపు ఆటగాడిగా హైదరాబాద్‌కు చెందిన సీటీఎల్ రక్షణ్ ఎంపికయ్యాడు.

ధోనీపై మరో ఏడు ఫిర్యాదులు

న్యూఢిల్లీ: మహేంద్రసింగ్ ధోనీ మెడకు ఆమ్రపాలి సంస్థ కేసు మరింతగా బిగదీసుకుంది. ఎఫ్ఐఆర్‌లో ఆయనను కూడా నిందితుడిగా చేర్చాలంటూ ఢిల్లీ పోలీస్ ఆర్థిక నేరాల విభాగానికి ఏడు ఫిర్యాదులు అందాయి. ఇళ్ల కొనుగోలుదారుల సొమ్మును చట్టవిరుద్ధంగా వివిధ కంపెనీలకు రియల్ ఎస్టేట్ సంస్థ 'ఆమ్రపాలి' మళ్లించినట్లు నిరుడు జూలైలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. 'ఈ కంపెనీల్లో ధోని భార్య సాక్షి డైరెక్టర్‌గా ఉన్నవి కూడా ఉన్నాయి. ఆమ్రపాలికి బ్రాండ్ అంబాసిడర్ హోదాలో మధ్యతరగతి కొనుగోలుదారుల నుంచి పెట్టుబడులు పెట్టేట్లు చేసి ఆ సొమ్మును కంపెనీలకు మళ్లించారు' అని ఫిర్యాదుదారులు ఆరోపించారు.

పరుగు ఇవ్వకుండానే.. ఆరు వికెట్లు

మహిళల టీ20ల్లో నేపాలీ అమ్మాయి రికార్డు

పోఖ్రా (నేపాల్): మహిళల టీ20ల్లో నేపాల్ బౌలర్ అంజలీ చందా చరిత్ర సృష్టించింది. దక్షిణాసియా క్రీడల్లో భాగంగా మాల్దీవులతో జరిగిన మ్యాచ్‌లో అంజలీ (6/0) ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా ఆరు వికెట్లు పడగొట్టింది. ఓ అంతర్జాతీయ మ్యాచ్‌లో ఈ గణాంకాలు నమోదు కావడం ఇదే తొలిసారి. అంజలీ దెబ్బకు మల్దీవులు 11 ఓవర్లలో 17 పరుగులకే ఆలౌటైంది. కేవలం 2.1 ఓవర్లలోనే చాంద్ 6 వికెట్లు కైవసం చేసుకుంది. ఈ క్రమంలో మహిళల టీ20ల్లో మలేసియాకు చెందిన మాస్ ఎలీసా (6/3) రికార్డును అంజలీ బ్రేక్ చేసింది. స్వల్ప లక్ష్యాన్ని నేపాల్ 0.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా ఛేదించింది. కాగా, పురుషుల టీ20ల్లో దీపక్ చాహర్ (6/7) హ్యాట్రిక్‌తో ఈ ఘనతను సాధించాడు. ఇప్పుడు అంజలీ అతడి కంటే మెరుగైన గణాంకాలను నమోదు చేసింది.

శ్రీకాంత్ బృందం అదుర్స్

- బ్యాడ్మింటన్‌లో రెండు స్వర్ణాలు
- తైక్వాండోలో 9 పతకాలు
- దక్షిణాసియా క్రీడల్లో సత్తాచాటిన భారత్

పోఖార: దక్షిణాసియా క్రీడల్లో భారత్ గ్రాండ్‌గా బోణీ కొట్టింది. సోమవారం పోటీల్లో బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్లలో రెండు స్వర్ణాలతో పాటు తైక్వాండోలో 9 పతకాలు కొల్లగొట్టింది. పురుషుల టీమ్ ఈవెంట్‌లో కిడాంబి శ్రీకాంత్ సారథ్యంలోని భారత జట్టు ఫైనల్లో 3-1తో శ్రీలంకను ఓడించి పసిడి అందుకుంది. మహిళల టీమ్ ఈవెంట్‌లో భారత్ 3-0తో శ్రీలంకపై గెలిచి బంగారు పతకాన్ని ముద్దాడింది. ట్రయథ్లాన్‌లో సినిమోల్ స్వర్ణం, బిశ్వజిత్ రజతం.. మహిళల్లో సరోజిని, ప్రజ్ఞా రజతం, కాంస్యం నెగ్గారు. తైక్వాండోలోరెండు స్వర్ణాలు, ఐదు రజతాలు, ఓ కాంస్యం సాధించారు. సోమవారం నాటికి భారత్ 16 పతకాల (5 స్వర్ణాలు, 8 రజతాలు, 3 కాంస్యాలు)తో రెండోస్థానంలో ఉంది.

108 మందితో చెస్

రికార్డు నెలకొల్పిన గిరినాథ్

భీమవరం : ఏకకాలంలో 108 మంది విద్యార్థులతో చెస్ ఆడి ఇంటర్నేషనల్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. తెలుగు రాష్ట్రాలలో ఇంత వరకు 70 మందితో చెస్ ఆడిన రికార్డు ఉంది. దానిని అధిగమిస్తూ 108 మందితో చెస్ ఆడి ఉభయ తెలుగు రాష్ట్రాలలో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఈ ఆట ఐదు గంటలపాటు సాగింది.

ఫెడరర్ ముఖచిత్రంతో వెండి నాణెం

బెర్న్ (స్విట్జర్లాండ్): టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌ను స్విట్జర్లాండ్ ప్రభుత్వం అరుదైన గౌరవంతో సత్కరించింది. 20 ఫ్రాంక్ (స్విస్ కరెన్సీ)ల ప్రత్యేక వెండి నాణెంపై ఫెడరర్ ముఖచిత్రాన్ని రూపొందించింది. ఇలా.. జీవించి ఉన్న వ్యక్తి పేరిట ఓ స్మారక నాణేన్ని తయారు చేయడం స్విస్ దేశ చరిత్రలో ఇదే తొలిసారని ఆ ప్రభుత్వం ప్రకటించింది. 'స్విస్ క్రీడా చరిత్రలోనే అత్యంత విజయవంతమైన వ్యక్తి, 20 గ్రాండ్‌స్లామ్స్ చాంపియన్ ఫెడరర్‌కు మేమిచ్చే గౌరవం ఇది' అని స్విస్ ప్రభుత్వం పేర్కొంది. వచ్చే ఏడు 50 ఫ్రాంక్‌ల బంగారు నాణెంపై ఫెడరర్ ముఖచిత్రాన్ని రూపొందిస్తామని వెల్లడించింది.

ఈ దివ్యాంగులు.. ఆటలో అసమానులు

నేడు దివ్యాంగుల దినోత్సవం

ఏదైన సాధించాలన్న కసి, పట్టుదల ఉన్నవారికి వైకల్యం అడ్డుకాదని నిరూపించారు ఈ ముగ్గురు దివ్యాంగులు. వారిలో ఒకరు పోలియోతో పుట్టుకతోనే దివ్యాంగుడిగా కళ్లు తెలిస్తే, మిగిలిన ఇద్దరు ప్రమాదవశాత్తు అంగవికలురుగా మారారు. తాము సాధారణ వ్యక్తులకు తక్కువేమీ కాదని నిరూపించడానికి ఆ ముగ్గురు కఠోరంగా శ్రమించారు. క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని తామేంటో ప్రపంచానికి చాటిచెప్పిన రామాంజనేయులు, శేఖర్ గౌడ్, అర్షద్‌పై ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి

రామాంజనేయులు

ఏస్ షట్లర్

పోలియో మహమ్మారి కారణంగా పుట్టుకతోనే రెండు కాళ్లు అచేతనమయ్యాయి. అందరిలా నడవలేక, పరిగెత్తలేకపోతున్నానన్న బాధ ఆ పసి హృదయాన్ని కల్లోల పరిచింది. జీవితంలో తానేమీ సాధించలేనా? అన్న అంధకారం నుంచి బయటపడడానికి మార్గాలు అన్వేషించాడు. కాళ్లు పనిచేయక పోతే ఏమైంది శరీరంలోని ఇతర అవయవాలు బాగానే ఉన్నాయి కదా.. ఈ భూమ్మీదకు వచ్చినందుకు ఏదైనా సాధించాలని సంకల్పించిన అతడి పేరు బోయ రామాంజనేయులు. కర్నూలు జిల్లా గూడూరు మండలం మునగాల అతడి స్వస్థలం. ట్రై సైక్లింగ్‌తో కెరీర్ మొదలుపెట్టాడు. ఆ తర్వాత జావెలిన్, డిస్కస్‌త్రో, బ్యాడ్మింటన్‌లో అడుగుపెట్టి ప్రావీణ్యం సాధించాడు. తొలుత రెగ్యులర్‌గా వాడే ట్రై సైకిల్..దివ్యాంగుల క్రీడల పోటీల్లో ఒక భాగమని తెలుసుకొని దానిపై దృష్టి సారించాడు. 2005లో జాతీయ ట్రై సైకిల్ పోటీల్లో 4 పతకాలు సాధించాడు. ఆ తర్వాత 2007లో జాతీయ జావెలిన్, డిస్కస్ త్రో పోటీల్లో 2 పసిడి, 3 రజతాలు కొల్లగొట్టాడు. 2009లో బ్యాడ్మింటన్‌లో ప్రవేశించిన రామాంజనేయులు స్వల్ప కాలంలోనే ఆ క్రీడలోనూ సత్తా చాటాడు. ఇప్పటిదాకా రెండు పారా బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్ (2013, 2017)ల్లో పాల్గొన్న అతడు ఉగాండా, దుబాయ్ ఓపెన్‌లలో పసిడి, కాంస్య పతకాలు సాధించి తానేంటో నిరూపించుకున్నాడు. ప్రస్తుతం కర్నూలులో ఇంటర్నెట్ సెంటర్‌ను నిర్వహిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్నాడు.

పర్వత ధీరుడు

విద్యుదాఘాతంతో పద్దెనిమిదేళ్ల వయసులో కుడి భుజం, ఎడమకాలి పాదం కోల్పోయాడు. ఉరకలేసే ప్రాయంలో తగిలిన ఈ ఎదురుదెబ్బతో చిడుగుల్ల శేఖర్ గౌడ్ (28) కుంగిపోలేదు. బంధువులు, స్నేహితులు చూపించే జాలి చూపుల్లోని సానుభూతి అతడికి నచ్చలేదు. అవయువాలు కోల్పోతే జీవితం అక్కడితో ముగిసిపోయినట్టు కాదని తనకి తాను ధైర్యం చెప్పుకొని ముందడుగు వేశాడు. శేఖర్ స్వస్థలం యాదాద్రి జిల్లా చౌటుప్పల్. కొంత కాలం తర్వాత ప్రముఖ పర్వతారోహకుడు తమ్మినేని భరత్ మార్గదర్శకంలో ట్రెక్కింగ్ సాధన చేయడం ప్రారంభించాడు. అలా సాహసోపేతమైన పర్వతారోహణపై దృష్టి పెట్టాడు. తొలుత చిన్నచిన్న గుట్టలతో మొదలెట్టి... శిఖరాలు అధిరోహించే సామర్థ్యాన్ని సంపాదించాడు. ఫిజికల్ ఫిట్‌నెస్ పెంచుకోవడానికి ఆహార అలవాట్లను మార్చుకొని ప్రత్యేక కసరత్తులు చేసి పర్వతారోహణకు సిద్ధమయ్యాడు. అయితే, తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో పేదరికం, ఆర్థిక స్థితిగతులు శేఖర్ సెవెన్ సమిట్ (ఏడు ఖండాల్లోని ఎత్తయిన శిఖరాలు) గమ్యానికి అవరోధంగా మారాయి. తన లక్ష్యానికి అవసరమైన నిధులు సమీకరించుకోవడానికి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో రికార్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ జీతంతో తన పొట్ట నింపుకొంటూనే పర్వతారోహణకు అవసరమైన నిధులు సమకూర్చుకున్నాడు. తొలుత ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను విజయవంతంగా చేరుకున్నాడు. ఈ ఆత్మవిశ్వాసంతో గత ఆగస్టులో రష్యాలోని ఎత్తయిన మంచు పర్వతం మౌంట్ ఎల్బరస్ (5,642 మీ.)ను, అక్టోబరులో ఆఫ్రికా ఖండంలోని మౌంట్ కిలిమంజారో (5,895 మీ.)ను అధిరోహించాడు. అంగవైకల్యంతో కుంగిపోకుండా నమ్మకంతో ముందడుగు వేస్తే విజయం తప్పకుండా వరిస్తుందని శేఖర్ గౌడ్ ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడు.

శేఖర్ గౌడ్

షేక్ అర్షద్

కండల వీరుడు

కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన షేక్ అర్షద్ (27)కు బాల్యం నుంచి బాడీ బిల్డింగ్ అంటే మక్కువ. దేశం గర్వించే బాడీబిల్డర్ కావాలన్నది అతడి ఆశయం. ఎనిమిదో తరగతి చదువుతుండగా పాఠశాలకి వెళ్లి వస్తుంటే రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎడమ కాలిని కోల్పోయాడు. ఈ సంఘటన బాడీబిల్డర్ కావాలన్న అతడి ఆశలపై నీళ్లుజల్లింది. ఈ తరుణంలో తల్లిదండ్రులు అండగా నిలిచి ప్రోత్సహించడంతో ప్రమాద చీకట్ల నుంచి బయటపడ్డాడు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బాడీబిల్డింగ్ పోటీల్లో 14 పతకాలు సాధించి శభాష్ అనిపించాడు. ఇందులో ఐదు స్వర్ణ పతకాలు ఉండడం విశేషం. జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమించేవారికి అవయవ వైకల్యం అవరోధం కాదని అర్షద్ చెబుతున్నాడు.

డోపింగ్‌లో దొరికిన మహిళా బాక్సర్

నీరజ్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది టోక్యో ఒలింపిక్స్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో భారత బాక్సింగ్ శిబిరంలో షాక్‌కు గురిచేసే పరిణామం. అంతర్జాతీయ మహిళా బాక్సర్ నీరజ్ (57 కిలోలు) డోప్ పరీక్షలో విఫలమైంది. టోక్యో విశ్వక్రీడలకు ఎంపికచేసిన ప్రాబబుల్స్ జట్టులో నీరజ్ ఒకరు. ఈ హరియాణా బాక్సర్ సామర్థ్యాన్ని పెంచే ఉత్ప్రేరకం లిగాన్‌ద్రోల్‌తో పాటు మరికొన్ని అనబాలిక్ స్టెరాయిడ్స్ వాడినట్లు తేలింది. దీంతో ఆమెపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. ఈ ఏడాది సెప్టెంబరు 24న సేకరించిన ఆమె శాంపిల్స్‌ను పరీక్షల కోసం కతార్‌లోని డోపింగ్ నిరోధక ల్యాబ్‌కు పంపించారు. ఈ పరీక్షలో ఆమె శాంపిల్ పాజిటివ్‌గా తేలినట్టు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ప్రకటించింది.

ఇంటివాడైన మనీష్ పాండే

ముంబై: భారత యువ బ్యాట్స్‌మన్ మనీష్ పాండే ఓ ఇంటివాడయ్యాడు. ప్రేయసి ఆశ్రితా శెట్టిని సోమవారం పెళ్లి చేసుకున్నాడు. ముంబైలో బంధువులు, సన్నిహితుల మధ్య వీరి వివాహం జరిగింది. కొన్నాళ్లుగా డేటింగ్‌లో ఉన్న వీరిద్దరూ ఈ ఏడాది అక్టోబరులో తమ ప్రేమాయణాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. 26 ఏళ్ల ఆశ్రిత దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన నటి. ఇప్పటికే కొన్ని సినిమాల్లో నటించిన ఈమె 2010లో బ్యూటీ పెజెంట్ అవార్డు కూడా గెలుచుకుంది.

రూట్ 'డబుల్' ఆనందం

ఇంగ్లండ్ 476 ఆలౌట్ ● న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్

జో రూట్ (226)

హామిల్టన్: గత కొన్ని రోజులుగా ఫామ్ కోసం తంటాలు పడుతున్న జో రూట్ (226) ద్వి శతకంతో మెరవడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యాన్ని నమోదు చేసింది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో 269/5తో నాలుగో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 476 పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 375 పరుగులకు అదనంగా 101 పరుగుల ఆధిక్యాన్ని నమోదు చేసింది. రూట్, వికెట్ కీపర్ ఒల్లీ పోప్ (75) ఆరో వికెట్‌కు 193 పరుగులు జోడించి టీమ్‌ను పటిష్టస్థితిలో నిలిపారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. సోమవారం ఆట ముగిసే సమయానికి 96/2 స్కోరు చేసింది. కేన్ విలియమ్సన్ (37), రాస్ టేలర్ (31) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ జీత్ రావల్ డకౌట్ కాగా.. టామ్ లాథమ్ (18)ను వోక్స్ పెవిలియన్ చేర్చాడు.

జంషెడ్‌పూర్, నార్త్ ఈస్ట్ మ్యాచ్ డ్రా

జంషెడ్‌పూర్: పనగోటిస్ ట్రియాడిస్ లేటు గోల్‌తో నార్త్ ఈస్ట్ యునైటెడ్ డ్రాతో గట్టెక్కింది. ఐఎస్ఎల్‌లో సోమవారం జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ, నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ మధ్య మ్యాచ్ 1-1తో డ్రా అయింది. సెర్గియో కాస్టల్ మార్టినెజ్ (28వ నిమిషం) గోల్ చేసి జంషెడ్‌పూర్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. అయితే, నార్త్ ఈస్ట్ ప్లేయర్ పనగోటిస్ ట్రియాడిస్ (90వ) ఆట ముగిసే సమయంలో గోల్ చేసి 1-1తో సమం చేశాడు.

పాక్ వైట్‌వాష్



- రెండో టెస్ట్‌లో ఇన్నింగ్స్ 48 పరుగులతో చిత్తు
- 2-0తో సిరీస్ ఆస్ట్రేలియా వశం
- లియాన్‌కు 5 వికెట్లు

అడిలైడ్: స్పిన్నర్ నాథన్ లియాన్ (5/69) తిప్పేయడంతో రెండో టెస్ట్ (డే/నైట్)లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు పాకిస్థాన్‌ను ఇన్నింగ్స్ 48 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మరో రోజు మిగిలుండగానే మ్యాచ్‌ను కైవసం చేసుకున్న ఆసీస్ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో వైట్‌వాష్ చేసింది. పాలో ఆన్‌లో ఓవర్‌నైట్ స్కోరు 39/3తో నాలుగో రోజైన సోమవారం ఆటను కొనసాగించిన పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 239 పరుగులకు కుప్పకూలింది. ఇన్నింగ్స్ ఓటమిని తప్పించుకోవడానికి పాక్ బ్యాట్స్‌మన్ తీవ్రంగా పోరాడారు. ముఖ్యంగా ఓపెనర్ షాన్ మసూద్ (68), అసద్ షఫిక్ (57), మహమ్మద్ రిజ్వాన్ (45) ఆసీస్ సహనాన్ని పరీక్షించారు. అయితే మసూద్, షఫిక్‌ను అవుట్ చేసిన లియాన్ పాక్ పోరాటాన్ని అడ్డుకున్నాడు. ఇఫ్తికర్ అహ్మద్ (27), యాసిర్ షా (13), షహీన్ షా అఫ్రీది (1)లు కూడా లియాన్ ఉచ్చులో చిక్కుకున్నారు. ఆస్ట్రేలియాకు ఇది వరుసగా ఆరో పింక్ బాల్ టెస్ట్ విజయం. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌ను 589/3 వద్ద డిక్లేర్ చేయగా.. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులు చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.